సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




జూన్ డేస్ తిరుగుబాటు
ఫోన్ ట్యాపింగ్ పేరు
'ఆపరేషన్ ఆర్ ఆర్'!
రువాండా – కాంగో మధ్య
చరిత్రాత్మక శాంతి ఒప్పందం
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 200 | శుక్రవారం | 20-06-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## డబ్బు బయటపడటం నిజమే





- జస్టిస్ యశ్వంత్‌వర్మ నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు
- నిర్ధారించిన ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్
- జడ్జి యశ్వంత్‌వర్మ తొలగింపును ప్రతిపాదించిన సుప్రీంకోర్టు విచారణ కమిటీ
- 10 రోజుల సమయం, 55మంది సాక్షుల విచారణ, 64పేజీల నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి చర్చనీయాంశమైన కాలిన డబ్బునోట్ల కట్టల వివాదాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నియమించిన కమిటీ తన నివేదికలో నిగ్గుతేల్చింది. హైకోర్టు జడ్జి యశ్వంత్‌వర్మ, ఆయన కుటుంబ సభ్యులు స్టోర్ రూమ్‌పై 'రహస్య లేదా క్రియాశీలత నియంత్రణ' కలిగి ఉన్నారని, అక్కడ సగం కాలిపోయిన నగదు భారీగా దొరకడం ఆయన దుష్ప్రవర్తనను రుజువు చేస్తున్నదని, ఇది ఆయనను తొలగించాలని కోరేంత తీవ్రమైనదని ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్న సుప్రీంకోర్టు నియమించిన విచారణ సంఘం నివేదిక తెలియజేసింది.పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శీల్ నాగు నేతృత్వం వహించిన ముగ్గురు జడ్జిల కమిటి 10 రోజుల పాటు విచారణ జరిపింది.మార్చి 14న దాదాపు ఉదయం 1135గంటల సమయంలో అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి, ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ యశ్వంత్‌వర్మ తరువాయి 2లో

### గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుపై

## ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు తిరస్కరించండి

- ఎపి ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది
- బనకచర్ల అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థికశాఖ, పర్యావరణ శాఖ తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు
- కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

> ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలి.
>
> – పాటిల్‌తో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్–1980 (జిడబ్ల్యూడిటి), ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రికి వారు తెలియజేశారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని ఎపి చెబుతోందని, జిడబ్ల్యూడిటి1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఎపి పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్టు నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి), జలశక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల తరువాయి 2లో

## వ్యవసాయ రంగంలో ఎఐ వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- సచివాలయంలో నెదర్లాండ్ ఎఆర్‌ఐక్యూటి కంపెనీ ప్రతినిధులతో సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ రంగంలో ఎఐ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో నెదర్లాండ్‌కు చెందిన ఎఆర్‌ఐక్యూటి కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సాంకేతికత, ప్రత్యేకించి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వృద్ధిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయరంగాన్ని ఆధునీకీకరించేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నదని ఎఆర్‌క్యూటి కంపెనీల ప్రతినిధులకు వివరించారు. అంతకు ముందు కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణ సూచనలు ఇవ్వడంలాంటి సౌకర్యాలు కల్పించగలమన్నారు.. అంతేకాకుండా పంటలపై వచ్చే చీడ పీడలను మొబైల్ ఫోన్ కెమెరా ద్వారా స్కాన్ చేసి గుర్తించే తరువాయి 2లో



## మెట్రో ఫేజ్– 2కు అనుమతులివ్వండి

కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సిఎం విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. అత్యంత తరువాయి 2లో

## రికార్డు వేగంతో రైతు భరోసా

నాలుగు రోజుల్లోనే రూ.6405 కోట్లు

62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ

ప్రజాపక్షం / హైదరాబాద్

వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా రికార్డు వేగంతో పంపిణీ చేస్తోంది. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. ఈ నెల 16వ తేదీన రైతు నేస్తం వేదికగా రైతు భరోసా చెల్లింపులను సిఎం ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే రికార్డు వేగంతో రూ. 6,405 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. గురువారం సాయంత్రం వరకు రాష్ట్రంలో ఐదు ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఇప్పటివరకు మొత్తం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ అయినట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తం 1.06 కోట్ల ఎకరాల భూములకు పెట్టుబడి సాయం అందింది. ఎకరంలోపు 24.22 లక్షల మంది రైతులు, రెండెకరాల లోపు 17.02 లక్షల మంది, మూడు ఎకరాల లోపు 10.45 లక్షల మంది, 4 ఎకరాల లోపు 6.33 లక్షల మంది, 5 ఎకరాల లోపు 4.43 లక్షల మంది ఇప్పటివరకు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందారు.

## రైతులకు బేడీలేమిటి!

గద్వాల ఎస్‌పికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఫోన్

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు బేడీలు వేయడం పట్ల రైతు కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు నుండి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో రైతులకు పోలీసులు బేడీలు వేసి తీసుకురావడం పట్ల చైర్మన్ కోదండరెడ్డి మనస్తాపానికి గురైయ్యారు. వెంటనే జోగులాంబ గద్వాల్ జిల్లా ఎస్‌పి శ్రీనివాస్ రావుకు ఫోన్ చేసిన చైర్మన్ కోదండరెడ్డి పోలీసులతీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులకు బేడీలు వేసి తీసుకువచ్చిన ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేసినట్లు చైర్మన్ కోదండరెడ్డికి ఎస్‌పి వివరణ ఇచ్చారు.



### భారత్–పాక్ యుద్ధ నివారణలో

## నా ప్రమేయం లేదు

ఎట్టకేలకు ఒప్పుకున్న డోనాల్డ్ ట్రంప్

విలేకరుల సమావేశంలో పాక్ సర్వసైన్యాధికారి ఆసిఫ్ మునీర్‌పై ప్రశంసలు

**వాషింగ్టన్ :** భారత్–పాకిస్థాన్ దేశాలు యుద్ధాన్ని విరమించడంలో తన ప్రమేయం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు అంగీకరించారు. పాకిస్థాన్ సర్వసైన్యాధికారి, ఆసిఫ్ మునీర్‌కు బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు (భారత్ కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 10.30 గంటలు) వైట్‌హౌస్ క్యాబినెట్ రూములో విందు ఇచ్చారు. విందుకు ముందు, విందు తర్వాత ట్రంప్ పాత్రికేయులతో భారత్–పాకిస్థాన్ యుద్ధ విరమణపై రెండు రకాలుగా మాట్లాడారు. విందు ముందు యుద్ధాన్ని ఆపిన ఘనత తనదే తరువాయి 2లో

## అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం నశించాలి

- గాజాపై ఇజ్రాయెల్ అమానుష దాడి సరైందికాదు
- వామపక్ష నాయకుల ఉద్ఘాటన
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

**హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం వద్ద నేతల అరెస్టు**



ప్రజాపక్షం/ రంగారెడ్డి ప్రతినిధి /గండిపేట

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి ఏరియాలో ఉన్న అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం ముందు జరిగిన నిరసన ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇటి నర్సింహ పాల్గొనగా, భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. కాగా, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం నశించాలని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద గురువారం తరువాయి 2లో

### ఇజ్రాయెల్‌పై ఇరాన్

## భీకర దాడి



- భారీగా హైపర్ సోనిక్ క్షిపణులు ప్రయోగం
- సోరోకో ఆసుపత్రి ధ్వంసం
- 40 మంది రోగులకు గాయాలు

**టెహ్రాన్ :** దక్షిణ ఇజ్రాయెల్ ప్రాంతాలపై హైపర్ సోనిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. గురువారంనాడు ఏడోరోజు యుద్ధంలో ఇజ్రాయెల్‌లోని అతిపెద్ద సోరోకో ఆసుపత్రి భవనాన్ని ధ్వంసం చేసింది. పక్కనే ఉన్న అణుస్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నామని, ఆసుపత్రిపై దాడిచేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ పేర్కొంది. ఆసుపత్రిపై జరిగిన దాడిలో 40 మంది రోగులు గాయపడినట్లు వైద్యులు చెప్పారు. దీంతోపాటు ఇజ్రాయెల్‌వ్యాప్తంగా అనేక నగరాలలో కూడా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్ భారీనష్టాన్ని చవిచూసింది. అతిఎత్తైన, బహుళ అంతస్తుల భవనాలపై ఇరాన్ క్షిపణులు దాడులు చేశాయి. రాజధాని టెల్‌అవీవ్ సమీపంలో నివాసిత భవనాలపైకి క్షిపణులు దూసుకెళ్ళాయి. భారీసంఖ్యలో మృతులు లేరు. అదేసమయంలో ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని అరాక్ భారజల రియాక్టర్‌ను ధ్వంసం చేసింది. గడచిన ఏడు రోజులుగా ఇరాన్‌లోని అణుసంబంధ వ్యవస్థలు, సీనియర్ అధికారులు, అణుశాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్నది. ఇరాన్‌లో దాదాపు 639 మంది మరణించారు. వీరిలో 263 మంది పౌరులు ఉన్నారు. 1300 మంది గాయపడ్డారు. శాటిలైట్ సహాయంతో అమెరికా ఇస్తున్న సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్ దాడులు తరువాయి 2లో

## ఆకాశంలో క్షిపణులు చూశాం...

- బాంబుల మోతలు విన్నాం
- ఇరాన్‌లో భయానక పరిస్థితిపై ఎంబిబిఎస్ విద్యార్థులు మీడియాకు వెల్లడి
- తొలి తరలింపు విమానంలో బాధితులు ఢిల్లీ విమానాశ్రయం చేరిక

**న్యూఢిల్లీ :** ఇరాన్‌ఇజ్రాయెల్ దేశా ల మధ్య భీకర యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రారంభించిన 'ఆపరేషన్ సింధు' మా ప్రాణాలను రక్షించిందని ఢిల్లీకి చేరుకున్న బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ దేశంలో వారు ఎదుర్కొన్న భయానక చేదు జ్ఞాపకాలను వివరించారు. 'మేం ఆకాశంలో క్షిపణులను చూశాం. మా పరిసరాలలో బాంబుల తరువాయి 12లో




## మహిళలకు ఆర్థిక స్వావలంబన

- ప్రజా ప్రభుత్వ లక్ష్యం అదే
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామంలో కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి

మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లాలోని జగ్గన్నపేట గ్రామం తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్‌లో ఇక ఆగస్టు 5న ప్రభుత్వ సెలవు



**ఢాకా :** ఆగస్టు ఐదోతేదీని ప్రభుత్వ సెలవుదినంగా బంగ్లాదేశ్ ప్రకటించనున్నది. గత ఏడాది ఆగస్టునెల ఐదో తేదీన బంగ్లాదేశ్‌లో లక్షలాదిమంది విద్యార్థులు షేక్ హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు తేదీని పబ్లిక్ హాలిడేగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇకమీదట పాటించనున్నది. దీనిని 'పబ్లిక్ అప్‌రైజింగ్ యానివర్సిరీ'గా ఇకమీదట పాటించనున్నట్లు బంగ్లాదేశ్ సాంస్కృతికవిభాగం సలహాదారు మొస్తాఫా సర్వార్ ఫారూఖీ ప్రకటించారు. ఇకమీదట ఆగస్టు 5వ తేదీన ప్రభుత్వంపై విద్యార్థులు మార్పుకోసం తిరుగుబాటుచేసిన దినోత్సవంగా ప్రతిసంవత్సరం పాటిస్తామన్నారు. ఢాకాలోని ఫారిన్ సర్వీస్ అకాడమీలో గురువారంనాడు పత్రికాగోష్ఠిలో ఆయన ఈ విషయం చెప్పారు. విద్యార్థుల తిరుగుబాటు కారణంగా అవామీలీగ్‌పార్టీకి చెందిన ప్రధాన మంత్రి షేక్ హసీనా దేశం వదిలివెళ్ళిపోయారు. ఆమె భారత్‌లో తలదాచుకున్నారు.

# జెలెన్‌స్కీతో ముఖాముఖీకి పుతిన్ సంసిద్ధత



**సెయింట్ పీటర్స్‌బర్గ్ :** ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ముఖాముఖీ చర్చలకు సిద్ధంగా ఉన్నానని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. వివిధ దేశాల వార్తాసంస్థల అధిపతులతో టాస్ వార్తా సంస్థ నిర్వహించిన ఒక సమావేశంలో గురువారంనాడు అనేక విషయాలపై పుతిన్ మాట్లాడారు. శాంతి చర్చల్లో ఎవరు పాల్గొన్నారనే విషయాన్ని తాను పట్టించుకోనని పుతిన్ చెప్పారు. శాంతి చర్చల తుదిదశలో జెలెన్‌స్కీతో ముఖాముఖీ సంప్రదింపులకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. శాంతి చర్చల ఒప్పందంపై సంతకం చేయడానికి జెలెన్‌స్కీకి ఉన్న అధికారం ఏమిటని పుతిన్ ప్రశ్నించారు. ఆయన పదవీకాలం ముగిసిందని, ఆయన అనధికారికంగా అధ్యక్షుడుగా కొనసాగుతున్నారని విమర్శించారు. సాంకేతికంగా చూస్తే జెలెన్‌స్కీ పదవీకాలం ముగిసిందని, ప్రస్తుతం మార్షల్ లా చట్టపరిధిలో ఉక్రేన్ పాలన కొనసాగుతోందన్నారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఏదో గుడ్డిగా విరమింపజేయడానికి ఎలాంటి ప్రాధాన్యతా లేదని, ఇలాంటి సమస్యలు, యుద్ధాలు భవిష్యత్‌లో మళ్ళీ రాకుండా శాశ్వత పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉందని చెబుతూ, పుతిన్ ఒక షరతు విధించారు. ఈ చర్చల్లో ప్రతిపాదనలు దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేర్చేవిగా, సమస్యలను పరిష్కరించేవిగా ఉండాలన్నారు. సంప్రదింపులు ఒక కొలిక్కి వచ్చిన తర్వాత తుదిదశలో మాత్రమే తాను జెలెన్‌స్కీతో చర్చలకు సిద్ధపడతానన్నారు. ఐతే ఈ సంప్రదింపులు ఎప్పుడు జరుగుతాయి? ఎప్పుడు ప్రారంభం అవుతాయి? అనే విషయాన్ని ఆయన చెప్పలేదు. తుర్కియే (టర్కీ) చొరవతో రెండు విడతలుగా ఇస్తాంబుల్‌లో ఉక్రేన్–రష్యా ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఒకవైపు దాడులు కూడా కొనసాగాయి.

**ఉక్రేన్‌కు 6000 పైగా మృతదేహాలు అప్పగింత**



ఉక్రేన్‌కు 6000కు పైగా సైనికుల మృతదేహాలను రష్యా ప్రభుత్వం స్వాధీనం చేశామని పుతిన్ చెప్పారు. మరో 3000 మంది ఉక్రేన్ సైనికుల మృతదేహాలను స్వాధీనం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇస్తాంబుల్‌లో రెండో విడత జరిగిన చర్చల సందర్భంగా కుదిరిన ఒప్పందాన్ని గౌరవించి అందుకు అనుగుణంగా మూడు రోజు లు కాల్పుల విరమణ పాటించామని, మృతదేహాలను ఒకచోటచేర్చి వాటిని ఉక్రేన్‌కు స్వాధీనం చేశామని పుతిన్ చెప్పారు. రెండు దేశాలు సజీవంగా 1200 మంది సైనికుల వంతును ఇరువైపులా పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలని కూడా నిర్ణయించుకున్నామని, ఉక్రేన్ నుండి 1200 మంది రష్యా సైనికులను ఇచ్చిపుచ్చుకునే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.ఇప్పటికే 500 మంది ఉక్రేన్ సైనికులను వారికి అప్పగించామని, 400 మంది రష్యా సైనికులను వెనక్కు తెచ్చుకున్నామని చెప్పారు. ఇంతకుముందు కూడా రెండుసార్లు మూడు రోజులపాటు రెండు దేశాలు పాతికేళ్ళలోపు వయసుగల సైనికులను సగౌరవంగా ఇచ్చిపుచ్చుకున్నాయి.

కాగా యూరోపియన్ దేశాలు తమతో సంబంధాలను రద్దుచేసుకున్నాయని, వారు కోరుకుంటే తిరిగి సహకారాన్ని పునరుద్ధరించడానికి రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ అన్నారు. దాదాపు రెండేళ్ళక్రితం జర్మనీ మాజీ ఛాన్సలర్ ఓలాఫ్ షల్జ్ సహా ఇతర యూరప్ నాయకులు తనతో నిత్యసంబంధాలు కలిగి ఉన్నారని, కానీ యుద్ధరంగంలో రష్యాను ఓడించేందుకు వ్యూహాత్మక కుట్రలు చేయడం ప్రారంభించిన తర్వాత వారు తనతో టచ్‌లో లేకుండాపోయారన్నారు. అదేవిధంగా యుద్ధ మండలంలో జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపడం నేరం అవుతుందని పుతిన్ అన్నారు.

### రువాండా – కాంగో మధ్య
# చరిత్రాత్మక శాంతి ఒప్పందం

దశాబ్దాలనాటి యుద్ధానికి ఇక తెర



**వాషింగ్టన్ :** సెంట్రల్ ఆఫ్రికాలో ఇరుగుపొరుగు దేశాలైన డి.ఆర్.కాంగో, రువాండా మధ్య దశాబ్దాలుగా జరుగుతున్న యుద్ధానికి తెరపడేందుకు రంగం సిద్ధమైంది. ఈ రెండు దేశాలూ శాంతి ఒప్పందానికి సంబంధించి ఒక ముసాయిదా తీర్మానంపై పరస్పరం అంగీకారం తెలియజేశాయి. శుక్రవారంనాడు ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు జరుగుతాయి. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సమక్షంలో ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు జరుగుతాయి. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఈ రెండు దేశాలమధ్య రాజకీయ భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై గడచిన మూడు రోజులుగా నిర్మాణాత్మకమైన చర్చలు జరిగాయి. చర్చల అనంతరం ముసాయిదా ఒప్పందంపై అంగీకారం కుదిరింది. రెండు దేశాలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు ఈ ముసాయిదా శాంతి ఒప్పందంపై అంగీకారం తెలియజేశారు. గతంలో రెండు దేశాలూ సంతకాలు చేసిన ఒక ఒప్పందం పునాదులపై ఈ కొత్త ఒప్పందం జరిగింది. ఈ ఏడాది ఆరంభంలో తూర్పు డి.ఆర్.కాంగోలో ఎం–23 తిరుగుబాటు దారులు ఖనివనరుల నిక్షేపాలు అత్యధికంగా ఉండే స్వాత్ ప్రాంతాలను ఆక్రమించాయి. దీంతో దారుణహింసాకాండ చెలరేగింది. ఎం–23 ఉగ్రవాదులు రువాండా ప్రభుత్వ సైన్యం అండదండలతోనే డి.ఆర్.కాంగోలోకి ప్రవేశించి దురాక్రమణకు పాల్పడి హింసాకాండ సృష్టించారు. ఈ హింసవల్ల ఇటీవలి నెలల్లో వేలాదిమంది మరణించారు. అనేకవేలమంది ఇళ్ళు వదిలిపారిపోయారు. నిరాశ్రయులయ్యారు. మరి ఇక స్వాత్స్ ప్రాంతాన్ని ఎం–23 తిరుగుబాటుదారులు ఖాళీచేసి వెళ్ళిపోతారా? తూర్పు కాంగో ప్రాంతం నుండి రువాండా గ్రూపు లు వెనక్కి వెళతాయా? రువాండా ప్రభుత్వం తన తప్పు ఒప్పుకుంటుందా? ఒప్పందం ప్రకారం ఎం–23 తిరుగుబాటు దారులు ఆయుధాలను వదిలేస్తారా? మానవతా సహాయాన్ని పంపిణీ చేయడానికి గోమా విమానాశ్రయాన్ని తిరిగి తెరుస్తారా?లేదా? అనే విషయాలన్నీ ఇప్పటికీ ప్రశ్నార్థకాలుగానే మిగిలిపోయాయి.

ఈ ఒప్పందం జరగడానికి అమెరికా, ఖతార్ దేశాలు మధ్యవర్తిత్వం చేశాయి. తూర్పు డి.ఆర్.కాంగోలో దశాబ్దాలుగా రువాండా, కాంగోలకు చెందిన సాయుధ గ్రూపులమధ్య యుద్ధం హింసాకాండ కొనసాగుతున్నది. ఈ హింసను విడనాడి, యుద్ధాన్ని విరమించేందుకు వీలుగా తగిన షరతులు, నిబంధనలు, ఆయుధాలను వదలిపెట్టి వెనక్కు తగ్గి ఉండేందుకు వీలైన షరతులను మధ్యవర్తిదేశాలైన అమెరికా, ఖతార్‌లు రూపొందించాయి. అమెరికా విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ ముసాయిదా ఒప్పంద రూపకల్పనలో కీలకపాత్ర వహించింది. తదుపరి కాలంలో ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి యుద్ధజ్వాలలు చెలరేగకుండా ఉండేందుకు ఒక ఉమ్మడి భద్రతా పర్యవేక్షణ యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ఈ యంత్రాంగం ఈ పరిస్థిలను పర్యవేక్షిస్తూ ఉంటుంది. అపారమైన ఖనిజ వనరులకు నియంగా ఉన్న కాంగో, రువాండాలున్న సెంట్రల్ ఆఫ్రికాదేశాలలో అమెరికా సహా ఇతర అగ్రరాజ్యాలు వేల డాలర్లు పెట్టుబడులు సమకూర్చేందుకు కూడా ఒప్పందం కుదిరింది. ఐతే ఈ సంఘర్షణ ముగిసిపోవడానికి సంబంధించిన శాంతి ఒప్పందంపై ఇప్పటికీ ఇంకా అనేక ప్రశ్నలు మిగిలిపోయాయని నిపుణులు అంటున్నారు.

# రూపురేఖలు మారనున్న చర్లపల్లి చెరువు

చెరువును సందర్శించిన ఉన్నతాధికారులు

అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్న హైడ్రా

చెరువు అభివృద్ధిపై జైళ్ల శాఖ, హైడ్రా అధికారుల భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చర్లపల్లి చెరువు రూపురేఖలు మారనున్నాయి. మంచినీటి సరస్సుగా రూపొందించడమే కాకుండా, నయన మనోహరంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ గురువారం చర్లపల్లి చెరువును సందర్శించారు. జైళ్ల శాఖ, హైడ్రాతో పాటు స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, జిహెచ్‌ఎంసి అధికారులు కూడా ఈ సందర్శనలో ఉన్నారు. చర్లపల్లి జైలు ప్రాంతంలో ఉన్న 58 ఎకరాల చర్లపల్లి చెరువును ఆధునికీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంపై ఇరువురు ఉన్నతాధికారులు చర్చించారు. చెరువు చుట్టూ తిరిగి, ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. ప్రస్తుతం చెరువులో కొద్దిమొత్తం నీరు ఉన్నా పరిశుభ్రంగా ఉండడంతో జీవవైవిధ్యానికి అవకాశం లభించిందని, ఇంకా ఈ చెరువు నిండా నీరుంటే మరింత ఆహ్లాదంగా మారుతుందని భావించారు. ఈ క్రమంలో చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు, కట్టను బలోపేతం చేసి పాత్వేను అభివృద్ధి చేయడం వెంటనే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. సోలార్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు సిసిటివి కెమేరా వ్యవస్థను ఏర్పాటు చేస్తే మరింత భద్రత ఉంటుందని నిర్ణయించారు. ఇలా చెరువులో మంచి నీరు నిలిచేందుకు చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. ఇందుకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించాలని హైడ్రా, నీటిపారుదల ఇంజనీరింగ్ విభాగానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు.

**ఆరేడు చెరువుల నుంచి నీరు..** హకీంపేట నుంచి నాగిరెడ్డి కుంట, కాప్రా చెరువు, మోతుకులకుంట, బైసన్‌కుంట గొలుసుకట్టు చెరువుల ద్వారా చర్లపల్లి చెరువుకు నీరందుతుంది. ఈ చెరువునకు మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలా కూడా ఉంది. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి అందుబాటులోకి వస్తుంది. చుట్టూ పాత్వే, మినీ పార్కులు, చెట్లు, సీటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు సిసిటివి కెమేరాలు ఏర్పాటు చేస్తే స్థానికులే కాకుండా విహార కేంద్రం అవుతుంది. చర్లపల్లి పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) ద్వారా నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నారని సౌమ్య మిశ్రా తెలిపారు. ఒక్కో సెగ్మెంట్‌కు ఎంత ఖర్చు అవుతుందో సమగ్ర నివేదిక ఇస్తే ఆ క్రమంలో సిఎస్‌ఆర్ నిధులు అడగడానికి వీలౌతుందన్నారు. అంత కు ముందు చెరువునకు సంబంధించిన వీడియో చిత్రాలను, చెరువు అభివృద్ధికి ప్రణాళికలను జైళ్ల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూపించారు. హైడ్రా అగ్నిమాపకశాఖ అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, జైళ్లశాఖ ఐజి మురళీబాబు, డిఐజిలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్, ఓపెన్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భీకర దాడి
(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నది. బుషైర్ అణుకేంద్రాలపై గురువారం దాడిచేసినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. అందుకు ప్రతీకారంగా ఇరాన్ 400 క్షిపణులను ప్రయోగించింది. కాగా ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ, శుక్రవారంనాడు జెనీవాలో యూరోపియన్ దేశాలతో ఒక సమావేశంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశం ద్వారా సరికొత్త దౌత్యపరమైన మార్పులు సంభవిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**నేనేం చేస్తానో ఎవ్వరికీ తెలియదు : ట్రంప్** ఇరాన్ విషయంలో తన సహనం చచ్చిపోయింది ట్రంప్ అన్నారు. తానేం చేస్తానో ఎవ్వరికీ తెలియదన్నారు. వాషింగ్టన్‌లో ఆయన మాట్లాడుతూ, ఇరాన్ చర్చలకు దూరంగా ఉండిపోయిందన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేసే విషయంపై ఆయన ఒక నిర్ణయం తీసుకుంటున్నారని వార్తలు వెలువడిన తర్వాత ఆయన మళ్ళీ మాట్లాడుతూ, తాను ఈ విషయంలో అనుకున్నవిధంగా చెయ్యొచ్చు, చెయ్యకపోవచ్చునని అన్నారు. ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసేందుకు ఒక ప్రణాళికను మంగళవారంనాడు ట్రంప్ ఆమోదించారు. కానీ దానిని అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా స్తంభింపజేశారని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. బేషరతుగా ఖమేనీ లొంగిపోవాలన్న డిమాండ్‌ను ట్రంప్ పునరుద్ఘాటించారు. వచ్చేవారం ఇంతకంటే భారీస్థాయిలో దాడులు జరగవచ్చు లేదా తక్కువ దాడులు జరగవచ్చునని ట్రంప్ చెప్పినట్లు ఆ పత్రిక పేర్కొంది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేసే విషయంపై రిపబ్లికన్‌పార్టీలో విభేదాలు ఏర్పడ్డాయి. పార్టీలో వ్యక్తమవుతున్న అనుకూల,ప్రతికూల భిన్నాభిప్రాయాలు ట్రంప్‌ను చికాకుపెడుతున్నాయి. ఇజ్రాయెల్ ఆసుపత్రిపై ఇరాన్ భారీదాడి చేసిన తర్వాత ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ స్పందిస్తూ, ఇక ఖమేనీ ఎంతోకాలం మనుగడ సాగించే అవకాశం లేదన్నారు. ఐతే ఆసుపత్రిపై దాడి చేసే ఉద్దేశం తమకు లేదని, ఆసుపత్రి పక్కనే ఉన్న అణుస్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని తమ క్షిపణులు దాడి చేశాయని ఇరాన్ వివరణ ఇచ్చింది.

## ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీని రాష్ట్ర భాగస్వామ్యంగా తీసుకురావడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల మా 'ప్రతినిధుల సూచనలు పరిశీలిస్తామన్నారు. కంపెనీ ప్రతినిధులు వివరించిన సాంకేతికతను ముందుగా వెరిఫై చేసుకుని ఏఏ ప్రభుత్వ పథకాలలో దీన్ని సమర్థవంతంగా వినియోగించవచ్చో అధ్యయనం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వైద్యకళాశాలల్లో
## బోధనా సిబ్బందిని నియమించండి

మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో తెలంగాణ జుడా ప్రతినిధులు సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మరింత బోధన సిబ్బందిని నియమించి, బలోపేతం చేయాలని, తద్వారా నాణ్యమైన వైద్య విద్య అందుతుందని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (తెలంగాణ జుడా) ప్రతినిధులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జుడా అధ్యక్షుడు డాక్టర్ ఇసాక్‌న్యూటన్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ దుర్గం అజయ్ కుమార్ గౌడ్ , ఉపాధ్యక్షులు డాక్టర్ గిరి ప్రసాద్, డాక్టర్ సందీప్, అధికార ప్రతినిధి డాక్టర్ వినయ్ కుమార్, ఉస్మానియా జుడా అధ్యక్షుడు డాక్టర్ అవినాశ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కీర్తికా ప్రతినిధి బృందం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలతో పాటు వైద్య విద్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు వినతిపత్రం అందజేశారు. స్టైఫెండ్‌ను పెంచాలని, వైద్య కళాశాలల్లో మౌలికసదుపాయాలను పెంచాలని, శిక్షణకు అవసరమైన మంచి వాతావరణం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని జుడాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

ఇందుకు మంత్రి దామోదర రాజనర్సింహ స్పందిస్తూ సమస్యలను ఇది వరకే సిఎంతో చర్చించామని, ఈ నెల 24న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో పలు సిఫార్సులను తీసుకెళ్తామని మంత్రి తెలిపారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐసిసి అగ్రనాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. హైదరాబాద్‌లోని టిపిసిసి ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌లో మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంపి అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. వేడుకలలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్, పెద్ద సంఖ్య లో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న తరానికి రాహుల్ గాంధీ దిక్సూచి అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కులగణనకు ఒప్పుకోవడానికి రాహుల్‌గాంధీ ఒత్తిడి మేరకేనని, అందుకే కేంద్రం కులగణనకు గెజిట్ విడుదల చేసిందన్నారు. దానికి రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కులగణన చేసిందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. కాంగ్రెస్‌లో మాత్రమే బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

బలహీనవర్గాలకు చెందిన మంత్రిగా పొన్నం ప్రభాకర్, దళిత మంత్రిగా తాను, టిపిసిసి అధ్యక్షులుగా మహేష్‌కుమార్ గౌడ్‌లు నిదర్శనమన్నారు. సామాజిక న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీలోనే జరుగుతుందన్నారు. ఎంపి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కాంగ్రెస్‌లో యువతకు పెద్ద పీట వేస్తున్నారన్నారు.

## అనుమతులివ్వండి
(మొదటి పేజీ తరువాయి)

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్2 అవసరం ఎంతో ఉందని సిఎం తెలియజేశారు. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సిఎం తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డిపిఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రికి సిఎం గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి, మెట్రో ఎండి ఎన్.వి.ఎస్.రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బు బయటపడటం నిజమే
(మొదటి పేజీ తరువాయి)

అధికారిక నివాసంలోని అగ్నిప్రమాదం సంభవించిన ప్రదేశాన్ని సందర్శించింది. ఈ సంఘటనకు సంబంధించి మొత్తం 55మంది సాక్షులను విచారణ సంఘం విచారించింది. ఈ నివేదిక ఆధారంగా పూర్వ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి జడ్జి యశ్వంత్‌వర్మపై అభిశంసనకు సిఫారసు చేశారు. ఆ నగదు / డబ్బు జస్టిస్ వర్మ న్యూఢిల్లీలోని అధికారిక నివాసమైన 30 తుగ్లక్ క్రిసెంట్ స్టోర్‌రూమ్‌కు చెందినదే అని విచారణ సంఘం కనుగొన్నది. ఆ స్టోర్ రూమ్‌లోకి ప్రవేశించడం జస్టిస్ వర్మ, అతని కుటుంబసభ్యుల 'రహస్య లేదా నియంత్రణ'లో ఉందనడానికి గట్టి సాక్ష్యం ఉన్నదని తెలిపింది. 'అంతేకాకుండా బలమైన అనుమానిత ఆధారాల ప్రకారం 2025 మార్చి 15న తెల్లవారుజామున న్యూఢిల్లీలోని 30 తుగ్లక్ క్రిసెంట్ అధికారిక నివాసం స్టోర్ రూమ్ నుంచి తగులబడిపోయిన నగదు / డబ్బు తొలగించబడింది' అని సుప్రీంకోర్టుచే నియమించబడిన విచారణ సంఘం తన 64 పేజీల నివేదికలో తెలిపింది.'రికార్డులో ఉన్న ప్రత్యక్ష ఎలక్ట్రానిక్ సాక్ష్యం మార్చి 22న భారత ప్రధాన న్యాయమూర్తి రాసిన లేఖలో లేవనెత్తిన ఆరోపణల్లో తగినంత నిజం ఉందని, జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించేందుకు చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేసేంత దుష్ప్రవర్తన ఉన్నదని ఈ కమిటీ దృఢంగా విశ్వసిస్తోంది' అని నివేదిక కొనసాగింది. సాక్షుల వాంగ్మూలాలను కమిటీ పూర్తిగా విశ్లేశించింది. 1997లో సుప్రీంకోర్టు తన పూర్తి కోర్టు సమావేశంలో జోడించిన 'న్యాయ జీవిత విలువల పునఃస్థాపనను' కమిటీ ప్రస్తావించింది. న్యాయమూర్తి నుంచి ఆశించే అన్ని సద్గుణాలు నిజాయితీ భావనపై ఆధారపడి ఉన్నాయని కమిటీ స్పష్టంగా చెప్పింది. ఒక న్యాయమూర్తి నిజాయితీని కొలవడానికి కొలమానం ఉంటుందని, ఇది సివిల్ పదవిలో ఉన్న వ్యక్తి నుంచి ఆశించే నిజాయితీ కంటే కఠినమైనదని, ఉన్నత న్యాయవ్యవస్థ కార్యాలయాలు ప్రశ్నార్థకంగా ఉన్నప్పుడు నిజాయితీ అనే అంశం 'ప్రధానమైన, అనివార్యమైన, సంబంధితమైనది'గా మారుతుంది అని కమిటీ పేర్కొంది. 'ఒక ఉన్నత న్యాయవ్యవస్థ సభ్యుడి నుంచి సాధారణ ప్రజల అంచనా చాలా అధికంగా ఉంటుంది. న్యాయపదవిలో ఉన్న వ్యక్తికి నిజాయితీ అత్యంత ముఖ్యమైన అనివార్యమైన లక్షణం. ఇది ప్రాథమిక అర్హత ప్రమాణం. ఏదైనా న్యాయస్థాన అధికారి జిల్లా లేదా ఉన్నత న్యాయవ్యవస్థ నుంచి ఆశించే కనీస అంశం కోర్టుగది వెలుపల నిష్కళంకమైన స్వభావం, ప్రవర్తన' అని కమిటీ వ్యాఖ్యానించింది. ఈ విషయంలో ఏదైనా లోపం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. దీనిని కఠినంగా పరిగణించాలని జస్టిస్ యశ్వంత్‌వర్మపై అభిశంసనను సిఫారసు చేస్తున్నట్లు విచారణ సంఘం స్పష్టం చేసింది.జస్టిస్ నాగుతో పాటు హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జిఎస్.సంధావాలియా, కర్నాటక హైకోర్టు జస్టిస్ అనుశివరామన్ ఈ విచారణ కమిటీకి ప్రాతినిథ్యం వహించారు. మార్చి 22న పూర్వ భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నియమించిన ఈ కమిటీ దేశ రాజధాని ఢిల్లీలో అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసం 30తుగ్లక్ క్రిసెంట్‌లో దాదాపు 1135గంటల రాత్రి సమయంలో సంభవించిన అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరిపారు.ఒక సాధారణ అగ్నిప్రమాద సంఘటనగా ప్రారంభమైన ఈ ఘటన ఇప్పుడు న్యాయపరమైన దుష్ప్రవర్తన, ప్రజా విశ్వాసం ఉల్లంఘన వంటి తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొన్నది.పలువురు సాక్షులు, అగ్నిప్రమాద నివారణ సిబ్బంది, పోలీస్ అధికారులు విచారణ కమిటీకి తెలిపిన ప్రకారం అక్కడి నేలపై రూ.500నోట్లకట్టలు కాలిపోయిన నిల్వలు ఉన్నాయని వెల్లడైంది.

## తిరస్కరించండి
(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, బనకచర్ల విషయంలో ఎపి ప్రభుత్వం వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఏ నిబంధనలు పాటించకుండా, వరద జలాల ఆధారంగా ప్రాజెక్టు చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరమని జలశక్తి మంత్రితో సిఎం పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జలశక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకుని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు అన్యాయం**

సిడబ్ల్యూసి పరిధిలోని సాంకేతిక సలహామండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఎపి చేపట్టిందని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. జిడబ్ల్యూడిటి–1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉందని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం వివరించారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఎపి భావిస్తుంటే పోలవరం–బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి–నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని కేంద్ర మంత్రికి సిఎం, రాష్ట్ర మంత్రి తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తామని సిఎం కేంద్ర మంత్రి పాటిల్‌కు తెలియజేశారు. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కేంద్ర మంత్రికి సిఎం స్పష్టం చేశారు.

**తెలంగాణ 1500 టిఎంసిలకు వాడుకునేలా అనుమతులు ఇవ్వండి**

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టిఎంసిలు, కృష్ణా నదిలో 500 టిఎంసిలు మొత్తంగా 1500 టిఎంసిల నీటి వినియోగానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసి) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1500 టిఎంసిల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఎపి చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

**మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలి**

గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. బనకచర్లకు సంబంధించిన డిపిఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి తెలిపారని, త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ తెలిపారు. సమావేశంలో ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదలశాఖ సలహాదారు ఆదిత్యానాథ్ దాస్, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

### విద్యార్థులకు భాషా పరిజ్ఞానం ఉండేలా ఉపాధ్యాయులు కృషి డా.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాతృ భాషతో పాటు ఆంగ్ల,హిందీ భాషల్లో విద్యార్థులకు విద్యా బోధన, భాషా పరిజ్ఞానం ఉండాలని,అందుకు ఉపాధ్యాయులు పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి సూచించారు. విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చన్నారు. బడి బాట ముగింపు కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ లోని 'చిలకలగూడ ప్రభుత్వ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం' స్కూల్‌లో గురువారం జరిగిన ఉత్సవంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైమరీ స్కూల్ చిన్నారులతో చిన్నారెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు కూడా హాజరై చిన్నారులకు ఆశీర్వదించారు.
ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్య ప్రకాష్, డిప్యూటీ డిఇఒ శ్రీధర్, ఎంఇఒ మదన్ మోహన్‌రెడ్డి, అమ్మ కమిటీ అధ్యక్షులు ప్రేమదేవి తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారులకు దేశ సంపదను
# దోచిపెట్టేందుకే ఎన్‌కౌంటర్లు

### పౌర హక్కుల సంఘం నేతలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సంపద ప్రజలందరికీ దక్కడం కోసం సాయుధులై పోరాడుతున్న మావోయిస్టులను కిరాతకంగా కాల్చి చంపడం దుర్మార్గమని పౌర హక్కుల సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల అండతో గద్దెనెక్కిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అడవిలో నిక్షిప్తమై ఉన్న అపార సంపదను గుప్పెడు మంది పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు దమనకాండకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. పౌర హక్కుల సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వస్తున్న నేపథ్యంలో ఎన్‌కౌంటర్ల పేరుతో శాంతిని కోరుకుంటున్నవారిని చంపివేయడం దారుణమన్నారు. సాయుధులైన ఉద్యమకారులే స్వయంగా శాంతి చర్చలు కోరుకుంటున్న నేపథ్యంలో కేంద్రం ఇందుకు సంతోషంగా ఒప్పుకోవాల్సిందిపోయి మావోయిస్టులను మట్టుపెడుతాం. ఏరివేస్తామంటూ బహిరంగ ప్రకటనలు చేయడం ప్రజాస్వామ్యానికే విఘాతం అన్నారు. ఇప్పటికైనా కేంద్రం తక్షణమే మావోస్టులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ మారెడ్‌మిల్లిలో బూటకపు ఎన్‌కౌంటర్‌తో ప్రభుత్వం ముగ్గురిని దారుణంగా హత్య చేసిందని ఆరోపించారు. కేంద్ర కమిటీ సభ్యులైన గాజర్ల రవి ఎన్‌కౌంటర్‌లో చనిపోవడమంటే ఇది నమ్మశక్యంగా లేదన్నారు. ఆయనను సజీవంగా పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి చంపారని, అందుకే ఇప్పటివరకు వారి ఫొటోలను కూడ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయలేదని పేర్కొన్నారు. నాటి ఎమర్జెన్సీని మించిన పాలన నేడు దేశంలో కొనసాగుతోందన్నారు. మేధావులు స్పందించి ఈ పరిస్థితికి అడ్డుకట్టవేయాలని కోరారు. చిన్నచిన్న అంశాలకే స్పందించే రాజ్యాంగబద్ధ సంస్థలైన సుప్రీంకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్లు దేశంలో నరమేధం సాగుతుంటే మిన్నకుండిపోవడం ఈ దేశానికి మంచిది కాదన్నారు.
తక్షణమే ఈ వ్యవస్థలు న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో పౌరహక్కుల నేతలు ఎన్.నారాయణరావు, బల్లా రవి, చంద్రమౌళి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటయోధురాలు సుగుణకు అంతిమ వీడ్కోలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిరంకుశ నిజాం సైన్యం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు శాఖమూరి సుగుణమ్మ ధైర్యం చాలా గొప్పదని, దోపిడీ, అసమానతల పునాదిని ప్రశ్నించే ఉద్యమ నిర్మాతల్లో సుగుణమ్మ ఒకరని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో మంగళవారం మరణించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు, కమ్యూనిస్టు నాయకురాలు శాఖమూరి సుగుణమ్మ భౌతికకాయాన్ని గురువారం హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో సుగుణ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. డాక్టర్ నారాయణతో పాటు సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, డాక్టర్ బి.వి. విజయలక్ష్మి, సిపిఐ మాజీ ఎంఎల్‌సి పి.జె.చంద్రశేఖర్ రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, జ్యోతి, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్ రావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె.కల్పన, సభ్యులు వి.లలిత, ఆరుట్ల మమత, పి.ప్రేమ్ పావని, తమ్మారెడ్డి తాన్యా, ప్రముఖ కవి డాక్టర్ ఎస్.వి.సత్యనారాయణ తదితరులు శాఖమూరి సుగుణమ్మ భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**మహాప్రస్థానంలో అంత్యక్రియలు :**
సుగుణ అంత్యక్రియలు గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. సుగుణమ్మ అంత్యక్రియలకు డాక్టర్ కె.నారాయణతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సుగుణ కుమార్తె డాక్టర్ శాఖమూరి శోభ, కుమారులు డాక్టర్ శాఖమూరి రవి, శాఖమూరి రమేష్‌లకు నేతలు పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**సుగుణ విప్లవ జోహార్లు : ఎస్.బాల్‌రాజ్**
కమ్యూనిజం రావాలంటే కమ్యూనిస్టులంత బేషరుతుగా ఒకటి కావాలని ఆశించిన గొప్ప కమ్యూనిస్టు సుగుణ భౌతికంగా లేరని తెలిసి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ విచారం వ్యక్తం చేశారు. సుగుణ, ఎస్‌వికె.ప్రసాద్‌లతో కలిసి పని చేసే అవకాశం వచ్చిందని గుర్తుచేసుకున్నారు. సుగుణ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## మానేరు రివర్ ఫ్రంట్ పనులలో
# అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

### సిఎంకు చాడ వెంకట్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కరీంనగర్ నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్ పనులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై, సంబంధిత గుత్తేదార్‌పై గత పాలకుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని చాడ వెంకట్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ నగరంలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల పేరుతో గత ప్రభుత్వం రివర్‌ఫ్రంట్ నిర్మాణం కోసం రూ.500కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిజం శాఖకు రూ.100కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.100కోట్లు నిధులు విడుదల చేసిందని చాడ వెంకట్‌రెడ్డి సిఎంకు తెలిపారు. గత ప్రభుత్వకాలంలో ఈ రివర్‌ఫ్రంట్ నిర్మాణ పనులు చేపట్టి ఆ పనులను తన అనుచరులకు అప్పగించారని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా గుత్తేదార్ నిర్లక్ష్యం వహించారని, పనులు కూడా పూర్తికాకుండానే బిల్లులు చెల్లించారని, నిర్మాణంలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలుస్తున్నదని సిఎంకు చాడ వెంకట్‌రెడ్డి వివరించారు. రివర్‌ఫ్రంట్ పరిధిలో చెక్ డ్యామ్‌లు నిర్మించగా వర్షాకాలంలో కురిసిన వానలకు అవి పూర్తిగా కొట్టుకుపోయాయని, చెక్‌డ్యామ్‌లు కొట్టుకుపోయిన తరువాత కూడా రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ ఈ పనులు ఇప్పటికీ పూర్తికాలేదని చాడ వెంకట్‌రెడ్డి తెలియజేశారు. ఈ నేపథ్యంలో మానేరు రివర్‌ఫ్రంట్ పనులలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఆయన సిఎంను కోరారు.

### తిరుపతి హాతిరామ్ బావాజీ మఠంలో.. బంజారా పీఠాధిపతుల పూజలకు అవకాశం : కవిత విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తిరుపతి హాతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి హైదరాబాద్ లో టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడును కవిత గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 30న హరితామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతో పాటు నైవేద్యం సమర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. దీంతో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు స్పందిస్తూ త్వరలోనే హతిరామ్ బావాజీ పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని హామీనిచ్చినట్టు కవిత తెలిపారు.
పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలో తలెత్తే ముంపు సమస్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేండ్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తెలిపారు.



## వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ పనుల్లో కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో 2025–26కి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వ్యవసాయ యంత్రీకరణ, ఎరువుల సరఫరా, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు తదితర అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం అధికారులతో సమిక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రికరణకు ప్రభుత్వం రూ.104కోట్లను కేటాయించిందన్నారు. రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి, జిల్లాలు, నియోజకవర్గాల వారిగా కోటా నిర్ణయించి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను అందించాల్సిందిగా సూచించారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా 'నమో డ్రోన్ దీదీ' కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వానాకాలం సీజన్‌కి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నెలవారిగా కేటాయించిన సకాలంలో వచ్చేలా అధికారులు కృషిచేయాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి జెపి నడ్డా లేఖ రాశారని తెలిపారు. అంతకు ముందు మార్క్ ఫెడ్ ద్వారా 1,55,257 మెట్రిక్ టన్నుల జొన్నలను సేకరించగా, 91వేల మెట్రిక్ టన్నులకు రూ.302 కోట్లు,పొద్దతిరుగుడు సంబంధించి 4,333 టన్నులు సేకరించగా, ఇందుకు గాను రూ.31 కోట్లను రైతులకు చెల్లించడం జరిగిందని మంత్రి తుమ్మలపేర్కొన్నారు. హైదరాబాద్‌లో నేడు సిఎసిపి దక్షిణ ప్రాంతీయ సమావేశం జరగనున్న నేపథ్యంలో పెరిగిన సాగు ఖర్చులు, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారస్‌ల మేరకు రైతులకు ఇవ్వాల్సినమద్దతు ధరల ప్రతిపాదనలను సిఎసిపి కేంద్ర ప్రభుత్వానికి సూచించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

# మావోయిస్టు నేతలు బందీలుగా ఉన్నారా?

### ఎన్‌కౌంటర్లపై అనేక అనుమానాలు
### కర్రెగుట్టల ఆపరేషన్‌లోనే నేతలు పట్టుబడ్డారా?
### బంధువులకు మృతదేహాలను అప్పగించేందుకు ససేమిరా అంటున్న పోలీసులు






**ప్రజాపక్షం/ఖమ్మం :** మావోయిస్టు అగ్ర నేతలు పోలీసుల చెరలో బందీలుగా ఉన్నారా అందుకే ఒక్కొక్కరిని ఎన్‌కౌంటర్ల పేరుతో హతమారుస్తున్నారా అన్న ఈ అనుమానం పౌర హక్కుల సంఘాల నేతల్లోనూ, వామపక్ష, లౌకిక వాద శక్తుల మదిలోనూ ఉంది. ఇది నిజమే అనేందుకు ఒక్కొక్కరుగా కేంద్ర కమిటీ సభ్యులు, కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించడం ఆ ఎన్‌కౌంటర్లు జరిగిన తీరు ఇందుకు కారణాలుగా చూపుతున్నారు. రెండు రోజుల క్రితం అల్లూరి జిల్లా అడవి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గాజర్ల రవి, అరుణ, అంజుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలు అనుమానాలు వెల్లువెత్తుతున్న తరుణంలో మావోయిస్టు కేంద్ర కమిటీలోని ప్రధాన సభ్యులందరినీ ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టలను చుట్టుముట్టినప్పుడు బందీలుగా మార్చుకుని ఉండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నంబాల కేశవరావు, ఆడేలు అలియాస్ భాస్కర్, ఆంధ్రా ప్రాంతానికి చెందిన మరో ముగ్గురు కీలక నేతలను సజీవంగా బందీలుగా మార్చుకుని ఆ తర్వాత ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యుల్లో ప్రధానమైన వ్యక్తులను బందీలుగా పట్టుకుని కర్రెగుట్టల నుంచి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి కాల్చి చంపుతున్నారని పౌరహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన గాజర్ల రవి, అరుణ, అంజుల ఘటన ధృవపరుస్తుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో ఎక్కడా ఎన్‌కౌంటర్ జరిగిన దాఖలాలు లేవని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు రవి సహా మరో ఇద్దరి మృతదేహాలను అప్పగించాలని రంపచోడవరం పోలీస్ స్టేషన్ వద్ద బంధువులు బుధవారం నుంచి పడిగాపులు కాస్తున్నారు. మృతదేహాలను ఇవ్వకపోయినా కనీసం చూసేందుకైనా అనుమతి ఇవ్వండి అన్నా పోలీసులు ససేమీరా అంటున్నారు. గతంలో అరుణ మృతిచెందినట్లు మూడు, నాలుగుసార్లు ప్రకటించారని కానీ ఆమె సజీవంగానే ఉందని, ఇప్పుడు కూడా అరుణ కాకపోవచ్చునన్న భావన మాలో ఉందని, మృతదేహాన్ని చూస్తే మేము గుర్తు పడతామంటూ బంధువులు పోలీస్ అధికారుల ముందు మొరపెట్టుకున్నా వినిపించుకునే స్థితిలో లేరు. గాజర్ల రవి సోదరుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అశోక్, అరుణ తండ్రి లక్ష్మణ్‌రావు, సోదరి ఝాన్సీ, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు పద్మ తదితరులు మృతదేహాలను చూసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడో పట్టుకొచ్చి కొట్టి కాల్చి చంపారని మృతదేహాలపై గాయాలు ఉన్నట్లు వారు ఆరోపిస్తున్నారు. మీడియా ప్రతినిధులను సైతం మృతదేహాలను చూసేందుకు అనుమతించడం లేదు.
సహజంగా కేంద్ర కమిటీ సభ్యులకు అత్యంత భారీ భద్రత ఉంటుంది. ఆ భద్రతా సిబ్బందిని మట్టుపెట్టి అగ్రనేతలను బందీలుగా మార్చుకున్నారన్న ఆరోపణలకు ఎన్‌కౌంటర్లు రుజువుగా నిలుస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకోక తప్పదు.




## 12 మంది మావోయిస్టులు లొంగుబాటు

### మీడియా ముందు ప్రవేశపెట్టి ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ క్యాడెర్లలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పనిచేస్తున్న 12మంది మావోయిస్టు పార్టీ సభ్యులు గురువారం జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజ్ ముందు లొంగిపోయారు. ఈమేరకు ఆయన వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతలో భాగంగా 12 మంది వివిధ క్యాడెర్లకు చెందిన మావోయిస్టు సభ్యులు లొంగిపోయారన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీకి సహకరించరాదన్నారు. వారి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఇవ్వాలని అన్నారు. ఇటీవల కాలంలో 20మంది సాయుధ దళ సభ్యులను ములుగు జిల్లాలో అరెస్టు చేసి వారి నుండి 12 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలన్నారు. లొంగిపోయినవారికి ప్రభుత్వం పునరావాసాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఇప్పటికే చాలామంది లొంగిపోయి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవిస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోతే వారి అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలు కల్పిచేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎఎస్‌పి విక్రాంత్ కుమార్‌సింగ్, సిఆర్‌పిఎఫ్ 81,141 బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్ట్, గోదావరి విషయంలో
# సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారు

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బేసిన్లపైన సిఎం రేవంత్ రెడ్డికి కనీస అవగాహన కూడా లేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్, గోదావరి నదీపరివాహక విషయంలో సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకునే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, తాము పూర్తిగా సహకరిస్తామని, ఎపికి, చంద్రబాబుకు సహకరించేలా వ్యవహరిస్తే బిఆర్‌ఎస్ తరపున తాము సుప్రీం కోర్ట్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్, బిజెపి కలిసి బిఆర్‌ఎస్‌ను ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ గోదావరిలో 1000టిఎంసి,కృష్ణాలో 500 టిఎంసిలు ఇచ్చి మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లాలని చెప్పడానికి సిఎం రేవంత్ రెడ్డి ఎవరని, ఆయన ఆంధ్రప్రదేశ్‌కు దాసోహం అయ్యారని విమర్శించారు.
నల్లమల ఏ జిల్లాల్లో ఉందో కూడా రేవంత్ రెడ్డికి తెలియదా అని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా బేసిన్లకు సంబంధించిన నాలెడ్జ్ లేదని, అందరి ముందు సిఎంగా రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ పరువు తీశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి విషయం తక్కువగా, విషం ఎక్కువగా ఉన్నదన్నారు. అఖిలపక్ష ఎంపిల సమావేశం పెట్టింది బనకచర్లను ఆపడానికా..?, కట్టుకోమని చెప్పడానికా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక ఏకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఒక్క ప్రాజెక్టును నిర్మించలేదని ఆరోపించారు. నాటి ఎపి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2004 14సంవత్సర వరకు తెలంగాణ ప్రాంతంలో 6.64 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తే, బిఆర్‌ఎస్/టిఆర్‌ఎస్ అధికారంలోనికి వచ్చిన 2014 నుంచి 2023 సంవత్సరం మధ్యలో 48. 74 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించామని హరీశ్‌రావు వివరించారు. గోదావరి నదిపైన కెసిఆర్‌అనేక ప్రాజెక్టులను నిర్మించారని, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ ఇలా అన్ని ప్రాజెక్టులకు హైడ్రాలజీ క్లియరెన్స్ తీసుకొచ్చామని వివరించారు. కల్వకుర్తి బీమా నెట్టెంపాడు కోయిల్ సాగర్ పూర్తిచేసి 6.50 లక్షలు ఎకరాలకు నీళ్లు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ హయాంలో పెద్దవాగు కొట్టుకుపోయిందని, ఎస్‌ఎల్‌బిసి కూలిందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ఎందుకు అబద్ధాలు మాట్లాడుతున్నారని, చంద్రబాబుకు,రేవంత్ రెడ్డికి మధ్యగా తెలంగాణ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ ఉన్నారని, ఆయన గతంలో ఎపి ప్రభుత్వం నిర్మించిన అక్రమ ప్రాజెక్టులకు అండగా నిలిచారని ఆరోపించారు.

**'మూడు' వేల టిఎంసి నీరు వృధా అని సిడబ్ల్యుసి చెప్పింది :**
ప్రతి సంవత్సరం 3000 టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నాయని సెంట్రల్ వాటర్ కమిషన్ చెప్పిన విషయాన్ని కెసిఆర్ ప్రస్తావించారని హరీశ్‌రావు అన్నారు. ఈ నీటిని రెండు రాష్ట్రాలు ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ఇద్దరు సిఎంలు కూర్చొని మాట్లాడుకోవాలని, రెండు రాష్ట్రాలకు లాభం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అపెక్స్ కమిటీ సమావేశంలో కెసిఆర్ సూచించారని వివరించారు. గోదావరి, కృష్ణ నదుల అనుసంధాన విషయంలో తెలంగాణ రాష్ట్రాన్ని సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లో ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే తెలంగాణ అందుకు అంగీకరించబోదని కెసిఆర్ ఇది వరకే స్పష్టం చేశారని, ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్ట్ చర్చనే రాలేదని వివరించారు. అపెక్స్ కమిటీ సమావేశ వివరాలను సిఎం రేవంత్ రెడ్డి వక్రీకరిస్తున్నారన్నారు. ప్రస్తుతం నది మార్గంగా కాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని టచ్ చేయకుండా 200 టిఎంసిలను తన్నుకుపోతున్నారని మండిపడ్డారు. దీనిని ఆపాల్సిన బాధ్యత సిఎం, ప్రస్తుత ప్రభుత్వంపైనలేదా అని ప్రశ్నించారు.

**తెలంగాణ ప్రభుత్వం**
**ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం**
నం.08/EE PH/SRD/2025-26, తేది: 18.06.2025
హైదరాబాద్, సంగారెడ్డి డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పిహెచ్) కార్యాలయం నుండి ఆందోల్ జోగిపేట మునిసిపాలిటీలో TUIFDCలోన్ అసిస్టెన్స్ కింద అభివృద్ధి పనుల కోసం టెండర్ నోటీసు ఆహ్వానించడమైనది. 01 పని సంఖ్య (సిసి రోడ్) NIT. నం.04/EEPH/SRD/ఆందోల్ /TUFIDC/CC రోడ్లు/2 BHK హౌసింగ్ కాలనీ/ DB/ T1/2024-25 (2వ పిలుపు). **విలువ:** రూ.0.5 కోట్లు. **టెండర్లు షెడ్యూల్:** 25.06.2025న ఉ.11.00 గం.ల నుండి 02.07.2025 సా. 5.00 గం.ల వరకు. వివరాలకు https://tender.telangana.gov.in ని సందర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH) పబ్లిక్ హెల్త్, డివిజన్ సంగారెడ్డి
DIPR R.O. No. : 3813-PP/CL/ADVT/1/2025-26, Date: 19-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
NIT No. 07/DB/EE/Alwal Circle/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్ తేది: 19.06.2025
**పని పేరు:** బిటి రోడ్లు, సిసి రోడ్లు మరియు వరద నీటి కాలవల నిర్వహణ, **అంచనా విలువ:** రూ.25.50లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 20.06.2025న మ.4.30గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 23.06.2025న సా.4.30గం.ల వరకు, ఇఇ **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 3817-PP/CL/ADVT/1/2025-26, Date: 19-06-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 20 జూన్

# కేంద్రానికి కాలం స్తంభించింది!

కేంద్ర ప్రభుత్వం పనితీరు, ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహార శైలి చూస్తుంటే, కాలం స్తంభించిపోయిందనే అనుమానం తప్పుకాదు. బహుశా, కేంద్రం దృష్టిలో మణిపూర్ రావణకాష్టం ఎప్పుడో సమసిపోయింది. దేశంలో సమస్యలన్నీ తీరిపోయాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులు జరపడం లేదు. ఇరాన్‌తో పూర్తి యుద్ధానికి కాలుదువ్వలేదు. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయొతుల్లా ఖమేనీని లొంగిపోవాల్సిందిగా అమెరికా హెచ్చరించలేదు. ఆయనను హతమారుస్తామని ఇజ్రాయెల్ ప్రకటించలేదు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో విందుకు ఆహ్వానించలేదు. వారి మధ్య కశ్మీర్ నుంచి సింధు నదీ జలాల వరకూ పలు అంశాలు చర్చకు రాలేదు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు కీలక అంశాలపై, పాకిస్తాన్‌తో భారత్ చర్చించాల్సిన అవసరం లేనేలేదు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు చేయడంతో సమస్యకు తెరపడింది. పాకిస్తాన్ ప్రతీకార దాడి చేయలేదు. మనకు ఎలాంటి ఆస్తి లేదా ప్రాణ నష్టం వాటిల్లలేదు. మన దేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై అమెరికా సుంకాన్ని పెంచలేదు. ఎగుమతిదారులు భారీ నష్టాలు ఎదుర్కోవడం లేదు. మహిళా రిజర్వేషన్ల నుంచి కులగణన వరకూ అంతా సవ్యమే. నిజంగా కేంద్రానికి కాలం స్తంభించకపోతే, అట్టుడుకుతున్న మణిపూర్ సమస్యను ఎందుకు పరిష్కరించదు? నిరుద్యోగం నుంచి ధరల పెరుగుదల వరకూ దేశంలో నెలకొన్న సవాలక్ష సమస్యలపై ఎందుకు స్పందించదు? అన్నిటికీ మౌనమే సమాధానం ఎలా అవుతుంది? భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తన ఘనతేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనను మన ప్రధాని ప్రత్యక్షంగా ఎందుకు ఖండించడం లేదు? ఈ విషయంలో మరెవరి ప్రమేయం లేదంటూ డొంకతిరుగుడు సమాధానం ఎందుకో? గాజా స్ట్రిప్‌లో జరుగుతున్న విధ్వంసంపై భారత ప్రభుత్వం ఇంతవరకూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఒక్క ప్రకటన కూడా చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటో? అదే ఇజ్రాయెల్ ఇప్పుడు ఇరాన్‌ను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలను ఎందుకు ఖండించడం లేదో సర్కారే వివరించాలి. ఇజ్రాయెల్‌తో అమెరికాయే దాడులు చేయిస్తూ, అణ్వాయుధాల నిరోధమనే ముసుగు తగిలించుకుంది. ఇరాన్‌ను రెచ్చగొడుతూ, ఇరు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి తెరతీస్తున్నది. ఈ పరిస్థితులు భారత్‌సహా ఆసియా దేశాలన్నిటినీ ప్రమాదంలోకి నెట్టడం ఖాయం. కానీ, ఇజ్రాయెల్ చర్యలను ప్రధాని ఖండించకపోవడం విచిత్రం. ఇటు దేశంలో... అటు ప్రపంచంలో చోటు చేసుకుంటున్న కీలక పరిణామాలపై మోదీ మౌనం ఓ బ్రహ్మపదార్థం. పదకొండేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఏటా కోటి ఉద్యోగాల హామీ అటకెక్కింది. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్ ముఖచిత్రం మారిపోలేదు. రైతు సమస్యలు పెరిగాయేగానీ తగ్గలేదు. హక్కుల కోసం కార్మికులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. నూతన జాతీయ విద్యా విధానంపై విద్యార్థి లోకం మండిపడుతున్నది. మైనారిటీ వర్గాల జీవన్మరణ పోరాటం కొనసాగుతూనే ఉంది. ఆహార ద్రవ్యోల్బణం రేటు భయపెడుతూనే ఉంది. ప్రజల కొనుగోలు శక్తి పతనమవుతూనే ఉంది. కాగితాలు... గణాంకాల్లో తప్ప ప్రజా జీవితాల్లో వాస్తవిక అభివృద్ధి జాడలేదు. కార్పొరేట్ సంస్థలు... ప్రైవేటు కంపెనీలు తప్ప, దేశంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదు. దేశంలో అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుగుపొరుగు దేశాలతో శాంతి తాత్కాలిక ఊరటే తప్ప, శాశ్వత పరిష్కారం కాదు. ఇన్ని సమస్యలు ముసురుకున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. అత్యవసర పార్లమెంటు సమావేశాలు నిర్వహించడం లేదు. ప్రతిపక్ష పార్టీలతో చర్చించడం లేదు. ఇజ్రాయెల్ చర్యలను ఖండించడం లేదు. ఆపరేషన్ సిందూర్‌పై వివరణ ఇవ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వానికి కాలం స్తంభించిపోయిందేమో!

# జూన్ డేస్ తిరుగుబాటు



కృష్ణ ఝా

అది 1840వ దశకం. సమ్మెలు, పోరాటాలతో దద్దరిల్లిన, తిరుగుబాట్లు, అల్లర్లతో కూడిన కాలం అది. వాటిల్లో అత్యంత ప్రజాదరణ పొందినది జూన్ తిరుగుబాటు. అది కేవలం నాలుగు రోజులు మాత్రమే జరిగినా, క్రూరంగా అణిచివేయబడినా, దాదాపు రెండు శతాబ్దాల తర్వాత కూడా ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. అది పారిస్‌లో జరిగింది. బూర్జువా వర్గానికి, కార్మికులకు మధ్య ఉద్రిక్తతలు అక్కడ అత్యంత తీవ్రంగా ఉండేవి. 1848 ఫిబ్రవరి నాటికి, పరివర్తన మొదలై, రెండు ప్రవాహాలుగా విభజించబడిన ఒక నూతన సమాజం ఆవిర్భవించడం ప్రారంభమైంది.

వాటిలో ఒకటి మానవ అవసరాలను తీర్చే వస్తువులను ఉత్పత్తి చేయడానికి తన శ్రమ శక్తిని వెచ్చించింది. మరొకటి ముడిసరుకు, ఇంధనం లేదా గుర్రాలతో నడిచే పెద్ద, చిన్న తరహా మగ్గాలు, లేదా ఆదిమ యంత్రాలతో కూడిన ఉత్పత్తి సాధనాలను యజమాని నిర్వహించేవారు. ఆ తరువాత ఆవిరి శక్తి కనుగొనబడింది. దానిని వివిధ రకాల యంత్రాలకు వినియోగించారు. అది ఉత్పత్తి యంత్రాలు, రవాణాకు రెండింటికీ, వివిధ రకాల యంత్రాలకు విస్తరించింది. కార్మికులకు తక్కువ చెల్లించడం ద్వారా, కార్మికుడు స్వయంగా సృష్టించిన ఉత్పత్తుల ఖర్చు కంటే తక్కువ ధరకే శ్రమ శక్తిని కొనుగోలు చేయడం ద్వారా లాభం పొందారు.

ఆ రోజులు అసాధారణమైనవి. వ్యవసాయ వ్యవస్థ, అంధ భూస్వామ్య పాలనతో పాటు మొత్తం ఎగువస్థాయి నిర్మాణం కూలిపోతున్న దశ అది. రాజులు ఇక దైవాంశులు ఏమాత్రం కారు. అయితే నిర్దిష్టంగా, అంతటా వ్యాపించిన ఒక స్పష్టమైన, స్థిరమైన అంశం ఉంది. అది ఆహారం లేకపోవడంతో, అత్యధికుల్లో ఆకలి రాజ్యమేలింది. కొత్త ప్రభుత్వం విషయానికొస్తే, అది గొప్ప 1789 ఫ్రెంచ్ విప్లవ నినాదాలు, చిహ్నాలను పునరావృతం చేయడంలో సంతృప్తి చెందింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ప్రకటిస్తూ, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసింది. వారు రాచరికాలపై సంపూర్ణంగా విశ్వాసాన్ని కోల్పోయారు.

ప్రజలు కోపం, విపరీతమైన ఆకలితో ఉన్నారు. మరొక తీవ్రమైన అంశం 'దివాలా' ఫ్రాన్స్‌ను కమ్మేసింది. పరిస్థితి అస్థిరంగా మారుతోంది. నెమ్మదిగా నూతన ఆలోచనలతో కొత్త సమాజం ఆకృతులు ద్యోతకమవుతున్నాయి. ప్రజాస్వామ్యం, ప్రాతినిధ్య ప్రభుత్వం ఆవశ్యకత పెరుగుతోంది. వ్యక్తిగత హక్కులు, సమానత్వం అనే ప్రజాస్వామ్య ఆలోచనను రూపొందించడంలో ఫ్రాన్స్ ఒక్కటే లేదు. వారు ఒక నూతన ఉషోదయం కోసం ఎదురుచూస్తున్నారు. అది పెట్టుబడిదారీ పాలన. ఇది కేవలం ఫ్రాన్స్‌తోనే కాకుండా, ఇతర దేశాలతో కూడా గుర్తింపు పొందింది. అనూహ్యంగా ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి.

నూతన యంత్రాలు, పరిపాలనకు ఒక ప్రజాస్వామ్య వ్యవస్థతో పారిశ్రామిక యుగం ప్రారంభమవుతోంది. 1830లు, 1840లలో, నగరం కార్మికవర్గం విస్తరణతో సోషలిస్ట్, కమ్యూనిస్ట్ ఆలోచనలు, సంస్థల విస్తరణ జరిగింది. ఈ సమూహాలు కార్మికవర్గ విముక్తిని సాధించడంలో ఆసక్తిని కనబరిచాయి, అంటే 1789 సంప్రదాయాలను అధిగమించి ముందుకు వెళ్ళడం. 1848 ప్రారంభంలోనే, కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ కమ్యూనిస్ట్ మేనిఫెస్టోను రాయడం ముగించిన వెంటనే యూరోపియన్ ఖండంలో వరుస విప్లవాలు మొదలయ్యాయి. అవి కమ్యూనిస్ట్ విప్లవాలు కావు. అవి పాత యూరోపియన్ నిరంకుశత్వాలకు వ్యతిరేకంగా ఉదారవాద సంస్కరణల కోసం జరిగిన విప్లవాలు.

కొలోన్‌లో జరిగిన ప్రజాస్వామ్య పోరాటంలో మార్క్స్, ఏంగెల్స్ పాల్గొనడం ద్వారా తమకు తాముగా విప్లవ ఉద్యమంలోకి ప్రవేశించారు. 1848 జూన్ 1న వారు మార్క్స్ సంపాదకత్వంలో 'న్యూయీ రైనిషె జెయ్‌తుంగ్' అనే వార్తాపత్రికను 'ఆర్గాన్ ఆఫ్ డెమొక్రసీ' అనే ఉపశీర్షికతో ప్రారంభించారు.

1848లో ఫ్రాన్స్ అధిక నిరుద్యోగంతో ఆర్థిక మాంద్యంలో ఉంది. ఫిబ్రవరి విప్లవంలో కొత్త ప్రభుత్వం 'పని హక్కు'కు ఉండాలని సాయుధ కార్మికులు డిమాండ్ చేశారు. కార్మిక వర్గం సంక్షేమానికి ప్రత్యేకించి హామీ ఇవ్వాలని కోరారు. అది అయిష్టంగానే అంగీకరించబడింది. నిరుద్యోగుల కోసం ప్రభుత్వం జాతీయ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసింది. కానీ ఇవి అప్పుడప్పుడు, తక్కువ వేతనంతో కూడిన పనిని అందించాయి. అది తక్కువస్థాయివి, ఒకే మాదిరిగా ఉంటున్నాయని పారిస్‌లోని నైపుణ్యం కలిగిన నిరుద్యోగ కళాకారులు వ్యతిరేకించారు.

ప్రభుత్వం జూన్ 22న జాతీయ వర్క్‌షాప్‌లను రద్దు చేసింది. వాటిలో నమోదైన కార్మికులను సైన్యంలో చేరాలని లేదా పారిస్ నుండి బయటికి వెళ్ళి ఇతర చోట్ల పనిచేయాలని ప్రభుత్వం తెలియజేసింది.

ఆ సాయంత్రం, కార్మికులు బారికేడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. జూన్ డేస్ తిరుగుబాటు ప్రారంభమైంది. తిరుగుబాటు వార్త అందిన క్షణం నుండి, మార్క్స్, ఏంగెల్స్ విప్లవకారులకు మద్దతు ప్రకటించారు. ఇది ఒక అసాధారణమైన వైఖరి. మునుపటి విప్లవాల వెల్లువలతో పోలిస్తే, జూన్ తిరుగుబాటుకు ప్రముఖ పరిరక్షకులు/నాయకులు ఏ మాత్రం లేరు. వారి వైఖరి ఫలితంగా, 'న్యూయీ రైనిషె జెయ్‌తుంగ్' తన మిగిలిన వాటాదారులందరినీ కోల్పోయింది. మరుసటి సంవత్సరం ప్రతివిప్లవం పుంజుకోవడంతో ప్రచురణ మూసివేస్తున్నప్పుడు, మార్క్స్ చివరి సంచికను ధైర్యంగా పూర్తిగా ఎరుపు సిరాతో ముద్రించాడు. ఈ ఎరుపు పదాలు 'మా పత్రం యొక్క సారం' జూన్ తిరుగుబాటు అని ప్రకటించాయి.

పారిస్‌లో ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి మార్క్స్, ఏంగెల్స్ ఫ్రాన్స్‌లో ఉన్న తమ ఇద్దరు విలేకరుల నుండి సమాచారాన్ని పొందగలిగారు. వారు ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసిన సెబాస్టియన్ సెయిలర్, గాయపడిన విప్లవకారులకు చికిత్స చేసిన డాక్టర్ హెర్మాన్ ఎవెర్‌బెక్. తాను వైద్యం అందిస్తున్న సమయంలో విప్లకారుల చెప్పిన సారాంశాన్ని పత్రికకు డాక్టర్ ఎవెర్‌బెక్ పంపేవారు.



కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో, మార్క్స్, ఏంగెల్స్ ఇలా వ్రాశారు: 'మన ప్రస్తుత సమాజంలో శ్రామికులు కింది స్థాయిలో ఉన్న వర్గం. అధికారిక సమాజంలోని మొత్తం ఉన్నత వర్గాలు గాలిలో చెల్లాచెదురు కాకుండా ఉన్నంత వరకు శ్రామికులు కదలలేరు, తమను తాము పైకి లేపలేరు.' పాత సమాజంతో పూర్తిగా సంబంధాలు తెచ్చుకోవడం కార్మికవర్గ విప్లవానికి ఎంత అవశ్యకమనేది వారు వివరించారు. ఫిబ్రవరి విప్లవంతో పోలిస్తే జూన్ డేస్ చాలా నిశ్శబ్దం గా ఉందని ఎవెర్‌బెక్ వారికి చెప్పారు. జూన్ డేస్ అనుభవం ఈ సత్యాన్ని ధృవీకరించింది. జూన్‌లో బారికేడ్ యోధులు 1789 గురించి పాటలు పాడలేదు.

మార్క్స్ ఫిబ్రవరి విప్లవాన్ని మంచి విప్లవంగా వర్ణించడానికి సమాజంలో వర్గ విభేదాలను తిరస్కరించి, వాటిని సౌభ్రాతృత్వం సార్వత్రిక వాక్పటిమతో కప్పబడడమే కారణం. ఇందుకు విరుద్ధంగా, జూన్ డేస్ అసహ్యకరమైన విప్లవం. ఎందుకంటే అది ఆ వర్గ విభేదాలను భయంకరంగా ప్రస్ఫుటం చేసింది. కొత్త ఫ్రెంచ్ ప్రభుత్వం బారికేడ్లపై కార్మికులతో యుద్ధానికి దిగింది. అది సైన్యాన్ని పిలిచింది.


జూన్ తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా ఉపయోగించిన హింసను ఏ స్థాయిలో ఉపయోగించారనేది మార్క్స్, ఏంగెల్స్ విశదీకరించారు. భయపడిన బూర్జువా వర్గం తమ అధికారాన్ని కాపాడుకోడానికి ఎంత దూరం వెళ్తుందో అది వెల్లడించింది.

1919లో విఫలమైన కార్మికుల తిరుగుబాటు తర్వాత, విప్లవకారిణి రోసా లక్సెంబర్గ్ తన హత్యకు కొన్ని గంటల ముందు తన చివరి వ్యాసం రాసారు. దానికి 'బెర్లిన్‌లో శాంతి రాజ్యమేలుతుంది (ఆర్డర్ రీన్స్ ఇన్ బెర్లిన్)' అని ఆమె పేరు పెట్టారు. అది జూన్ డేస్‌పై మార్క్స్ రాసిన వ్యాసాన్ని సూచిస్తూ 'ఫ్రెంచ్ ప్రభుత్వం, ఇతర అణచివేత పాలనల మాదిరిగానే 'శాంతిభద్రతలు(ఆర్డర్)' పేరుతో ఊచకోత కోసింద'ని గుర్తుచేశారు.

ఇదొక పాక్షిక వ్యంగ్య వ్యాఖ్య. ప్రాథమికంగా బూర్జువా సామాజిక వ్యవస్థ హింస, అణచివేతపై ఆధారపడి ఉందని మార్క్స్ తరువాత రోసా లక్సెంబర్గ్ కూడా పేర్కొన్నారు. అందుకే వారు దానిని పడగొట్టడానికి తమ జీవితాలను అంకితం చేశారు.

# ఇంజనీరింగ్ కళాశాలల దోపిడీ!

రాష్ట్రంలో మొత్తం 177 ఇంజనీరింగ్ కళాశాలలు ఉంటే, అందులో 155 ప్రైవేటువే. ఇక్కడ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి సంఖ్య 50 వేలకి పైమాటే. వారి కష్టాలు వర్ణనాతీతం. 7వ వేతన సంఘ జీతాలు చెల్లించడం లేదు కానీ చెల్లిస్తున్నామంటూ తప్పుడు నివేదికలు తయారు చేసి గత పది ఏళ్ల నుంచి ఫీజులు పెంచుకుంటూ వస్తున్నారు. దీనితో విద్యార్థులపై పెను భారం పడుతుంది. ఇటు ఉద్యోగులకి జీతాలు రాక మానసికంగా ఆర్థికంగా బలహీన పడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఆలోచించి అధ్యాపకులు జీతాలు రాకున్నా పాఠాలు చెప్పడం ఆపడం లేదు. కొన్ని కాలేజీలలో 26 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. కారణం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కావడం లేదని సాకులు. వాస్తవంగా విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.35000/– మాత్రమే. మిగతా ఫీజు విద్యార్థినే చెల్లించడం జరుగుతుంది. అయినప్పటికీ ఉద్యోగుల జీతాలు చెల్లించడం లేదు. అంతేగాక చెల్లించే జీతాలు తాత్కాలిక జీతాలు మాత్రమే అవే చెల్లించకపోతే వారి జీవనం ఎలా గడుస్తుంది? తెలంగాణ విద్యా హక్కు చట్టం 1982 చాప్టర్ 14 సెక్షన్ 84 ప్రకారం ప్రతినెలా ఒక తేదీన జీతాలు చెల్లించాలి. ఒకవేళ చెల్లించకపోతే, యజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలనీ, రూ.2000/– అపరాధ రుసుము చెల్లించాలని చట్టంలో తెలియజేస్తుంది. దీనిపై ప్రభుత్వాలు తగిన విచారణ చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం 700 కోట్లనుంచి 1000 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. అయినా దీనిపైన ప్రభుత్వం స్పందించి వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు వాపోతున్నారు.





రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి, దానిని బోర్డుకి ఫీజు రీయింబర్స్మెంట్ మళ్లించి, దానిద్వారా ప్రతి నెలా ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులకి నాణ్యమైన విద్య అందాలంటే అధ్యాపకులు ఆర్థికంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల దోపిడీపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

అయినేని సంతోష్ కుమార్

# ఫోన్ ట్యాపింగ్ పేరు 'ఆపరేషన్ ఆర్.ఆర్'!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఇప్పుడు యావద్దేశాన్ని కుదిపేస్తోంది.నాడు కర్ణాటకలో హెగ్డే ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఫోన్ ట్యాపింగ్ జరిగితే,ఇక్కడ కేసీఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడం కోసం జరిగింది.ఈ సంగతులన్నీ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు 'సిట్' ఎదుట ఇచ్చిన వాంగ్మూలాల ద్వారా తెలుస్తున్నాయి. ''తుపాకీ పేల్చింది, 2023 చివరి దాకా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ గా పని చేసిన ప్రభాకరరావు. కానీ తుపాకీ ఆయనది కాదు.అందులోని తూటాలు ఆయనవి కావు'' అని సీనియర్ జర్నలిస్టు ఒకరు అన్నారు.'ఫోన్ ట్యాపింగ్' కోసం ఒక ప్రత్యేక బృందాన్ని తయారు చేసి, వారికి అన్ని హంగులు సమకూర్చిన వ్యక్తి ప్రభాకర రావు అనే ఆరోపణలున్నవి.ఆయన నల్లగొండ ఎస్పీగా ఉన్నకాలంలో బీబీనగర్ ఎస్.ఐ.గా పనిచేసిన ప్రణీత్ రావును శిష్యునిగా మలచుకున్నారు. ఈ 'ముఠా' కు ప్రధాన ఆపరేటర్‌గా ప్రణీత్ పేరు మార్మోగుతోంది. 2007 బ్యాచ్‌కు చెంది ఎస్ఐలలో 2022 నాటికి డిఎస్పీగా పదోన్నతి పొందిన ఏకైక వ్యక్తి ప్రణీత్ రావు. ఆయన అప్పటి కెసిఆర్ ప్రభుత్వం పట్ల ఎంత విధేయంగా ఉన్నారో, కెసిఆర్‌కు, నాటి బిఆర్ఎస్ ముఖ్యులకు ఎంతగా నమ్మిన బంటుగా మారారో ఈ ప్రమోషన్ ఘటన తెలియజేస్తున్నది.రేవంత్ రెడ్డిని రాజకీయంగా అణచివేయడానికి జరిగిన ఫోన్ ట్యాపింగ్ భాగోతానికి 'ఆపరేషన్ ఆర్.ఆర్.' అని కోడ్ పేరు పెట్టుకున్నట్టు తెలియవచ్చింది.

జనతా పార్టీ ప్రభుత్వం కర్ణాటకలో ఆనాడు నిలబడడానికి కారణం హెగ్డే. ఆయన అనుభవజ్ఞుడైన పోరాట యోధుడు. ఆయన వ్యక్తిగత ఆకర్షణ. మొదట్లో ఆయనకు ప్లేబాయ్ ఇమేజ్ ఉండేది. తర్వాత ఆయన అహంకారపూరిత శైలిని పూర్తిగా విడనాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే హెగ్డే తన కారు నుంచి సైరన్‌ను తొలగించారు. సాధారణ భారతీయ కారులో తిరగడానికి ఇష్టపడ్డాడు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప రాష్ట్ర హెలికాప్టర్‌ను ఉపయోగించేందుకు ఆయన నిరాకరించారు.ప్రజలకు తాను ఎంతగా అందుబాటులో ఉండేవాడంటే, సిఎం అయిన మొదటి కొన్ని నెలల్లో ప్రతి రోజూ కనీసం మూడు గంటలు తన కార్యాలయం వెలుపల ప్రజలను కలవడానికి, వారి మాటలను సానుభూతితో వినడానికి ఆయన కేటాయించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా పనిచేసిన కెసిఆర్‌కు సంక్రమించిన 'గ్లామర్'ఉద్యమ గ్లామర్. అదే ఆయన కు ప్రత్యేక ఆకర్షణ. కానీ సిఎం కాగానే తన 'లోపలి మనిషి' బయటకు వచ్చాడు. 'అహంకారం' ఒంటినిండా పులుముకొని పరిపాలన సాగించినట్టు ప్రజాసంఘాలు ఆరోపిస్తుంటాయి.కేసీఆర్ 'హ్యాట్రిక్' సాధించడానికి ఎన్ని దొడ్డిదారి పనులు చేశారో కానీ, ఫోన్ ట్యాపింగ్ నేరం ఆయన ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం వెయ్యి మంది నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు విచారణలో 'సిట్' గుర్తించింది. తెలంగాణలో 650 మంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు కనుగొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులపై ప్రధానంగా ఫోకస్ చేసి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఎపిసిసి చీఫ్ గా ఉన్న వైఎస్ షర్మిల ఫోన్లను సైతం అప్పట్లో ట్యాప్ చేసినట్లు సిట్ విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారు,అందుకు సంబంధించిన ప్రతి అంశం నాటి ఎపి సిఎం, ఆమె సోదరుడు వైఎస్ జగన్‌కు చేరవేసినట్లు సమాచారం అందుతోంది.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో బాధితుల నుంచి సిట్ అధికారులు జూన్ 17 నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. అందులోభాగంగా టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. ఈ ట్యాపింగ్ వల్ల తాము ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నామో ఆయన వివరించారు. మూడోసారి అధికారాన్ని అందుకోవాలని కెసిఆర్ గట్టి ప్రయత్నాలు చేసినట్టు ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఒక రుజువు. రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులతో సహా, స్వపక్షం బిఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, రచయితలు, మేధావులు, కొందరు న్యాయమూర్తుల ఫోన్లను సైతం ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. అలాగే పక్క రాష్ట్రంలో నాయకుల ఫోన్లు కూడా 'జగన్ సూచనల మేరకు' ట్యాప్ చేసినట్టు ఒక ప్రచారం సాగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన కొద్దీ తనకు 'ప్రమాదకర ప్రత్యర్థి'గా రేవంత్ రెడ్డి అవతరించినట్టు కెసిఆర్‌కు అర్థమైంది. అందువల్ల రేవంత్ రెడ్డి ఇంటికి 200 మీటర్ల దూరంలోనే 'ట్యాపింగ్ పరికరాలను' పెట్టి సంభాషణలను ప్రణీత్ రావు బృందం రికార్డు చేసినట్టు ఏడాది కిందటే ప్రచారం జరిగింది.

అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. బిఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గురించి రేవంత్ రెడ్డికి అదివరకే కొంత సమాచారం ఉన్నందున దాని సంగతేమిటో అంతు తేల్చాలని ఆయన నిర్ణయించారు. దర్యాప్తుకుగాను ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను నియమించారు. రేవంత్, కెసిఆర్ ఎత్తులకు పై ఎత్తులు వేసి, దూకుడుగా ప్రచారం చేసి, ఆయన కుటుంబ అవినీతి గురించి, అహంకార పూరిత పరిపాలన గురించీ బలంగా తీసుకు వెళ్లడం వలన అధికారంలోకి వచ్చారు. రేవంత్ అప్రమత్తంగా లేకపోతే కెసిఆర్, కాంగ్రెస్ నాయకులను 'పంటికి అందకుండా మింగివేసేవారు' అని రాజకీయపరిశీలకులు అంటున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి రాగానే ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ ఐపిఎస్ అధికారి ప్రభాకర్ రావు, ఒక తెలుగు న్యూస్ ఛానల్ అధిపతి శ్రవణ్ రావు విదేశాలకు ఉడాయించారు. బృందంలోని పోలీసులు అరెస్టయి జైలుకు వెళ్లారు. కొందరు బెయిలుపై విడుదలయ్యారు. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తాము ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ అధికారుల ఎదుట వారు స్పష్టం చేశారు. ప్రభాకర్ రావును భారత్‌కు రప్పించే ప్రయత్నం చేశారు. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆగస్టు 5 వరకు ఆయనను అరెస్టు చేయరాదని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే సిట్ విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకరరావును ఆదేశించింది. సిట్ అధికారుల విచారణలో ఆయన ప్రశ్నలను దాట వేస్తున్నారని పోలీసు వర్గాలంటున్నవి. అనంతరం వరుసగా జరిగిన విచారణలో ఆయన నుంచి సిట్ అధికారులు కొన్ని కీలక విషయాలను రాబట్టినట్లు తెలుస్తోంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కేంద్రమంత్రి బండి సంజయ్ సహా అనేక ప్రముఖుల కదలికలు, వారి సంభాషణలన్నీ ఫోన్ ట్యాపింగ్ ముఠా సేకరించి 'పంపించవల్సిన వాళ్లకు' పంపించేవారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్,జగన్ సూత్రధారులనే ఆరోపణలు ఒక వేళ నిజమయితే వాళ్ళ విశ్వసనీయత, ప్రతిష్ట పాతాళానికి వెడతాయి. తన ఫోన్ ట్యాప్ అయినట్టుగా ఆధారాలు షర్మిల చూపించగలిగితే ఈ కేసులో పురోగతి రావచ్చు.రాజకీయ చదరంగంలో ఎవరు ఎప్పుడు ఓడిపోతారో చెప్పలేం కానీ అనైతిక చర్యలతో యుద్ధం చేయడాన్ని సమాజం ఎప్పుడూ హర్షించదు. ఆధునిక సాంకేతికతను మేళవించి కెసిఆర్, జగన్ వెన్నుపోటు రాజకీయాలను నడిపారని విమర్శలు వస్తున్నవి.

2018 నుంచి 2023 వరకూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఇందుకు తగ్గ ఆధారాలు అన్నీ ఉన్నట్లు తెలుగు దేశం పార్టీ నాయకులు చెబుతున్నారు.

కాగా రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించినట్టుగా ఏ ముఖ్యమంత్రి ఇదివరకు చేయలేదు.రేవంత్ రెడ్డి,బండి సంజయ్,ఈటల,అరవింద్ సహా నా ఫోన్లు కూడా ట్యాప్ చేస్తున్నారు. ఉగ్రవాదులతో ప్రాణాలకు తెగించి పోరాడినందుకు గాను ఇచ్చే యాగ్జిలరీ ప్రమోషన్ తన బంధువు దుగ్యాల ప్రణీత్ రావుకు ఇచ్చారు.జీవో 280 ని దుర్వినియోగం చేశారు.రాజకీయ ప్రత్యర్థుల ఫోన్లు హ్యాక్ చేసినందుకు బహుమతిగా ఈ ప్రమోషన్ ఇచ్చారు'' అని అప్పట్లో బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ బాధ్యునిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ చెలరేగిపోయారు.తర్వాత ఆయన మారుమనసుతో బిఆర్ఎస్ లో చేరిపోయారు.

''తన సన్నిహితులు,శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులను కూడా హరీష్ రావు దూరం పెట్టేవారు. ఎవరూ తనకు ఫోన్ చేయవద్దని కూడా సూచించేవారు.తన బతుకు లాగే మీ బతుకులూ ఆగమయి పోతాయని అనేవారు. అందరి ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి అని హెచ్చరించేవారు.'' అని బిఆర్ఎస్ నాయకుడు వి.ప్రకాష్ కొద్ది రోజుల కిందట ఒక యూట్యూబ్ ఛానల్ లో చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో మాజీ మంత్రి హరీశ్ రావు వంటి సీనియర్లు కూడా గజ గజ వణిపోయారంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు.

# శరణార్థులు కూడా సాధారణ పౌరులే

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరేవారు, ఆశ్రమం పొందేవారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందినవారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరిన వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున ప్రపంచ శరణా ర్థి దినం (వరల్డ్ రెఫ్యూజీ డే)ను 2001 నుంచి పాటించడం జరుగుతోంది. 2025 ప్రపంచ శరణార్థి దినం ఇతివృత్తంగా 'శరణార్థులకు సంఘీభావంగా ఉందాం' అనే అంశాన్ని నిర్ణయించారు. 2025 శరణార్థివారం ఇతివృత్తంగా సూపర్ పవర్‌గా పౌర సమాజం అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి. భారత్‌లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేలమంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది.

ప్రపంచ శరణార్థి దినం వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి.

# పెళ్లి, విడాకుల్లో సంక్లిష్టతలు.. అందుకే జీవితభాగస్వాముల హత్యలు

మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు ఇటీవల సంచలనం సృష్టించింది. ఇండోర్‌కు చెందిన సోనమ్, రఘువంశీల వివాహం జరగ్గా.. ఆ పెండ్లి ఇష్టం లేకపోవడంతో ప్రియుడితో కలిసి సోనమ్ భర్తను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మీరట్‌లో సౌరభ్ రాజ్‌పుత్ అనే వ్యక్తిని అతని భార్య ముస్కాన్ రాస్తోగి, ఆమె ప్రియుడు సహిల్ శుక్లా హత్యచేసి, శవాన్ని సిమెంట్ డ్రమ్‌లో దాచారు. కర్ణాటకలో ఒక మాజీ డిజిపిని ఆమె భార్య కత్తితో పొడిచి హత్య చేసింది. యుపి, ఢిల్లీ, బిహార్ ఇలా చాలా రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. భార్యలను హత్య చేస్తున్న ఘటనలు దేశంలో నిత్యకృత్యంగానే మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జీవితభాగస్వాముల మధ్య హత్యలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. అయితే ఇందులో 95 శాతానికి పైగా కేసుల్లో ఎవరికీ క్రిమినల్ రికార్డులు లేవు. 'పెళ్లి–విడాకులు' అనే రెండు అంశాలపై సామాజికంగా వస్తున్న ఒత్తిళ్లు సామాన్య పౌరులను సైతం నేరస్తులుగా మారుస్తున్నాయి. చిన్న సొల్యూషన్ తో పరిష్కారమయ్యే సమస్యలు కూడా హత్యల వరకు దారితీస్తున్నాయి.

**ఇష్టం లేకున్నా వివాహబంధంలోకి..** భారత్‌లో 85 నుంచి 90 శాతం అరేంజ్డ్ మ్యారేజెస్ జరుగుతున్నాయి. అందులో అబ్బాయి, అమ్మాయిల సమ్మతి తీసుకోకుండానే ఒత్తిడితో చేసిన వివాహాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. భారత సమాజంలో వివాహ బంధం అనే ది ఇద్దరు వ్యక్తుల మధ్య కంటే.. కుటుంబాల మధ్య ఒప్పందంగా భావిస్తారు. కులం, మతం, ఆర్థిక స్థితి, సామాజిక స్థాయిని బట్టి జీవిత భాగస్వాములను ఎంపిక చేస్తారు. ఎక్కువ శాతం పెళ్లిళ్లలో జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ సంబంధిత వ్యక్తికి ఇవ్వరు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా కుటుంబంపై ఆధారపడి ఉండడంతో వారికి నిర్ణయం తీసుకునే ఫ్రీడమ్ తక్కువగా ఉంటున్నది. మహిళలు గృహ హింసకు గురవుతున్న సందర్భాలు అనేకం. విడాకులు తీసుకోవడం తీవ్ర కష్టతరం కావడం, ఆ వివాహ బంధం నుంచి బయటపడలేక ఆందోళనకు గురవుతున్నారు. ఆ వివాహ బంధం నుంచి ఎలాగైనా బయటపడాలనే ఆతృతతో కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకొని నేరస్తులుగా మిగిలిపోతున్నారు. విడాకుల ప్రక్రియ సుదీర్ఘమైనది, ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. ఈ జాప్యం వివాదాలను తీవ్రతరంచేసి హత్యల వరకు తీసుకెళ్తున్నదనే అభిప్రాయం ఉంది.

**ఇలా చేస్తే మంచిది..** సమాజంలో మార్పువస్తేనే ఈ హత్యల నివారణ సాధ్యమవుతుంది. వివాహ బంధం నుంచి బయటకు వెళ్లిపోయినా.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా పథకాలను అమలు చేయాలి. పెళ్లి చేయడానికి అయ్యే ఖర్చును భారీగా తగ్గించాలి. విడాకులను ఒక వైఫల్యంగా చూడడం కంటే.. ఒక వ్యక్తి స్వాతంత్ర్యం, ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన ఎంపికగా సమాజంలో ప్రచారం చేయాలి.

ఫిరోజ్ ఖాన్, 9640466464



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆసుపత్రి నుంచి సోనియాగాంధీ డిశ్చార్జి



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఉదర సమస్యలతో బాధపడుతున్న ఆమె ఈనెల 15న ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా చికిత్స పొందిన సోనియా గాంధీ ఆరోగ్యం మెరుగుపడటంతో గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని, డిశ్చార్జ్ చేసినట్లు ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. కాగా, ఉదర సంబంధిత సమస్యలతో సోనియా గాంధీ ఆదివారం రాత్రి ఢిల్లీలోని ఆసుపత్రిలో చేరారు. ఈ నెల 9వ తేదీన ఇదే ఆసుపత్రిలో సోనియా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న సోనియా గాంధీకి వైద్యులు చికిత్స అందించారు.

### మునీర్‌కు ట్రంప్ ఆహ్వానం

## భారత దౌత్యానికి పెద్ద దెబ్బ

### కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను భోజనానికి అహ్వానించడంతో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. ఇది భారత దౌత్యానికి పెద్ద దెబ్బ అని పేర్కొంది. ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ పాకిస్థాన్ దేశాధినేత లేదా ప్రభుత్వ అధిపతి కాదని, ఆర్మీ స్టాఫ్ చీఫ్ అయినప్పటికీ ట్రంప్ ఆయనను భోజనానికి ఆహ్వానించి ఆయనను ప్రశంసించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఇది భారత దౌత్యానికి పెద్ద దెబ్బ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని విమర్శించారు. ఈ పరిణామంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న హగ్‌లోమసీకి కూడా పెను విఘాతం కలిగిందని ఎద్దేవా చేసింది. ట్రంప్ సహా ప్రపంచ దేశాల అధినేతలను ఆత్మీయ ఆలింగనాలు చేసుకోవడం ద్వారా ప్రధాని మోదీ హగ్‌లోమసీని చేస్తున్నారని చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది. కాగా, భారత్, పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు నేతలూ తెలివైన వారని, ఘర్షణ మొదలైన మొదటిసారే అణ్వాయుధంగా మారే యుద్ధాన్ని కొనసాగించకూడదని నిర్ణయించుకున్నారని, రెండు పొరుగు దేశాల మధ్య శత్రుత్వాన్ని ఆపినందుకు తాను క్రెడిట్ పొందలేదని ట్రంప్ అన్నారు. బుధవారం వైట్ హౌస్‌లో మునీర్‌కు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత ఓవల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను కలవడం తనకు గౌరవంగా ఉందని ట్రంప్ అన్నారు. కాగా, ప్రధాని మోదీతో మాట్లాడిన కొన్ని గంటల తర్వాత, మునీర్‌ను కలవడానికి ముందు, భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ఆపానని ట్రంప్ తన పదే పదే వాదనను పునరావృతం చేయడంతో, మోదీ 'ప్రజా ప్రచార యంత్రాంగం' సృష్టించిన హైప్‌ను ఆయన తగ్గించారని, అమెరికన్ నాయకుడు చేసిన వాదనలను ప్రధానమంత్రి బహిరంగంగా ఖండించాలని కాంగ్రెస్ పేర్కొంది. ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రిత్వ శాఖ మాటలు ఇప్పుడు చాలా బలహీనంగా ఉన్నాయా, వారు అమెరికా అధ్యక్షుడితో అరగంట పాటు ఫోన్‌లో జరిపిన సంభాషణల్లో భారత వైఖరిని కూడా స్పష్టంగా ప్రదర్శించలేకపోతున్నారా అని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం హెడ్ పవన్ ఖేరా నిలదీశారు. ఎక్స్‌లో ఖేరా ట్రంప్ మాటలను ఉటంకిస్తూ 'నేను యుద్ధాన్ని ఆపాను. నేను బుధవారం రాత్రి ప్రధాన మంత్రి మోడీతో మాట్లాడాను. మేము త్వరలో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయబోతున్నాము' అని చెప్పారు.

### విమాన ప్రమాదంపై

## భిన్న విభాగాల నిపుణుల బృందం దర్యాప్తు

### బ్లాక్ బాక్స్ డీ–కోడింగ్‌పై ఎఎఐబిదే నిర్ణయం

### పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ప్రకటన

**అహ్మదాబాద్ :** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం జరిగిన వారంరోజుల తర్వాత బ్లాక్ బాక్స్ డీ–కోడింగ్ పైనే అధికారులంతా దృష్టి సారించారు. ఈ రెండు బ్లాక్ బాక్స్‌లలో ఉన్న సమాచారాన్ని తెలుసుకోవడానికి ఏ విధంగా, ఎలా డీ–కోడ్ చేయాలి, ఎక్కడకు తీసుకువెళ్ళి డీ–కోడింగ్ చేయాలి అనే విషయంపై దర్యాప్తు అధికారులు ఒక నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వం ప్రకటించింది. ''విమాన ప్రమాద ఘటనాస్థలంలో దొరికిన బోయింగ్‌కు చెందిన సివిఆర్–డిఎఫ్‌డిఆర్ (బ్లాక్‌బాక్స్)లను డీ–కోడింగ్ చేసేందుకు, విశ్లేషణ చేసేందుకు విదేశాలకు తరలిస్తున్నారని కొన్ని పత్రికల్లో మీడియాలో వార్తలు వెలువడ్డాయి, ఐతే సాంకేతికపరమైన, భద్రతకు సంబంధించిన పరిశీలనలు, విశ్లేషణలు చేసిన తర్వాత ఫ్లయిట్ రికార్డులను ఎక్కడకు తీసుకువెళ్ళి డీ–కోడింగ్ చెయ్యాలి, ఎలా విశ్లేషణ చేయాలి అనే విషయంపై ఎఎఐబి (ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) ఒక నిర్ణయం తీసుకుంటుంది'' అని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. స్థానిక అధికారులు, ఏజన్సీల సహాయంతో అన్నివిధాలుగా సమాచారాన్ని సేకరిస్తూ, విమానం కూలిపోవడానికి గల ప్రధాన కారణాలు కనిపెట్టే దిశగా దర్యాప్తు అధికారులు పురోగతి సాధిస్తున్నారని మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రమాదం జరిగిన ప్రదేశం చుట్టుపక్కల ఉన్న సమాచారాన్ని, ఆ పూర్తి వివరాలను పత్రాలలో పొందుపరచి సాక్ష్యాలను సేకరించే ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశారు. గుజరాత్ ప్రభుత్వం కూడా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ దర్యాప్తులో తమకు ఎలాంటి సంబంధం లేదని, కేంద్ర అధికారులు కోరిన విధంగా తగిన సహాయాన్ని మాత్రమే అందిస్తున్నామని తెలియజేసింది. ప్రమాదం జరిగిన తర్వాత విమానం తోకభాగం మెడికల్ హాస్టల్ భవనం పైభాగంలో ఇరుక్కుపోయిందని, దీనివల్ల క్యాంటిన్ భవనం ధ్వంసమైందని, తర్వాత రెండు రోజులకు జూన్ 14వ తేదీన ఈ తోక భాగాన్ని క్రేన్ల సహాయంతో నేలమీదకు దించామని ఖాడియా చెప్పారు. ఈ విధమైన అంతర్జాతీయస్థాయి ప్రయాణ విమానానికి రెండు బ్లాక్ బాక్సులు ఉంటాయి. విమాన ప్రమాదం జరిగిన మరునాడు జూన్ 13న ఘటనాస్థలం నుండి కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సివిఆర్), డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డిఎఫ్‌డిఆర్) కు చెందిన ఉమ్మడి యూనిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జూన్ 16న రెండో జతను కూడా స్వాధీనం చేసుకున్నారు. జూన్ 12వ తేదీ మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి లండన్‌కు బయలుదేరిన బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్‌లో 242 మంది ప్రయాణికులు ఉన్నారు. బయలుదేరిన తర్వాత 1.5 కి.మీ ప్రయాణించిన విమానం సెకన్ల వ్యవధిలోనే సమీపంలోని ఒక మెడికల్ హాస్టల్‌పై కూలిపోయింది. ఇప్పటివరకూ డిఎన్ఎ టెస్టుల ద్వారా 215 మంది మృతుల మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు చెప్పారు. మృతదేహాలు గుర్తుపట్టడానికి కూడా వీలులేనంతగా మాడిపోయాయి. మృతుల్లో 149 మంది దేహాలను భారతీయ కుటుంబాలకు స్వాధీనం చేశారు. 32 మంది బ్రిటన్ పౌరుల మృతదేహాలను, ఏడుగురు పోర్చుగల జాతీయుల మృతదేహాలను, ఒక కెనడా వాసి మృతదేహాన్ని వారికి అప్పగించారు. ఏడు మృతదేహాలకు చెందిన అవశేషాలను కూడా వారి వారి బంధువులకు స్వాధీనం చేశారు.

## పార్టీలో కొంతమందితో భేదాభిప్రాయాలు

### కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శశిథరూర్



**తిరువనంతపురం :** కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని కొంతమందితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్నాయ ని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడు శశి థరూర్ పేర్కొన్నారు. అయితే కేరళలోని నిలంబూర్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నిక దృష్ట్యా తాను వాటి గురించి మాట్లాడబోనన్నారు. గురవారం ఆయన తిరువంతపురంలో మీడియాతో మాట్లాడారు. కాం గ్రెస్, దాని విలువలు, పార్టీ కార్యకర్తలు తనకు చాలా ప్రియమైనవారని థరూర్ అన్నారు. తాను 16 సంవత్సరాలుగా పార్టీ కార్యకర్తలతో సన్నిహితంగా పనిచేశానని, వారిని సన్నిహిత స్నేహితులు, సోదరులుగా చూస్తున్నానని చెప్పారు. 'నేను ఏమి మాట్లాడుతున్నానో మీకు తెలుసు, ఎందుకంటే అందులో ఉన్న కొన్ని ప్రజాక్షేత్రంలో ఉన్నాయి' అని థరూర్ అన్నారు. అయితే తనకు అభిప్రాయ భేదాలు జాతీయ లేదా రాష్ట్ర నాయకత్వంతో ఉన్నాయా అని ఆయన స్పష్టం చేయలేదు. ఉప ఎన్నిక ఫలితాల తర్వాత ఆ విభేదాల గురించి మాట్లాడవచ్చని తిరువనంతపురం ఎంపి సూచించారు. ఉప ఎన్నిక ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదని అడిగినప్పుడు, గత సంవత్సరం జరిగిన వయనాడ్ ఉప ఎన్నికలతో సహా ఇతర ఉప ఎన్నికల్లాగానే తనను ఆహ్వానించలేదని థరూర్ అన్నారు. ఆహ్వానించబడని చోటికి వెళ్ళనన్నారు. పార్టీ కార్యకర్తల ప్రచార ప్రయత్నాలు ఫలించాలని, నిలంబూర్ నుండి యుడిఎఫ్ అభ్యర్థి గెలవాలని కోరుకుంటున్నానన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఇటీవల జరిగిన చర్చల గురించి మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి వివిధ దేశాలకు ప్రతినిధి బృందాల పర్యటనలు, అక్కడ జరిగిన చర్చల గురించి జరిగాయన్నాయని థరూర్ అన్నారు. ఏ దేశీయ రాజకీయాల గురించి చర్చించలేదని చెప్పారు. ప్రతినిధులలో ఒకదానికి నాయకత్వం వహించడానికి కేంద్రం ఆహ్వానాన్ని అంగీకరించాలనే తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, పార్లమెంటు విదేశాంగ కమిటీ చైర్మన్ అయినప్పుడు, తాను కాంగ్రెస్, బిజెపి విదేశాంగ విధానంపై కాకుండా భారతదేశ విదేశాంగ విధానం, దాని జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించానని స్పష్టం చేశానని అన్నారు. 'నేను నా పంథాను మార్చుకోలేదు. దేశానికి సంబంధించిన సమస్య వచ్చినప్పుడు, మనమందరం దేశం కోసం పని చేయడానికి, మాట్లాడటానికి బాధ్యత వహిస్తాము. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేను చెప్పింది నా సొంత అభిప్రాయం. 'కేంద్రం నా సేవలను కోరింది. నిజానికి, నా పార్టీ అడగలేదు. కాబట్టి, నేను భారత పౌరుడిగా నా విధిని గర్వంగా నిర్వర్తించాను' అని ఆయన అన్నారు.

### క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో...

## ఐఐటి ఢిల్లీకి అత్యుత్తమ ర్యాంకు

### దేశంలోని 54 విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలకు రికార్డు స్థాయిలో జాబితాలో చోటు




**న్యూఢిల్లీ :** ప్రఖ్యాత క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో ఐఐడి ఢిల్లీ అత్యుత్తమ ర్యాంక్ పొందిన భారతీయ సంస్థగా నిలిచింది. దేశంలోని 54 విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు రికార్డు స్థాయిలో ఈసారి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను వివిధ అంశాలవారీగా అంచనా వేసి క్యూఎస్ ర్యాంకింగ్స్ 2026 విడుదల చేస్తారు. ఐఐటి ఢిల్లీ గత రెండేళ్లు వరుసగా 197, 150 వ స్థానంలో నిలిచింది. ఈసారి ర్యాంకింగ్స్‌లో 70 స్థానాలు మెరుగుపరుచుకుని 123వ స్థానంలో ఉంది. ఉద్యోగ కల్పనలో (50వ స్థానం), సైటేషన్స్ (86వ ప్లేస్), సస్టైనబిలిటీ (172వ స్థానం), అకడమిక్ రెప్యుటేషన్ (142వ ప్లేస్)లో ఉంది. దీంతో ర్యాంకింగ్స్‌లో మెరుగుపడింది. అమెరికాకు చెందిన జార్జియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కలిసి ఐఐటి ఢిల్లీ 123వ ర్యాంక్‌ను సంయుక్తంగా పంచుకుంది.

**దిగజారిన ఐఐటి బాంబే ర్యాంకు...** క్యూఎస్ ర్యాంకింగ్స్ 2025లో 118వ ర్యాంక్‌తో రాణించిన ఐఐటి బాంబే ఈసారి కాస్త వెనుకపడింది. 129వ స్థానానికి పడిపోయింది. అయినప్పటికీ అది ప్రపంచంలో టాప్ 130లో కొనసాగుతోంది. ఉద్యోగాల కల్పనలో 39వ స్థానంలో ఉంది. అమెరికాకు చెందిన 192, యుకెకు చెందిన 90, చైనాలోని 72 సంస్థలు, భారత్‌కు చెందిన 54 ఉన్నత విద్యాసంస్థలు క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించుకున్నాయి. క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో భారత యూనివర్సిటీలు నాలుగో స్థానంలో నిలిచాయి.

**ర్యాంకింగ్స్ చోటు దక్కించుకున్న 8 కొత్త యూనివర్సిటీలు...** దేశంలోని 11 ప్రభుత్వ, ఆరు ప్రైవేట్ యూనివర్సిటీలు ఈ ఏడాది తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాయి. ఐఐటి మద్రాస్ 47 స్థానాలు మెరుగుపరుచుకుని మొదటిసారిగా టాప్ 200లోకి ప్రవేశించింది. ప్రస్తుతం 180వ స్థానంలో నిలిచింది. షూలిని యూనివర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (503వ స్థానం), చండీగఢ్ యూనివర్సిటీ (575వ స్థానం), బిర్లా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ 668వ స్థానంలో ఉంది. ఈసారి క్యూఎస్ ర్యాంకింగ్స్ జాబితాలో ఎనిమిది భారతీయ విద్యాసంస్థలు కొత్తగా ప్రవేశించాయి. ఏ ఇతర దేశం నుంచి కూడా ఇన్ని కొత్త సంస్థలు ఈ జాబితాలో చేరకపోవడం గమనార్హం. 'భారతదేశం ప్రపంచ ఉన్నత విద్యా పటాన్ని తిరిగి రాస్తోంది. ఈ ఎడిషన్‌లో క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో మరే దేశంలోనూ ఇన్ని కొత్త యూనివర్సిటీలు చోటు దక్కించుకోలేదు. ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యా వ్యవస్థకు స్పష్టమైన సంకేతం. మేము భారత్‌లోని విశ్వవిద్యాలయాల స్పష్టమైన పురోగతిని చూస్తున్నాం. భారతీయ విశ్వవిద్యాలయాలు తమ ప్రపంచ పరిశోధన పాదముద్రను బలోపేతం చేస్తున్నాయి. ఫ్యాకల్టీ, స్థిరత్వం, అంతర్జాతీయ పరిశోధన అంశాల వంటి రంగాల్లో ముందుకు సాగుతున్నాయి. కేవలం ఒక దశాబ్దంలో భారత్‌లోని యూనివర్సిటీలు క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో 11 నుంచి 54కి పెరిగాయి. ఇది 390శాతం పెరుగుదల.'అని క్యూఎస్ సీఈఓ జెస్సికా టర్నర్ తెలిపారు.

**ప్రధాని మోదీ హర్షం...** భారత్‌కు చెందిన 54 విశ్వవిద్యాలయాలు క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ 2026 ర్యాంకింగ్స్ మన విద్యా రంగానికే గొప్ప శుభవార్త అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యువత ప్రయోజనం కోసం పరిశోధన, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలను మరింత పెంపొందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## 'థగ్ లైఫ్' విడుదల చేయాల్సిందే.. కర్ణాటకకు సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ :** కమల్‌హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమాను కర్నాటకలో రిలీజ్ చేయాల్సిందే అని, అది ప్రభుత్వ బాధ్యత అని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్‌ను రిలీజ్ చేయాల్సిన బాధ్యత రాష్ట్రానిదే అని కోర్టు చెప్పింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటామని బెదిరిస్తున్న వారిని నియంత్రించాలని, దీనిపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.తమిళం నుంచే కన్నడ భాష పుట్టినట్లు ఫిల్మ్ స్టార్ కమల్‌హాసన్ ఇటీవల వ్యాఖ్యలు చేయడంతో వివాదం మొదలైంది. దీంతో అతను నటించిన థగ్‌లైఫ్ సినిమాను కర్నాటకలో రిలీజ్ చేయకుండా అడ్డుకున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కమల్‌హాసన్ కోర్టును ఆశ్రయించారు. సుప్రీం చివాట్లతో దిగివచ్చిన కర్నాటక ప్రభుత్వం నిరసనకారులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటున్నవారికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఒకవేళ ఎవరైనా సినిమాను అడ్డుకుంటే వారిపై కర్నాటక సర్కారు తీవ్ర చర్యలు తీసుకుంటుందని సుప్రీం తెలిపింది. జూన్ 5వ తేదీన థగ్‌లైఫ్ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వివాదం వల్ల కర్నాటకలో ఆ ఫిల్మ్‌ను బ్యాన్ చేశారు.

## హత్యకు గురైన మాజీమంత్రి నివాసాల్లో ఐటి సోదాలు

**భువనేశ్వర్:** క్రిస్టియన్ మైఖేల్‌ను 2023లో హత్యకు గురైన ఒడిశా మాజీ మంత్రి , సీనియర్ బీజేపీ నేత నబా కిశోర్ దాస్‌కు సంబంధించిన అక్రమార్జన కేసులో ఇవాళ ఆదాయం పన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సుమారు 20 ప్రదేశాల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. గురువారం ఉదయం ఐటీ సెర్చ్ ఆపరేషన్ మొదలైంది. జార్సుగూడ, సంబల్‌పూర్, న్యూఢిల్లీల్లో ఉన్న దివంగత మాజీ మంత్రి నివాసాలతో పాటు బంధువులు, అనుబంధ వ్యాపారవేత్తల ఇండ్లల్లోనూ ఐటీ శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. భువనేశ్వర్‌లో ఉన్న మాజీ మంత్రి ఇళ్లు మాత్రం ప్రస్తుతం మూసివేశారు. నబా కిశోర్ దాస్‌తో లింకున్న హోటల్ నిక్కీ, ఇతర ప్రాపర్టీలపై కూడా ఐటీ సెర్చ్ జరుగుతోంది. పన్ను ఎగవేతతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయి. సుమారు 180 మంది ఐటీ ఆఫీసర్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సుమారు 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 60 వాహనాలు, సైంటిఫిక్ అనాలిస్ బృందం కూడా వారితో ఉన్నాయి.

## రాహుల్‌కు కొత్త చిరునామా

### ఢిల్లీ సునేహ్రీబాగ్ రోడ్డులోని బంగ్లా నంబర్ 5కి మారనున్న ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ త్వరలోనే కొత్త నివాసానికి మారబోతున్నారు. ఢిల్లీలోని సునేహ్రీబాగ్ రోడ్డులోని బంగ్లా నంబర్ 5 ఇకపై ఆయన కొత్త చిరునామాగా మారనుంది. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా సామాన్ల తరలింపు ప్రక్రియ మొదలైనట్లు సమాచారం. జులై 21నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఆయన ఈ బంగ్లాకు మారతారని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. తన అధికారిక నివాసంగా ఈబంగ్లాను రాహుల్‌గాంధీ అంగీకరించినట్లు సదరు వర్గాలు తెలిపాయి. రాహుల్‌కు బంగ్లాను ఆఫర్ చేసినప్పటికీ.. ఆయన ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు గతేడాది పార్లమెంటు వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, రాహుల్ ఎంపి అయినప్పటి నుంచి ఆయన 12, తుగ్లక్‌లేన్‌లో నివసించేవారు. అయితే, పరువునష్టం కేసులో దోషిగా తేలడంతో 2023లో లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించడంతో ఆయన ఆఇంటిని ఖాళీ చేయాల్సి వచ్చింది. అప్పటినుంచి రాహుల్ తనతల్లి సోనియాగాంధీతో కలిసి 10 జనపథ్‌లోనే నివసిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నిక కావడంతో ఆయనకు క్యాబినెట్ మంత్రి హోదా దక్కడంతో టైప్ 8 బంగ్లాకు అర్హులయ్యారు. గతంలో సునేహ్రీబాగ్ నివాసంలో కర్ణాటక బిజెపి నేత ఎ. నారాయణస్వామి ఉన్నారు. ఆయన 2021–24 మధ్య కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు.

## ఇంగ్లీష్ మాట్లాడే వారు.. సిగ్గు పడే రోజులొస్తాయ్

### కేంద్రమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ :** దేశంలో ఇంగ్లీష్ భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్రమంత్రి అమిత్‌షా అన్నారు. దేశ ఐక్యతలో భారతీయ భాషలు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఐఎ ఎస్ ఆఫీసర్ ఆశుతష్ అగ్నిహోత్రి రాసిన మై బూంద్ స్వయం.. కుద్ సాగర్ హు అన్న పుస్తకాన్ని గురువారం మంత్రి రిలీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయ భాషల వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన సందర్భంగా వచ్చిందన్నారు. మాతృ భాషలపై గర్వంతో ప్రపంచంలో ముందుకు వెళ్లాలన్నారు. ఈ దేశంలో.. త్వరలో ఇంగ్లీష్ మాట్లాడే ప్రజలు సిగ్గుపడే సందర్భం వస్తుందని, అలాంటి సమాజ ఏర్పాటు ఎంతో దూరం లేదని, పట్టుదలతో మార్పును కోరుకునేవారితో అది సాధ్యం అవుతుందని, మన దేశంలోని భాషలు.. మన సంస్కృతికి రత్నాలని నమ్ముతున్నట్లు చెప్పారు. మన భాషలు లేకుండా మనం ఈ దేశవాసులం కాబోమన్నారు. ఈ దేశాన్ని, సంస్కృతిని, చరిత్రను, మతాన్ని అర్థం చేసుకోవడనానికి ఏ విదేశీ భాష సరిపోదు అని, అసమగ్రమైన విదేశీ భాషలతో సమగ్రమైన దేశభావన రాదు అని, ఇది చాలా సంక్లిష్టమైన అంశమని, కానీ భారతీయ సమాజం దీంట్లో విజయం సాధిస్తుందని ఆశిస్తున్నానని, మరోసారి మన దేశాన్ని మన స్వంత భాషల్లో ముందుకు నడిపిస్తామని అనుకుంటున్నట్లు చెప్పారు.

## ఎంపిలో డివైడర్‌ను ఢీకొని నలుగురు మృతి



**రాజ్‌గఢ్ :** మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో గురువారం ఉదయం ఎస్‌యువి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో 11ఏళ్ల బాలుడు సహా నలుగురు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండా నుండి గుజరాత్‌లోని సూరత్‌కు ఒక కుటుంబం వెళుతుండగా ఉదయం ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని కర్వాస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ జాట్ తెలిపారు. దాదాపు 18 గంటలు డ్రైవింగ్ చేసిన తర్వాత అలసట కారణంగా నిద్రపోయానని, వాహనంపై నియంత్రణ కోల్పోయానని డ్రైవింగ్ చేస్తున్న భోలేనాథ్ దుబే (40) పోలీసులకు చెప్పాడని అధికారి తెలిపారు. సీటు బెల్ట్ పెట్టుకుని, ఎయిర్‌బ్యాగ్ సకాలంలో అమర్చడంతో దుబే స్వల్ప గాయాలతో బయటపడ్డాడని ఇన్‌స్పెక్టర్ జాట్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ప్రాంతంలో ఏడుగురు సభ్యులతో కూడిన కుటుంబం గోండా నుండి బయలుదేరి టీ, స్నాక్స్ కోసం కొద్దిసేపు మాత్రమే విరామం తీసుకున్నారన్నారు. అన్మోల్ దూబే (16), ప్రియాంషు పాండే (11) అక్కడికక్కడే మరణించగా, ప్రమీలా పాండే (55), శివ దేవి తివారీ (45) షాజాపూర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అరవింద్ సింగ్ తెలిపారు. పుష్పం దూబే (50), అన్నికా దూబే (14) చికిత్స పొందుతున్నారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సింగ్ తెలిపారు

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL

ABR. NO. 897 OF 2024

Between:-

M/s. Kalpakam Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, rep. By it's Foremen, .....Disputant

VERSUS

P.UGENDER & OTHERS ......Opponents

1. Sri. Palapu Ugender, S/o, Narsaiah, Age: 40Yrs, Occ: Contractor works R/o: H.No: 30-2-42, Rottabanda, Madikonda, Hanamkonda.
2. Sri. Gandam Sambaraju, S/o, Chandraiah, Age: 44 Yrs, Occu: Track Mntrs/RLY/KZPT, R/o: H.No: 2-25/11, Station Ghanpur, Jangaon.
3. Sri. Malothu Narsinga Rao, S/o, Shankaraiah, Age: 49 Yrs, Occu: Sr.Tech-Locoshed-kazipet, R/o: H.No: 2-31, Station Ghanpur, Jangaon.
4. Sri. Kandala Yugandhar, S/o, Niranjan, Age: 54 yrs, Occu: Sr. Asst. MPP-Nekkonda, R/o: H.No: 3-14-13/4/1, Yadavnagar, Hanamkonda.
5. Sri. Bochu Prasadarao, S/o, Saraiah, Age: 49 yrs, Occu:Teacher-Govt.High School, Kothhur, R/o: H.No: 2-1-761, Lashkar Singaram, Naimnagar, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 898 OF 2024

Between:-

M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman, .....Disputant

VERSUS

K.SRINIVAS & OTHERS ......Opponents

1. Sri.Konda Srinivas, S/o, Venkataiah, Age:52 Yrs, Occu:Ward Boy Govt. T.B Hospital, R/o:H.No:2-11-56,Hanmantharaonagar, Bhimaram, Warangal.
2. Sri.Kumari Nagaraju, S/o.Ramaswamy, Age:48 Yrs, Occ:Lab Technician Govt. T.B.Hospital R/o: H.No: 15-4-73,Pothananagar,Near Substation,Warangal.
3. Sri.Sambaraju Ravinder, S/o.Ilaiah, Age: 55 Yrs, Occu: Lab Attendant Govt. T.B. Hospital, R/o: H.No. 6-7-124, Raghanna Dharwaja. chowratha, Hanamkonda.
4. Sri. Muthyala Ravikumar, S/o, Veeraswamy, Age: 47 Yrs, Occu: Driver Govt.T.B. Hospital, R/o: H.No: 5-38/8, Enumamula Road, Near Petrol Bunk, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 899 OF 2024

Between:-

M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman, .....Disputant

VERSUS

V.KRISHNA & OTHERS ......Opponents

1. Sri. Venaganti Krishna, S/o,Yadagiri, Age: 42 Yrs, Occu: Business, R/o: H.No: 16-4-1386, Shivanagar, Warangal.
2. Sri. Sathani Ravikiran, S/o, Ramaiah, Age: 37 Yrs, Occ: Clerk-Indian Bank, R/o: H.No: 31-3-2073, TNGO's colony, Waddepally, Hanamkonda.
3. Sri. Venuganti Ramachandrudu, S/o, Yadagiri, Age: 40 Yrs, Occu: Business, R/o: H.No. 16-4-1387, Shivanagar, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 900 OF 2024

Between:-

M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman, .....Disputant

VERSUS

V.RAJAMANI & OTHERS ......Opponents

1. Smt.Velde Rajamani, W/o, Sarvaiah, Age: 69 Yrs, Occu: Pension Holder, R/o: H.No: 2-7-428, Excise Colony, Hanamkonda.
2. Sri.Velde Srinivas, S/o, Sarvaiah Age: 39 Yrs, Occu: Superintendent/ SR&BGNR Arts & Sceince College, Khamamm, R/o: H.No: 2-7-428, Excise Colony, Hanamkonda.
3. Sri.Velde Gyaneshwar, S/o,Sarvaiah, Age: 48 Yrs, Occu: Medical Officer/ PHC-Kunoor. R/o: H.No. 3-9-502, Reddy Colony, Hanamkonda.
4. Sri.Shakir Hussian Gulam, S/o, Gulam Shaiful Hussian, Age:35 Yrs, Occu:Junior Lecturer, R/o: H.No: 7-2-834, Mankamathota, Karimnagar.
5. Sri.Tuduru Dattatreya,S/o,Ramaiah, Age: 52 Yrs,Occu: Labrarian Govt Degree College. R/o: H.No: 1-2-122/1, Near Potti Sriramulu Statue, Indhira Marrket, Kaghaznagar.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL

ABR. NO. 901 OF 2024

Between:-

M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman, .....Disputant

VERSUS

A.RAMAKRISHNA & OTHERS ......Opponents

1.
2. Sri.Gundeti Sampath, S/o, Kailasam, Age: 38 Yrs, Occ: Business, R/o: H.No: 9-1-30, Nehrunagar, Sircilla, Rajanna Siricilla.
3. Sri.Adepu Devender, S/o,Sathaiah, Age: 37 Yrs, Occu: Police Constabler, R/o: H.No. 6-5-12, Vidyanagar, Near Water Tank, Rajanna Siricilla
4. Sri.Mekala Kumar,S/o,Lingaiah, Age: 52 Yrs, Occu: Police Constable, R/o: H.No: 15-Police Quarters, Metapally, Karimnagar.
5. Sri.Maganti Srikanth, S/o, Rajendraprasad, Age: 42 Yrs, Occu: Teacher (HPT-Gr-II), R/o: H.No: 1-8-74/1B, Adarshanagar, Metpalli, Karimnagar.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.07.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.

## దళితులకు చెందిన స్మశాన వాటిక దళితులకే కేటాయించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ఏండ్ల తరబడి దళితులు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని ముల్కలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో స్థానిక ఎమ్మార్వో దేశ్యకు గ్రామానికి చెందిన దళితులు మెమోరాండం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముల్కలపల్లి గ్రామంలోని 33/8 సర్వేనెంబర్‌లో ఉన్నటువంటి స్మశాన వాటిక స్థలాన్ని ఆనాటి ప్రజాప్రతినిధులు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, పక్క గ్రామమైన జేతిరాం తండా గ్రామానికి అట్టి స్థలాన్ని అన్యాయంగా రాసిచ్చాడని, అందులోనే వైకుంఠ ధామం నిర్మించుకొని జేతురాం తండా గ్రామస్థులు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దయ చేసి మాదిగ కులానికి చెందిన బొందల గడ్డను అన్యాయంగా రాసిచ్చారని, వెంటనే అట్టి సమస్యపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని తమ దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళిత కుల పెద్దలు ఎస్.పెంటయ్య, రామచంద్రయ్య, అంజమ్మ, యాదమ్మ, దుర్గయ్య, ఇస్తారి పాల్గొన్నారు.

## బీచుపల్లి ఆంజనేయుడి సన్నిధిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లాలోని కృష్ణా నది సమీపంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, విజయుడు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు పాల్గొన్నారు.





## రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భూ సమస్యలకు రెవెన్యూ సదస్సుల ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం భువనగిరి మండలంలో చీమలకొండూరు గ్రామంలో భూ భారతి రెవిన్యూ సదస్సు లో పాల్గొని జరుగుతున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సదస్సులో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్య

### భవిత కేంద్రాల్లో అవసరాలు ఉన్న పిల్లలను నమోదు చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరిని నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌తో కలిసి ప్రారంభించి ఆమె మాట్లాడారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంతేకాక వారి మానసికపరమైన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తదుపరి విడతలో విద్యాశాఖ ద్వారా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడం పట్ల సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌ను, విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులకు న్యాయం జరిగేలా పనిచేద్దాం



**ప్రజాపక్షం/యాదాద్రి :** అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. గురువారం మినీ మీటింగ్ హాల్‌లో రెవిన్యూ డివిజనల్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఎన్ని పరిష్కరించారని మండలాల వారిగా సమీక్షిస్తూ వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేసి తద్వారా నోటీసులు జారీ చేయాలన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, భూ సంబంధిత సమస్యల మార్పులు చేర్పులు తదితర భూ సమస్యలు పరిష్కరించుట కొరకు పాత ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సంబంధిత పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగియున్నందున క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో భువనగిరి రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, అన్ని మండలాల తహసిల్దార్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంపునకు కృషి : డిఇఒ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడుతూ జిల్లాలో 1438 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, అందులో 229 హైస్కూల్స్, 117 యుపీఎస్, 1100కు పైగా ప్రైమరీ స్కూల్స్, కేజీబీవీ 27, మోడల్ స్కూల్స్ 17, యుఆర్ఎస్ ఒకటి ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 69వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని అన్నారు. ఆగస్టు 31తో అడ్మిషన్ గడువు ముగుస్తుందని అప్పటిలోగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం విద్యార్థి సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించబడుతుందని, గుణాత్మక విద్య ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందుతుందని తల్లిండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలను నడపవద్దన్నారు. అనుమతులు ఒక పేరుతో పాఠశాలలు మరో పేరుతో కొనసాగితే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలను 24 గుర్తించామని వాటిని మూసివేస్తామని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది పాఠశాలలను తిరిగి పునః ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో బాలునాయక్ ఉన్నారు.

# డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

### దామరచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర్ల) :** ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె దామరచర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపి రిజిస్టర్ ,ఇతర రిజిస్టర్‌ను, మందుల స్టాక్‌ను పరిశీలించారు. డాక్టర్లతో మాట్లాడు తూ సమయం ప్రకారం డాక్టర్లు,సిబ్బంది విధులకు హాజరు కావాలని ,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ,ముఖ్యంగా వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందించాలని , కేసులు సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ కేంద్రంలో ఉన్న పిల్లలను పరిశీలించారు. అంతేకాక నిర్మాణంలో ఉన్న టాయిలెట్ పనులను తనిఖీ చేశారు. ఆక్టివిటీ రూమ్ లో నూతన సాంకేతిక తను ఉపయోగించి విద్యార్థులకు కృత్యాధార పద్దతిలో బోధించడం జరుగుతుందని, అలాగే ఫిజియోథెరపీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కెజిబివి పరిసరాలు, టాయిలెట్స్ అన్నింటిని తిరిగి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్,మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

**నిర్లక్షం చేస్తే షో కాజ్ నోటీసులు :** పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె పాఠశాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు, తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడం ,అలాగే వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా పాఠశాలల్లో పరిశుభ్రత లోపం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకించి జిల్లాలోని అన్ని పాఠశాలలు ,అంగన్వాడీ కేంద్రాలు ,హాస్టళ్లలో పరిశుభ్రత లోపం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మండలాల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎక్కడా ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. నిర్లక్షం చేస్తే షో కాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,ఎమ్ ఎస్ వో లు, ఇతర అధికారులు, తదితరులు, హాజరయ్యారు.



## డబ్బాకొట్లను తొలగించాలని చూస్తే ఉద్యమిస్తాం

### అఖిలపక్షం నాయకుల హెచ్చరిక

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని మండపం ఏరియాలో డబ్బాకొట్లు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ గత యాభై సంవత్సరాలుగా అప్పటి గ్రామ పంచాయతీకి ప్రస్తుతం మున్సిపాలిటికి పన్నులు చెల్లిస్తూ చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్న వారి డబ్బాకొట్లను తొలగించాలని, లేనిచో మేమే బలవంతంగా మీ డబ్బాకొట్లు తొలగిస్తామని మున్సిపాలిటి వారు భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమని కోదాడ పట్టణ అఖిలపక్షం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నలభై, యాభై ఏళ్లుగా నిరుపేదలైన వారు డబ్బాకొట్లు ఏర్పాటు చేసుకుని బతుకుతుంటే వారిని అక్కడ నుండి వెళ్లగొట్టాలని చూడటం. వారి జీవనం మీద దెబ్బకొట్టడమేనని అన్నారు. ఒక వేళ మున్సిపాలిటి వారు బలవంతంగా ఆ డబ్బాకొట్లను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఎంతటి పోరాటానికైనా సిద్దమేనని అన్నారు. ఈ విషయమై డబ్బాకొట్లు దుకాణందారులు గౌరవ హైకోర్టును ఆశ్రయించగా వారి తరుపున వీర్లాల ప్రవీణ్‌కుమార్ లాయర్‌గా హైకోర్టులో వాదనలు వినిపించగా హైకోర్టు సానుకూలంగా స్పందిస్తూ ఆ డబ్బాకొట్లను తొలగించరాదని అదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో డబ్బాకొట్ల దుకాణదారుల సంఘం అధ్యక్షులు ఎస్‌కె నయీం, గౌరవ అధ్యక్షులు బొలిశెట్టి కృష్ణయ్య, సిపిఐ నాయకులు మేకల శ్రీనివాసరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, కాంగ్రెస్ నాయకులు ఎస్‌డి ముస్తాపా, కందరబోయిన వేలాద్రి, బిఆర్‌ఎస్ నాయకులు కర్ల సుందర్‌బాబు, దొంగరి శ్రీనివాస్, డబ్బకొట్ల దుకాణదారులు షేక్ దస్తగిరి, నరహరి, కర్ల రాజు, సింహచలం, రావూఫ్, సైదులు, మౌలాన, హుస్సేన్, దస్తగిరి, లక్ష్మి , కల్పన, స్రవంతి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

### సిపిఐ ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశ ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం




**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు తక్షణమే ఆపాలలి,పాలస్తీనాకు సంఘీభావాన్ని ప్రకటించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి దేశ ప్రధానికి కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ బస్టాండ్ సుభాష్ విగ్రహం దగ్గర పాలస్తీనాపై ఇజ్రాయిల్ దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ దేశ ప్రధాని దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద దేశాలను కబళించి వేసే కుట్రలో భాగంగా సామ్రాజ్యవాదులు చేస్తున్న దాడులు పాలస్తీనాను అతలాకుతలం చేస్తున్నాయని అన్నారు. పాలస్తీనాలో చిన్నారుల, మహిళలపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించారు. ఇజ్రాయిల్ క్రూరమైన దాడులపై మోడీ ప్రభుత్వం మౌనం వీడాలని, బాధిత పాలస్తీనా పట్ల సంఘీభావం ప్రకటించాలని డిమాండ్. పాలస్తీన సార్వభౌమత్వాన్ని ,స్వేచ్ఛ స్వాతంత్రాన్ని హరించే విధంగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తుందని అమెరికా సామ్రాజ్యవాదులు వారికి వత్తాసు పలకడం విచారకరమని అన్నారు. పాలస్తీనా ప్రజల జీవించే హక్కు హరంచి వేస్తున్న ఇజ్రాయిల్ దురాగతాలని ప్రపంచం మొత్తం ఖండించాలని కోరారు. హైదరాబాద్‌లో తయారు చేసిన డ్రోన్‌లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేస్తున్నారని, వీటిని ఆ దేశం పాలస్తీనా, ఇరాన్‌లోని అమాయక ప్రజలపై ప్రయోగిస్తున్నారని అన్నారు .కావున సైనిక సహకారాన్ని భారత్ దేశం తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.పాలస్తీనా అరబ్బులకు చెందినది హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, ఇతరులు భారతదేశంలో కలిసి నివసిస్తున్నట్లే యూదులు, క్రైస్తవులు అక్కడ శాంతియుతంగా జీవించాలి కానీ దీనికి విరుద్ధంగా దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైది రెడ్డి, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పాణెం వెంకట రావ్, మాదారు, గుండె రవి, యూసుఫ్,జానీ,వెంకన్న ఏం నందం,సీతారాములు, చాందు సర్దార్, పుట్టల సుజాత విజయ,మాధవి, హైమావతి, విజయరెడ్డి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


## సిపిఐ మోటకొండూర్ మండల కార్యదర్శిగా గాదగాని మాణిక్యం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండల సిపిఐ మండల కార్యదర్శిగా గాదగాని మాణిక్యంను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ప్రకటించారు. ఆయన గురువారం మాట్లాడుతూ మోటకొండూర్ మండల సిపిఐ 4వ మహా సభల సందర్భంగా మానిక్యం ను మరోసారి మండల కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. 31 మంది మండల కౌన్సిల్ సభ్యులుగా మండల కార్యవర్గ సభ్యులు 9 మందిని ఏకగ్రీవంగా ఎంపిక చెసినట్లు, వారితో పాటు మండల సహాయ కార్యదర్శులుగా ముసుకు పెంటారెడ్డి, ఆలేటి బాలరాజులను మండల కార్యవర్గ సభ్యులుగా పశువుల నరసింహ, బోల్ల శీను, పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, శనిగల భాగ్యమ్మ, బీరకాయల మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్య మాట్లాడుతూ మండలంలోని ఉన్న ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలతో ఉంటూ ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భారత కమ్యూనిస్టు పార్టి ముందుంటుందని, ప్రభుత్వ పథకాలు అమలులో అవకతవకలు జరిగితే సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు ధర్నాలు రాస్తారోకులు చేస్తామని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

### సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సైబర్ నేరాల పై పిర్యాదులు అందిన వెంటనే సైబర్ వారియర్స్ తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు సైబర్ వారియర్స్ కు సైబర్ నేరాల పట్ల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రైమ్ డిఎస్‌పి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని ఉపయోగించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు,మెసేజ్ లు క్లిక్ చేయకూడని, నకిలీ వెబ్ సైట్ల ద్వారా అమాయకులను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు లాగేస్తున్నారని అంతే కాకుండా వైద్య సహాయం, పేరు పొందిన కంపెనీలలో ఉద్యోగాల పేరుతో సులభంగా నమ్మే మోసాలను ఎంచుకొని మోసాలు చేస్తున్నారన్నారు. లోన్ యాప్ అంటూ సులభంగా లోన్ లు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ మీ యొక్క డేటా మొత్తం తమ అధీనం లోకి తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో మోసపూరితమైన ఆన్ లైన్ యాప్ లలో అధిక వడ్డీ ఆశా చూపి, పెట్టుబడికి రెట్టిపు సొమ్ము వస్తాయని అనేక మంది అమాయకులని మోసం చేస్తున్న కేసులు చాలా నమోదు అవుతున్నాయని జిల్లా ప్రజలు ఇలాంటి అన్ లైన్ యాప్ లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు అని, ఎవరైనా ఇలాంటి మోసాలకు గురి అయితే వెంటెనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని లేని యెడల హెల్ప్ లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని కోరారు.

# చోరీ కేసులో నలుగురు దొంగలు అరెస్టు


### రూ.11 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

### జిల్లా ఎస్పి కె.నర్సింహ్మా వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణ పోలీసులు నలుగురు దొంగలను అరెస్టు చేసి మొత్తం ఏడు కేసుల్లో రూ.11 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి కె.నర్సింహా దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. హుజూర్‌నగర్‌కు చెందిన ఇటికల ఫణిచంద్ ప్రస్తుతం కోదాడలో నివాసం ఉంటున్నాడు. కోదాడకు చెందిన మరో నిందితుడు చేకూరి నాగేంద్రబాబుతో పాటు మరో ఇద్దరు మైనర్లు మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడి కోదాడటౌన్, హుజూర్‌నగర్, చౌటుప్పల్, అనంతగిరి, మునగాల, చిలుకూరు, నల్లగొండ జిల్లాలోని వేమలపల్లి, నిడమనూరు, ఖమ్మం జిల్లాలోని నెలకొండపల్లి లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఫణిచంద్ గురువారం ఉదయం మరో దొంగ నాగేంద్రబాబు ఇంటికి వెళ్లారు. చోరీ చేసిన సొమ్ము బంగారం, వెండి అభరణాలను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండగా కోదాడ టౌన్ ఇన్స్‌పెక్టర్ కె.శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ సునిల్‌కుమార్, ఎఎస్ఐ బి.హనుమాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కరుణాకర్, కృష్ణలు, పోలీసులు యల్లారెడ్డి, కొండలు, సతీష్ లు వారిని చాక్యచక్యంగా పట్టుకున్నారు. వారి నుండి 8 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.2.20 లక్షల విలువగల కెటిఎమ్ బైకు, 60వేల విలువైన మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు, అనంతరం వీరిని విచారణ చేయగా నల్లగొండ జిల్లా నిడమనూరు, వేములపల్లి, సూర్యాపేట జిల్లాలో కోదాడ, మునగాల, చిలుకూరు, హుజూర్‌నగర్, యాదాద్రి జిల్లా చౌటుప్పల్, ఖమ్మం జిల్లాలో వీరిపై చోరీ కేసులు నమోదుకాగా జైలు జీవితం గడిపినట్లు చెప్పారు. నలుగురి నిందితుల్లో ఇద్దరు మైనర్లు కావడంతో జువైనల్ కోర్టుకు హాజరు పరుస్తున్నామని చెప్పారు. ఈ కేసును చాకచక్యంగా చేధించిన పోలీసులను జిల్లా ఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, పట్టణ ఇన్స్‌పెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు.


## ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ




**ప్రజాపక్షం/భువనగిరి :** రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు శూన్యమనీ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ రంగురంగుల బ్రోచర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో భువనగిరిలోనీ మదర్ తెరిసా పాఠశాలలో అధిక ఫీజులు తగ్గించాలని పుస్తకాల అమ్మకాలు చేయకూడదని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు పేరుతో వసూలు దందా కొనసాగిస్తున్నారన్నారు విద్యను అంగడి సరుకుగా మార్చేసి అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లు బుక్స్‌కు సపరేటు యూనిఫామ్‌కు సపరేట్ అని ఐఐటి ఫౌండేషన్ కు వేరే ఫీజు అని ఇలా రకరకాల కోర్సులు బ్రోచర్స్ తో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని చెప్పని ఎఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి డిమాండ్ చేస్తుంది. జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక లోకేష్, జిల్లా సమితి సభ్యులు చందు భువనగిరి మండల నాయకులు అరుణ్ కుమార్, సుమన్, మనీ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలివెల గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామంలో సిసి రోడ్లతో పాటు డ్రైనేజీలు చేపట్టాల్సిన ప్రాంతాలను, ఇళ్లపై నుండి వెళ్తున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. పలివెల నుండి ఊకొండి వెళ్లే రహదారిని, పలివెల నుండి చీకటిమామిడి వెళ్లే రహదారిని పరిశీలించారు. గ్రామంలో వున్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక పాఠశాలలో చదువుల నాణ్యత పెంచాలని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఫర్నిచర్ లైట్లు ఫ్యాన్లు లేవని గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఫర్నిచర్ ఇప్పించే బాధ్యత నాదని, సామాజిక బాధ్యతతో లైట్లు ఫ్యాన్లు మీరే ఇప్పించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

## మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా పోలీస్ శాఖ

ఎస్పి కాంతిలాల్ పాటిల్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** మరణించిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ స్పష్టం చేశారు. సిర్పూర్(యు)కు చెందిన కానిస్టేబుల్ మడవి ఆనంద్‌కుమార్ (నవంబర్ 4, 2024న) కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తూ, ఎస్పి కాంతిలాల్ పాటిల్ ఆనంద్‌కుమార్ సతీమణి గంగామణికి 8,00,000 (ఎనిమిది లక్షల రూపాయలు) విలువైన భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా, మరణించిన కానిస్టేబుల్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను ఎస్పి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయశంకర్ రెడ్డి, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, పోలీసు కార్యాలయ ఎఓ శ్రీనివాస్, ఖలీల్‌లు పాల్గొన్నారు.

## యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి...

సబ్ కలెక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం / బాన్సువాడ :** యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని యోగ ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవ వేడుకల్లో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులకు యోగపై యోగ శిక్షకులు శ్రీనివాస్ గౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగ సాధన వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని, యోగ శాస్త్రం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగినట్లయితే ప్రతి ఒక్కరి జీవితం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిత్య యోగాసన పద్ధతి చిత్రాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎల్‌పివో సత్యనారాయణ రెడ్డి, మునిసిపల్ కమిషన్ శ్రీహరి రాజు, ఎంపిడివో ముజాహిద్, ఆయా కార్యాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని 26వ మున్సిపల్ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దండే విఠల్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని పకడ్బందీగా అమలు చేస్తోందని అన్నారు. పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగిరి, మాజీ కౌన్సిలర్ ఎల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వచ్చిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తాం

కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాఫక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత వ్యవదిలో పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. గురువారం నిజాంపేట మండలం రామ్ రెడ్డి పేట గ్రామంలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోన్నారు. గత ప్రభుత్వం రైతులు సాగు చేస్తున్న ఆసైన్మెంట్ భూములను ఇతర భూములను నిషేదిత జాబితాలో పెట్టడం వల్ల రైతులు బ్యాంకు ఋణాలు పొందలేక ప్రభుత్వ సహాయం అందుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం వల్లనే రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గతంలో మాదిరి ఎక్కడో కూర్చుని రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఇక ఉండదన్నారు. ఎవరైనా వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ముందుగా సర్వే జరిపి నిర్ణీత మ్యాప్‌లో హద్దులు పేర్కొంటారని ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. గ్రామంలో ఉన్న అటవీ రెవెన్యూ వివాదంలో ఉన్న భూముల సమస్యలు పరిష్కరించాలని గ్రామంలో రోడ్డు సమస్యలను కూడా పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి చలపతిరావు ,నారాయణఖేడ్ ,ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి నిజాంపేట తహసీల్దార్ ఎంపిడిఓలు సంబందిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నదుల వద్ద ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రజలు వర్షాకాలంలో నదులు, చెరువుల వద్దకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తుందని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలోని నది పరివాహక ప్రాంతాల్లో భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య బుధవారం రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కందకుర్తి వద్ద గల త్రివేణి సంగమం నది పరివాహక ప్రదేశాలను సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. వర్షాకాలంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని నదులు, కాలువలు, ఇతర జలవనరుల వద్దకు ప్రజలు మొక్కులు చెల్లించుకోవడానికి పుణ్య స్నానాలు ఆచరించడానికి వస్తుంటారని కమీషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా కందకుర్తి త్రివేణి సంగమం ఘాట్‌కు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. స్నానాల కోసం నీటిలోకి వెళ్లినప్పుడు ఈత రాని వారు లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని కమీషనర్ అన్నారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్సై చంద్ర మోహన్ ఉన్నారు.

## ఆపత్కాల సమయంలో మేమున్నాం

మహిళా ప్రత్యేక బృందం టీం శివంగి..

విపత్కర పరిస్థితుల్లో ముందస్తు సన్నద్ధతగా: జిల్లా ఎస్పి జానకి షర్మిల.

**ప్రజాపక్షం/బైంసా :** జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మార్గదర్శనంలో, మహిళా పోలీసుల ప్రత్యేక బృందమైన టీం శివంగి వరద సహాయక చర్యల్లో తమ ప్రతిభను మరోసారి ప్రదర్శిస్తోంది.బాసర పరిధిలో ఇటీవల ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల భద్రత కోసం నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ముందస్తు చర్యలతో రెస్క్యూడ్రిల్‌ను చేపట్టింది.ఈ చర్యలు, ఇటువంటి ప్రమాదాలను ముందే గుర్తించి, సమర్థవంతంగా స్పందించేందుకు టీం శివంగి బృందాన్ని సిద్ధంగా ఉంచడం జరిగింది. టీం శివంగి. (ధా ఉమెన్ కమాండో ఫోర్స్ ఆఫ్ నిర్మల్)అనేది నిర్మల్ జిల్లా పోలీస్ విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటైన మహిళా కమాండో యూనిట్, ఈ బృందం బలంగా శిక్షణ పొందిన మహిళా సిబ్బందితో కూడి ఉండి, అత్యవసర పరిస్థితుల్లో, శాంతి భద్రతల నిర్వహణలో,సహాయక చర్యల సమయంలో ఆపరేషన్‌లో ముందుండే దళంగా గుర్తింపు పొందింది.

ఈ బృందం : భౌతిక ధైర్యం, మానసిక స్థైర్యంతో ప్రతి పరిస్థితిని ఎదుర్కొనగలగడం శిక్షణ పొందిన రక్షణ రెస్క్యూ పనుల ద్వారా ప్రజా పరిరక్షణ రెస్క్యూలో టీం శివంగి పాత్ర ఈరోజు నిర్వహించిన రెస్క్యూడ్రిల్ లో టీం శివంగి చాలా ఉత్సాహంగా పాల్గొంది .బాసర గోదావరి లోతైన నీటి ప్రాంతాల్లో రెస్క్యూప్రాక్టీస్ నిర్వహించారు. లైఫ్ జాకెట్లు, రోప్‌లు, బోట్ల వినియోగంలో చాకచక్యంగా వ్యవహరించారు.మహిళల పట్ల అత్యవసర సమయంలో ఎలా సహాయక చర్యలు తీసుకోవాలో ప్రదర్శించారు.బలమైన శారీరక నైపుణ్యాలతో పాటు,శీఘ్ర నిర్ణయాలను తీసుకునే సామర్థ్యాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్,ఇన్స్పెక్టర్ మల్లేష్, డిడిఆర్ఎఫ్ ఇంచార్జి ఆర్ఐ రమేష్,ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు,రెస్క్యూ టీమ్, నిర్మల్ మహిళా ప్రత్యేక బృందం టీం శివంగి పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కలెక్టర్ రాహుల్ రాజ్





**ప్రజాపక్షం/టేక్మాల్:** బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఆదర్శ గ్రామం టేగామం మండలం ఎల్లంపల్లి గ్రామం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించడంతోపాటు, గ్రామంలోని బడి ఈడు పిల్లలపై ఇంటింటా ఆరా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలు ఎవరైనా ఉన్నారా అనే విషయాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరిన విధానం బడిబాట స్ఫూర్తి దాయకంగా చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల పరిశీలించగా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందిస్తున్నారని ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లీష్ విద్యా బోధన జరుగుతుందని, చదవడం రాయడం, గణిత విద్యా బోధనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు సంబంధిత ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**గ్రామ రెవెన్యూ సదస్సులపై రైతులు అవగాహన పెంచుకోవాలి**

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు 90 పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలో ఎల్లంపల్లి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 3 నుండి 20వ తారీకు వరకు చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు సత్ఫలితాల దిశగా ముందుకు పోతున్నాయని రైతులు ఎవరు కూడా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా చర్యలు తీసుకుంటూ తాసిల్దార్ నేతృత్వంలో బృందాలు గ్రామ గ్రామానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు దగ్గర దరఖాస్తుల స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నారని, భూభారతి రెవెన్యూ సదస్సులో తీసుకున్న దరఖాస్తులు అతి త్వరలో పరిష్కారం అవుతాయని చెప్పారు.,రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే సంబంధిత వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని, ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, భూభారతి చట్టంలోని నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల వివరాలతో సరిపోల్చుకుని, క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం: కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**ఐదేళ్లు నిండిన వారిని పాఠశాలలో చేర్పించాలి:** రెవెన్యూ సదస్సు అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తుంపెల్లిలోని గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, విద్యా బోధనపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల కొరకు అన్ని వసతులు కల్పించడం జరిగిందని, 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలలలో చేర్పించాలని, బడి వయసు గల పిల్లలు పాఠశాల బయట కనపడకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రియాజ్ అలీ, విద్యా శాఖ అధికారి ఉదయ్ బాబు, నాయబ్ తహసిల్దార్ పోచయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రుచికరమైన భోజనం

**ప్రజాపక్షం/సారంగాపూర్:** విద్యార్థులకు రుచికరమైన,నాణ్యమైన భోజనం పెట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు.సారంగాపూర్ మండలం జాం ప్రభుత్వ పాఠశాలను అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్తో కలిసి గురువారం తనిఖీ చేశారు.విద్యార్థులకు పడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.క్లాస్ రూముల్లో విద్యా బోధనపై ఆరా తీశారు.

## ప్రజలకు గ్రామ రెవెన్యూ సదస్సులు భరోసా

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు గ్రామస్తులకు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎన్నో ఏళ్లుగా పరిష్కారాన్ని ఆశిస్తూ ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ప్రజలంతా గ్రామ రెవెన్యూ సదుస్సల్లో పాల్గొని తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు. కర్షల గుట్ట సర్వే నం. 582లో ఉన్న భూ సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సదస్సులో రైతులు సమర్పించిన ప్రతి దరఖాస్తుపై రసీదు ఇవ్వాలని, పూర్తి వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే సర్వేయర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, శుభ్రత పట్ల నిరంతర శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్, డీఈఓ రామారావు, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీ కాంత్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## భూ భారతిలో 'లైసెన్స్‌డ్ సర్వేయర్ల' పాత్ర ఎంతో కీలకం

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ తరగతులను తనిఖీ చేసిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అమలులో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం ఎంపికైన అభ్యర్థులకు అందిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వారిచే అందిస్తున్న సర్వే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు హితవు పలికారు. మానవ జీవితంలో ప్రతిఒక్కరికి భూములకు సంబంధించిన అంశం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎలాంటి తగాదాలు లేకుండా ఉండేందుకు గాను హద్దులను పక్కాగా నిర్ధారిస్తూ సర్వే మ్యాప్‌లను పాస్‌బుక్‌లలో పొందుపర్చాలనినిర్ణయించిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శిక్షణ సందర్భంగా నేర్పించే అంశాలను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు గెట్టు భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు తదితర అంశాలపై థియరీ క్లాసులతో పాటు క్షేత్రస్థాయిలో చెయిన్ సర్వే, మ్యాప్ రీడింగ్ వంటి వాటిలో అందిస్తున్న శిక్షణను చక్కగా నేర్చుకుంటే మంచి ఆదాయ వనరుతో పాటు చక్కటి గుర్తింపు పొందవచ్చని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జూలై 28, 29 లలో రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో నిర్ణీత మార్కులతో ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి అశోక్, సిబ్బంది ఉన్నారు.

## నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నిరుపేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ లు అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని 6వ, ఏడవ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గృహ నిర్మాణాలకు భూమి పూజ చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 10సంవత్సరాల కాలంలో ఒక్క గృహాన్నికూడా మంజూరు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి నిరుపేదకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడంతో పాటు ప్రొసీడింగ్ కాఫీ ఇస్తూ ఇండ్లకు భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల సహకారం కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి , మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్ శ్రీనివాస్ గౌడ్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ మండలాధ్యక్షులు మల్లేశం, వెల్దుర్తి మండల అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఎసిపి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/చెన్నూరు:** నకిలీ పత్తి విత్తనాలు అమ్మినా లేదా తరలించినా కఠిన చర్యలు తప్పవని జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మహారాష్ట్ర నుండి అక్రమంగా తరలిస్తున్న పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గూడ మనోహర్ రెడ్డి అనే వ్యక్తి, మహారాష్ట్ర నుండి జైపూర్ వైపు అక్రమంగా పత్తి విత్తనాలను తరలిస్తుండగా బుధవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. అమాయక రైతులకు నకిలీ పత్తి విత్తనాలను అమ్మి సొమ్ము చేసుకోవాలనే దురుద్దేశ్యంతో మనోహర్ రెడ్డి మహారాష్ట్రలోని సిరోంచ మండలం నుండి 1,46,000 (లక్షా నలభై ఆరు వేల రూపాయలు) విలువ గల 48.6 కిలోల పత్తి విత్తనాలను కారు ద్వారా తీసుకువస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేందర్ తన పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు సిఐ దేవేందర్ రావు, శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్ పాల్గొన్నారు.

## నరమేధానికి స్వస్తి పలకాలి

ఆపరేషన్ కగార్ నిలిపి శాంతి చర్చలు జరపాలి.. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి




**ప్రజాపక్షం/మంచిర్యాల:** ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను, మావోయిస్టులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వం విదానాలను మార్చుకోవాలని, నరమేధానికి స్వస్తి పలకాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూన్ 23న చేపట్టే ఛలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి గురువారం సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి మాట్లాడుతూ,ఒకవైపు ప్రజలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మావోయిస్టులు కేంద్రంతో చర్చలు జరుపుతామని, శాంతియుతంగా సమస్యను పరిష్కరిద్దామని, ఆయుధాల విషయాన్ని కూడా చర్చిద్దామంటూ అనేకసార్లు విజ్ఞప్తి చేశారని, లేఖలు రాశారని గుర్తు చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం మూర్ఖంగా మావోయిస్టులను, గిరిజనులను కాల్చి చంపే నరహంతక చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. చత్తీస్ గఢ్ అడవుల్లోని బొగ్గు, ఇనుము, సున్నపురాయి, డోలమైట్, బాక్సైట్ వంటి ఖనిజ సంపదనంతా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికే ఈ ఆపరేషన్ కగార్‌ను చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ దోపిడీని వ్యతిరేకిస్తున్న ఆదివాసీ సమాజానికి అండగా ఉన్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడం ద్వారానే పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడగలమన్న భావనతో మోడీ ప్రభుత్వం దేశ ప్రజలపై యుద్ధం చేస్తోందని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వ చేపట్టిన మారణహోమానికి అర్థవంతమైన పరిష్కారం వెతకాలనే ఉద్దేశంతో శాంతి చర్చలు జరపాలని ప్రజాస్వామికవాదులు ప్రతిపాదనను ముందుకు తెచ్చారని లింగం రవి తెలిపారు. దేశ వ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా యుద్ధ బీభత్సాన్ని సృష్టిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి మహేష్, పర్శ శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

## నిరుపేద క్యాన్సర్ కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందిస్తా

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**ప్రజాఫక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** తన నియోజకవర్గంలో నిరుపేద క్యాన్సర్ కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే రెండు కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున సాయం అందించిన విషయం కూడా విదితమే .తాజాగా గురువారం నియోజకవర్గంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్ బాదితుడు హరిప్రసాద్‌కు జగ్గారెడ్డి రూ. 10 లక్షలు అందించారు. తమ దయనీయ పరిస్థితి చూసి సాయం చేసిన జగ్గారెడ్డికి హరిప్రసాద్, కుటుంబ సభ్యులు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

## సుగుణాకర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :**టియు డబ్ల్యుజె పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా రెండవసారి ఎన్నికైన సాదుల సుగుణాకర్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ తన చిన్ననాటి స్నేహితుడు జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. పత్రికా రంగంలో విశిష్ట సేవలందిస్తూ ఉన్నత పదవులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మండల కిసాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పన్నాల, కుమార్ కిషోర్ అమీర్ షెట్టి తిరుపతిలో పాటు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ

**ప్రజాపక్షం/రామగుండం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో 402 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, 194 మంది లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ గురువారం పంపిణి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అంతర్గాం, పాలకుర్తి మండలాలు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతిమణి మనాలి ఠాకూర్, పెద్దపల్లి ఆర్‌డిఒ బి. గంగయ్య, అంతర్గాం తహసీల్దారు తూము రవీందర పటేల్, ఎంపిడిఒ బి.వేణుమాధవ్, మండల వ్యవసాయాధికారి కల్వల సతీష్‌కుమార్, సిడిపిఒ అలేఖ్య పటేల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, వైస్ చైర్మన్ మడ్డి తిరుపతిగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెంద్రు హన్మాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొన్నంను కలిసిన మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఇటీవలే రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మార్యదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ వికలాంగుల సంక్షేమశాఖ మంత్రిగా పదవీ చేపట్టిన సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం హైదరాబాద్‌లోని మంత్రి పొన్నం చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి ఒకరికొకరు పరస్పరం అభినందనలు తెలిపారు.



## బెస్ట్ అవైలబుల్ పాఠశాలగా ఎంపికైన నరేంద్ర విద్యాలయం




**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం లక్ష్మిదేవిపల్లిలోని నరేంద్ర విద్యాలయం హైస్కూల్ కరీంనగర్ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలగా ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం గంగాధర రాజేశం, గుజ్జుల గోపాల్ రెడ్డి తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరానికి షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు ఇదివరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 1వ తరగతిలో అడ్మిషన్ తీసుకోవడానికి నరేంద్ర విద్యాలయం పాఠశాల ఎంపిక చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యను అందించబడుతుందని తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ పాఠశాలగా అనుమతులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో బెస్ట్ అవైలెబుల్ పాఠశాలగా ఎంపికైనందుకు మండల విద్యాధికారి ప్రభాకర్ రావు పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి , దేశ భవిష్యత్ నాయకులు లోక్‌సభ ఫ్లోర్ లీడర్ రాహులగాంధీ జన్మదిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజులు వేడుకలను ఎమ్మెల్యేడా.సంజయ్‌కుమార్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్ ఆశాజ్యోతి రాహుల్‌గాంధీ త్యాగాల కుటుంబం నుండి వచ్చిన నాయకుడు ప్రధాన మంత్రి పదవిఅవకాశం వచ్చినా దేశం కోసం పార్టీ కోసం పనిచేస్తున్నార ని అన్నారు. దేశంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన ఘనత రాహుల్ గాంధీ నాయకత్వనిదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఆడువాల జ్యోతిలక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, తాజా మాజీ కౌన్సిలర్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్ :**దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే సత్తా బావి భారత ప్రధాని రాహుల్ గాంధీకే ఉంది అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు స్థానిక నాయకులతో కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ దేశాన్ని పాలించే సత్తా గాంధీ కుటుంబానికి చెందిన ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీకే ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని దేశ భద్రత విషయంలో జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ నుండి మొదలు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ప్రతిసారి రాజీ పడలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, పట్టణ అధ్యక్షుడు పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, డి. దామోదర్ రావు, కుమార్ కిషోర్, పన్నాల రాములు, బిరుదు కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గాంధీ కుటుంబ అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ బాల్స్‌తో దోమల నివారణ

### సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** వర్షాకాలం దృష్ట్యా మురికి గుంతల్లో నీటి నిలువ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా మున్సిపల్ పక్షాన దోమల నివారణకు చర్యలు చేపట్టామని జగిత్యాల మున్సిపల్ సానిటరీ ఇన్స్‌ఫెక్టార్ గంగిలి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికతో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని 4,8,10,13,30 వార్డుల్లో డ్రైనేజీలు శుభ్రం చేసి చెత్త చెదారం తొలగించడమే కాకుండా ఇండ్లలో నీటి నిలువలు ఉండకూడదని ప్రజలకు సూచించారు. నీటి నిలువ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా మున్సిపల్ సిబ్బంది ఆయిల్ బాల్స్ వేసి మందు పిచికారి చేశారని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, శ్రీకాంత్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష టిజిడబ్ల్యుఐడిసి, టిజిఎంఎస్‌ఐడిసి ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిజిడబ్ల్యుఐడిసి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జడ్పిహెచ్‌ఎస్ రామగుండం పాఠశాలకు రూ.40 లక్షలు సిఎస్‌ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. పాఠశాల అభివృద్ధి పనులకు వెంటనే ఎస్.ఎం.సి (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) తీర్మానాలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నందున సంబంధిత పనులు వారం రోజులలో ప్రారంభం కావాలని అన్నారు. టిజిఎంఎస్‌ఐడిసి చేపట్టిన పెద్దపల్లి ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి ఫస్ట్ ఫ్లోర్ మరమ్మత్తు పనులు పూర్తి చేసి ఆసుపత్రికి అప్పగించినట్లు సర్టిఫికెట్ సమర్పిస్తే సంబంధిత చెల్లింపులు పూర్తి చేస్తామని అన్నారు. జిజిహెచ్ గ్రౌండ్ ఫ్లోర్ నందు 98 లక్షలతో మరమ్మత్తు పనులు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రతిపాదనలు పక్కాగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మరమ్మతు పనుల పురోగతి వివరాలను తెలుసుకున్న కలెక్టర్ వాటిని సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పెద్దపల్లి ఆసుపత్రిని సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ అంటేనే ఉద్యమాలకు పోరాటాలకు నిలయం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** ప్రజా సంక్షేమం కార్మిక వర్గ శ్రేయస్సు కోసం ప్రజల సమస్యలను తెలుసుకొని పోరాటరూపాలను రూపొందించి ఉద్యమాలు చేపడతామని సిపిఐ నగర కార్యదర్శి కె కనకరాజ్ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లో జరిగిన సిపిఐ నాలుగో మహాసభకుముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్, నగర సహాయ కార్యదర్శి తాళ్ళ పెల్లి మల్లయ్యలతో కలిసి ఆయన మాట్లాడుతూ గాంధీనగర్‌లో ఉండే సీనియర్ నాయకులు మామిడి ఆగయ్య, మాదాసు బానయ్య , కుంట మదునయ్య, సప్పరీ ఓదెలు లాంటి సీనియర్ నేతలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు,ఉద్యమాలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ఈ ప్రాంతంలో పార్టీని మరింత విస్తరించి బలోపేతం చేయాలని ఆయన కోరారు. మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు మడికొండ ఓదెమ్మ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ప్రీతం తదితరులు మాట్లాడారు. గాంధీ నగర్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎజ్జ రాజయ్య, సహాయ కార్యదర్శిగా నూనె టి రామక్రిష్ణ, కోశాధికారిగా తాళ్ళపెల్లి శ్రీనివాస్ తోపాటు మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## జమ్మికుంట ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు అధ్యక్షతన ఎఐఎస్ఎఫ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోతే మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఐదు లక్షల భరోసా కార్డు, ఎలక్ట్రిక్ స్కూటీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యారంగంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు మోరె జగదీష్, దేగాదిష్, శ్రీకాంత్, రమేష్, బన్నీ, మని, భారత్, గణేష్, సందీప్ తదితరులున్నారు.

## రైతుల ఖాతాల్లో రూ. 99.5 కోట్ల రైతు భరోసా నిధులు జమ

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద మూడు రోజుల్లో రూ. 99.5 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాలపరిధిలోని 1,10,322 మందిరైతులబ్యాంక్‌ఖాతాల్లో రూ.99,52,19,906 డబ్బులు జమ అయ్యాయని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## కష్టపడి చదివితే భవిష్యత్ మీదే : కలెక్టర్ హైమవతి

### వైద్య సిబ్బంది గైర్హాజరుపై కలెక్టర్ అగ్రహం



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందిస్తున్నపుడు విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ కె హైమవతి ఉపాధ్యాయులను అదేశించారు. అలాగే ప్రభుత్వ అసుపత్రుల్లో సిబ్బంది గైర్హరుపై అగ్రహం వ్యక్తం చేస్తు ఈ లాంటి సంఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం బాగుందా విద్యాబోధన, పాఠశాలలో సౌకర్యాలు ఏలా ఉన్నయని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం మీకు అన్ని విధాల వసతులు కల్పించినప్పుడు మీరు ఈ లాంటి అవకాశాలను వినియోగించుకుని మంచిగా చదువుకుంటే మీకు ఉజ్వల భవిషత్తు ఉంటుందని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ అసుపత్రిని అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయుష్, క్లినిక్, ఐసిటిఎన్ సెంటర్‌లో ఎవ్వరు లేకపోవడంతో అగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ఎవరి వార్డుల్లో వారు ఉండాలని సమయపాలన పాటిస్తు ఉండాలని ఈలాంటి సంఘటనలు మల్లి మల్లి రావద్దని హెచ్చరించారు. ఈ సందరర్భగా కొందరు పేసెంట్లు మాకు బ్లడ్ బ్యాంకు కావాలని కొరగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పలు వార్డులను పరిశీలించి కాలం చెల్లిన మందులకు ఎప్పటికప్పుడు చూసుకోవాలని కోరారు. రాబోవు వానకాంలో అంటు వ్యాదులు రాకుండ తేలు, పాము కాటు లాంటి మందులను అందుబాటులో ఏర్పాటు చేసుకోవాలని , ముందు జాగ్రత్తగా వ్యాధి నిరోదక టీకాలను వేయించాలని సిబ్బందిని కోరారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, ఆర్‌డిఒ రాంమూర్తి, తహసీల్దార్ లక్ష్మ రెడ్డి, సూపరెండెంట్ రమేశరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజల అండ.. సిపిఐ జెండా

### మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ గోవర్ధన్



**ప్రజాపక్షం/ముత్తారం/పెద్దపల్లి ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో గురువారం మహాసభ సిహెచ్ బాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతం గోవర్ధన్ హాజరై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కమ్యూనిజాన్ని ఆదరిస్తున్నారని అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావడమే తార్కానమని వారన్నారు. డిసెంబర్ 26న సిపిఐ 100 సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్న సందర్భంగా వాడవాడనా, గ్రామ గ్రామాన వంద వసంతాల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 100 సంవత్సరాల చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని రైతులు కార్మికులు కర్షకులు విద్యార్థులు యువకులు మహిళలకు సంబంధించిన అనేక హక్కులు సాధించడంలో కమ్యూనిస్టు పార్టీ పోరాటం ఏనలేనిదని కొనియాడారు. యుపిఎ వన్ ప్రభుత్వంలో చేరడం ద్వారా ఉపాధి హామీ పథకంతో పాటు అనేక ప్రగతిశీల పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. ముత్తారం మండలంలో కూడా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన రావాల్సిన రేషన్ కార్డులపైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యే విధంగా మున్ముందు పోరాటాలను రూపొందిస్తామని తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యద ర్శి మార్కపురి సూర్య, అయిత లక్ష్మయ్య, గద్దె సమ్మయ్య, దేవునూరి రాజన్న, రైతు శంకర్ ,నార్మల్ సమ్మయ్య, కటకం నరసయ్య, గుమ్మడి సంపత్, మల్లన్న ,వెల్తురు సంతు ,సోమరపు మల్లన్న, కట్ల దేవేందర్ రెడ్డి, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

**ముత్తారం మండలం నూతన కమిటీ ఎన్నిక :**

ముత్తారం మండల కార్యదర్శిగా సిహెచ్ బాపురెడ్డి సహాయ కార్యదర్శిగా గద్దె సమ్మయ్య,కోశాధికారిగా దేవనూరి రాజన్న తో పాటు 13 మంది కౌన్సిల్ ,కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

# నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

### ఎస్‌పి మహేష్ బి. గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్షలు, జరిమానాలు తప్పవనీ జిల్లా ఎస్‌పిమహేష్ బి గితే హెచ్చరించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో త్వరగా పరిశోధన పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలి అని పెండింగ్ కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్‌ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు దించాలని, రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉంచాలని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయాలనీ అధికారులను ఆదేశించారు.

**నిందితులపై నాన్ బెయిలబుల్ వారెంట్లు పకడ్బందీగా జారీ చేయాలి..**

ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయడం వల్ల కేసు విచారణ విజయవంతంగా పూర్తి అయి సకాలంలో బాధితులకు న్యాయం జరుగుటకు ఆస్కారం వుంటుందిఅన్నారు.

**జిల్లా వ్యాప్తంగా ముమ్మర డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ తరుపున ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి శుక్రవారం రోజున సాయంత్రం 06 గంటల నుండి 08 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుదని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్షలు జరిమనలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ సమావేశంలో సి.ఐ లు కృష్ణ,మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామం స్టేజీ వద్ద వర్షాలు పడ్డప్పుడు వరద నీళ్లు షాపులకు, ఇండ్లకు వచ్చి చేరి ఇబ్బందులు పడుతున్నందున స్థానిక నాయకులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం కోసం రూ.20 లక్షలు సుడా నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, అభివృద్ధి సంక్షేమం రెండింటినీ సమదృష్టితో చూస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ముంపు వల్ల ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించినందుకు సుడా చైర్మన్ నరేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు బుర్ర హరీష్ గౌడ్, మాజీ సర్పంచ్ గాజుల అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, జగ్గని కనుకయ్య, బుర్ర గంగయ్య, గాజుల క్రాంతి, గాదె శివరామ్, బెజ్జంకి శేఖర్, అనుముల తిరుపతి, తదితరులున్నారు.

## ప్రిన్సిపాల్ బాధ్యతల మార్పు!

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఏకలవ్య గురుకుల ప్రిన్సిపాల్‌ను బాధ్యతల నుండి మార్పిడిచేస్తూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా మంజిత్‌ను తప్పించి మర్రిమడ్ల గురుకులం ప్రిన్సిపల్‌గా భాధ్యతలను స్వీకరించాలని ఆదేశాలు జారి చేసినట్లుగా చీఫ్ సెక్రటరి సీతా లక్ష్మి దృష్టికి వెల్లింది. ఔట్‌సోర్సింగ్ విదులు నిర్వహిస్తున్న వారిపై తన వైఖరి సరియైంది కాదని కార్మిక సంఘాలు మండిపడ్డారు. అంతే కాకుండా వారికి మద్దతుగా సిపిఐ, బిజెపి నాయకులు,బిఆర్ఎస్, గిరిజన సంఘాలు సిరియస్‌గా ఉన్నారు. ఆందోళనలు కాకుండా ఉండాలంటే ప్రిన్సిపల్‌ను తప్పించారని తాజా సమాచారం ప్రజాపక్షం దృష్టికి వచ్చింది. పలు సంఘాలు హర్షం చేశారు. ఔట్‌సోర్సింగ్ లో పనిచేస్తున్న వారిని విధులలోకి వెంటనే తీసుకోవాలని పలు సంఘాలు డిమాండ్ చేయడంతో ఆందోళన విరమించుకున్నారు.

## మహిళలు, పిల్లల రక్షణే 'షీటీమ్స్' ప్రథమకర్తవ్యం

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** షీటీమ్, భరోసా, స్నేహిత సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో షీటీమ్స్, భరోసా సిబ్బందితో మహిళలు, పిల్లల రక్షణ గు రించితీసుకుంటున్న చర్యలు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా సిపి అనురాధ మాట్లాడుతూ ఈవ్ టిజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు, యవతులు. మహిళల రక్షణే మన ప్రథమకర్తవ్యమన్నారు. ఎప్పుడు ఏ సమయంలో ఫోన్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. ప్రజలకు, విద్యార్థిని, విద్యార్థులకు నూతన చట్టాల గురించి అవగాహన కల్పించి క్రైమ్ రేట్ తగ్గించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పిల్లల తో వారికి అర్తమయ్యే భాషలో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకోవాలన్నా రు. మహిళలను. పిల్లలను కావాలని ఏవరైన వేధింపులకు గురిచేస్తే మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఒక్కసారి జీవితంలో తప్పటడుగు వేస్తే జీవితం మొత్తం నాశనమవుతుందన్నారు. ర్యాగింగ్ చట్టాల గురించి విద్యార్థినీ, విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు అధికారులు, సంబధిత డిపార్టుమెంట్, సిబ్బందితో కలసి చై ల్డ్ లేబర్ ఎక్కడ ఉన్న గుర్తించాలని సూచించారు. షీటీమ్ సిబ్బంది తమ స హా యం కోరే వచ్చే మహిళలు. పిల్లల పట్ల గోప్యత పాటించాలన్నారు. షీటిమ్స్ కు మరింత సిబ్బందిని కేటాయించాలన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రజల రక్షణకు,పోలీసులకు ఇంకేమైన చర్యలు తీసుకోవాలా అని అడిగి తెలుసుకోవాలన్నారు. వాట్సాప్, పెస్‌బుక్, ఇన్స్టగ్రామ్. యూట్యూబ్ రీల్స్ తదితర సోషల్ మీడియాకు చూడకుండ తల్లిదండ్రులకు బాధ్యత వహించాలన్నారు. ఏవైన సంఘటన జరుగకుండ ముందే కౌన్సిలింగ్ ఇవ్వటం మంచి పరిణామమన్నారు. ఈవ్ టీజింగ్ జరిగే హాట్సాప్ వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

# క్రీడ

## రోహిత్ కాదు.. కోహ్లీ రిటైర్మెంట్ వల్లే టీమిండియాకు నష్టం

**ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జెఫ్రీ బాయ్‌కాట్ ఆసక్తికర వ్యాఖ్య**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్‌పై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జెఫ్రీ బాయ్‌కాట్‌ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మానసికంగా అలసిపోవడంతోనే కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించాడని ఓ దినపత్రికకు రాసిన కాలమ్‌లో పేర్కొన్నాడు. కోహ్లీ రిటైర్మెంట్ టీమిండియాకు కోలుకోని దెబ్బ అని అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ కూడా రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ.. కోహ్లీ గైర్హాజరే టీమిండియా కు నష్టం చేస్తుందని అభిప్రాయపడ్డాడు. కోహ్లీ గైర్హాజరీ ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండి యా విజయవకాశాలను ప్రభావితం చేస్తుందన్నా డు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవ్వడం టీమిండియా విజయవకాశాలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో కోహ్లీ లేకుండా ఆడటం టీమిండియా సవాలే. ఎందుకంటే కోహ్లీ మూడు ఫార్మాట్లలో అ త్యుత్తమ బ్యాటర్. గత కొన్నేళ్లుగా భారత్ తీరికలే ని క్రికెట్ ఆడుతోంది. దాంతో విరాట్ కోహ్లీకి తగినంత విశ్రాంతి లేకుండా పోయింది. దాంతో అతను మానసికంగా అలసిపోయాడు. ఎంత ప్రతి భ, అనుభవం ఉన్నా.. మానసిక ప్రశాంతత లే కుంటే త్వరగా అలసిపోతారు. కోహ్లీ విషయంలో ఇదే జరిగింది. రోహిత్ గొప్ప బ్యాటర్ అయినప్పటికీ అతని టెస్ట్ రికార్డ్ అంత గొప్పగా ఏం లేదు. పైగా అతను కొన్నేళ్లుగా నిలకడలేమి ప్రదర్శన కనబరుస్తున్నాడు. అందుకే రోహిత్ రిటైర్మెంట్ భారత జట్టుకు పెద్దగా నష్టం చేయకపోయినా..కోహ్లీ రిటైర్మెంట్ టీమిండియాపై తీవ్ర ప్రభావం చూపనుం ది.'అని బాయ్‌కాట్ తన కాలమ్‌లో రాసుకొచ్చా డు. బాయ్‌కాట్ చెప్పినట్లుగా గత కొన్నేళ్లుగా టీ మిండియా తీరిక లేని క్రికెట్ ఆడుతోంది. బ్రాడ్‌కాస్టర్స్, ప్రకటనదారుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో టీమిండియా ఎక్కువ మ్యాచ్‌లు ఆడుతోం ది. ఏడాదిలో 910 నెలలు అంతర్జాతీయ క్రికెట్ ఆడుతుండగా.. మరో రెండు నెలలు ఐపిఎల్ ఆడుతున్నారు. కోహ్లీ.. కొన్ని సిరీస్‌లకు దూరంగా ఉ న్నా.. 8 నెలల పాటు క్రికెట్ ఆడేవాడు. ముఖ్యం గా టెస్ట్ సిరీస్‌లు, ఐసిసి టోర్నీలు, ఐపిఎల్ వంటి వాటిని ఖచ్చితంగా ఆడేవాడు. ఈ క్రమంలోనే వి రాట్ కోహ్లీ ఆట గాడి తప్పింది. వరుస వైఫల్యాలతో అతను తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. చివరకు ఆట నుంచి తప్పుకున్నాడు.



## నెట్స్‌లో కరుణ్ నాయర్‌కు గాయం!

ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కరుణ్ నాయర్ నెట్స్‌లో గాయపడినట్లు తెలుస్తోంది. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రసిద్ధ కృష్ణ వేసిన బంతిని అంచనా వేయడంలో కరుణ్ విఫలమయ్యాడు. దీంతో ఆ బంతి అతడి పక్కటెముకలకు బలంగాతాకింది. దీంతో కాసేపటివరకు అతడు ఇబ్బందిపడ్డాడు. కానీ తర్వాత మరోసారి బ్యాటింగ్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. టీమిండియాకే కాకుండా, కరుణ్ నాయర్‌కు ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ ఎంతో కీలకం. కరుణ్ చివరిసారిగా భారత్ తరపున 2017లో టెస్ట్ మ్యాచ్ ఆడాడు. దేశవాళీల్లో అద్భుతంగా రాణించి సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి టీమ్ ఇండియాకు పునరాగమనం చేస్తున్నాడు. అతడికి కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం కూడా ఉంది. 2023, 2024 కౌంటీ ఛాంపియన్షిప్ సీజన్లలో నార్తాంప్టన్ షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్ 736 పరుగులు చేశాడు. ఇందులో చిరస్మరణీయమైన ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. అలాగే 2024–25 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహించిన అతడు 16 ఇన్నింగ్స్ ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్లో ఏకంగా 779 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 202425లో (టీ20) ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు.



## పటౌడీ ట్రోఫీ పేరు మార్పులో.. నా ప్రమేయం లేదు : సచిన్




ఇంగ్లాండ్ వర్సెస్ ఇండియా మధ్య జరిగే పటౌడీ ట్రోఫీని అండర్సన్ టెండూల్కర్‌గా పేరు మార్చడంపై తీవ్ర దుమారం రేగుతోంది. పటౌ డీ పేరును ఎందుకు తొలగించారని మాజీ క్రికెటర్ల కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్‌లు ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఇది సరికాదని అ భిప్రాయ పడ్డారు. ఈ వివాదాంపై తాజాగా సచిన్ టెండూల్కర్ స్పందిం చారు. ఇంగ్లాండ్‌తో తొలి టెస్ట్‌కు ఒక రోజు ముందు సచిన్ తన అభిప్రా యాన్ని వెల్లడించారు. ఈ పేరు మార్పు విషయంలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఇసిబి, బిసిసిఐ కలిసి తీసుకున్న నిర్ణయమని తెలిపారు. 'పటౌడీ ట్రోఫీ పేరు మార్పు నిర్ణయంలో నా ప్రమేయం లేదు. బిసిసిఐ, ఇసిబి కలిసి తీసుకున్న నిర్ణయం. ఆ తర్వాతే నాకు సమాచారం ఇచ్చారు. పటౌడీ కుటుంబం భారత క్రికెట్‌కు చేసిన కృషిని నేను గౌరవిస్తాను. పటౌడీ వారసత్వాన్ని సజీవంగా ఉంచాలి. అందుకోసం నేను చేయగలి గినదంతా చేశాను. ఈ వివాదం తలెత్తిన తర్వాత నేను పటౌడీ కుటుంబం తో మాట్లాడాను. ఐసిసి చైర్మెన్ జైషాతో పాటు బిసిసిఐ, ఇసిబి అధికారు లతో చర్చలు జరిపాను. పటౌడీ వారసత్వాన్ని కొనసాగించడానికి ఏదో ఒకటి చేయాలని వారికి సూచించాను. ఈ చర్చల తర్వాత పటౌడీ పేరును ఈ సిరీస్‌తో ఉండేలా.. విజేత కెప్టెన్‌ను పటౌడీ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అందజేయాలని నిర్ణయించారు. నేను ఎప్పుడూ సీనియర్ ఆటగాళ్లను గౌరవిస్తాను.'అని సచిన్ టెండూల్కర్ చెప్పుకొచ్చారు.

# వ్యవసాయం

## ఆహార భద్రతపై దృష్టి..

ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న ఆహార కొరతపై ఐక్యరాజ్య సమితి దృష్టి సారించింది. 1983లో నెలకొల్పిన ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ద్వారా మొక్కల జన్యు వనరులు (పిజిఆర్) అభివృద్ధి, పరిరక్షణకు చర్యలు చేపడుతున్నది. జన్యు వనరులకు సంబంధించిన విషయాలపై ప్రత్యేకంగా చర్చించడానికి, నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వాలకు ఇది ప్రాథమిక శాశ్వత అంతర్జాతీయ వేదికగా మారింది. ఎఫ్ఎఒ కాలక్రమేణ వివిధ దేశాలకు విస్తరించింది. ఇప్పుడు అది ప్రపంచ పునరుత్పాదక ఇంధన సంస్థ (జిఆర్ఎఫ్ఎ)తో కలిసి పని చేస్తున్నది. అందులోని అన్ని రంగాలతోనూ ఎఫ్ఎఒ తనవంతు పాత్ర పోషిస్తున్నది. మొక్క, జంతువు, అటవీ, జలచర, సూక్ష్మ జీవులు, అకశేరుకాల జన్యు వనరులు, ఆహారం, వ్యవసాయం కోసం జీవవైవిధ్య విస్తారమైన పరిధిని జిఆర్ఎఫ్ఎ కవర్ చేస్తుంది. దానితోపాటు ఎఫ్ఎఒ కూడా తన పరిధిని విస్తరించుకుంటున్నది. ఆహార భద్రత, పోషకాహారం, మానవ ఆరోగ్యం, వాతావరణ మార్పు ల సేకరణ, అనుసరణ , జన్యు వనరులు, ప్రయోజనాల భాగస్వామ్యం వంటి పలు ప్రధాన అంశాలపై పరిశోధనలు, ప్రయోగాలు నిర్వహిస్తున్నది. జిఆర్ఎఫ్ఎ వర్గీకరణ, స్థిరమైన ఉపయోగం, పరిరక్షణ, బయోటెక్నాజీలపై డిజిటల్ సీక్వెల్ సమాచారం వంటి అనేక అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నది. ఎఫ్ఎఒలో భారత్‌సహా 179 సభ్యదేశాలు ఉన్నాయి. ఆహా రం, వ్యవసాయం కోసం మొక్కల జన్యు వనరులపై అంతర్జాతీయ ఒప్పందం కుదరడంతో ఎఫ్ఎఒ ప్రధాన భూమిక పోషించింది. ప్రపంచాన్ని పోషించే పంటల వైవిధ్యానికి రైతుల అపారమైన సహకారాన్ని యావత్ ప్రపంచం గుర్తించడానికి కృషి చేసింది. రైతులు, మొక్కల పెంపకందారులు, శాస్త్రవేత్తలకు మొక్కల జన్యు పదార్థాలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రపంచవ్యాప్త వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి ప్రధాన లక్ష్యాలతో ఇది పని చేస్తున్నది. స్థూలంగా చె ప్పాలంటే, మొక్కల్లో జన్యుపరమైన మార్పులతో ఆహార ఉత్పత్తులను గణనీయంగా పెంచ డం, భవిష్యత్తులో ఆహార కొరత లేకుండా చూడడం లక్ష్యం గా ఎఫ్ఎఒ పని చేస్తున్నది.






## వేడిని తట్టుకునే కంది

స్పీడ్ బ్రీడింగ్ టెక్నిక్ ఉపయోగించి ఐసిపివి 25444 అనే వేడిని తట్టుకునే కంది (తుర్ దాల్) రకాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ రకమైన కంది మొక్క 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలను తట్టుకోగలుగుతుంది. ఇది భారతదేశంలోని వేడి, పాక్షిక శుష్క ప్రాంతాలకు అనువైనది. నీటి కొరత, వేడి కారణంగా ఖరీఫ్ తర్వాత సాగు చేయని 12 మిలియన్ హెక్టార్ల వరి బీడులను ఉపయోగించుకోవడానికి ఈ వంగడం ద్వారా సాధ్యమవుతుంది. అంతేగాక, ఈ రకం సంవత్సరానికి నాలుగు పంటలనిస్తుంది. అభివృద్ధి సమయాన్ని 15 నుండి 5 సంవత్సరాలకు తగ్గిస్తుంది. దిగుబడిని 1.1–1.2 నుండి 2 టన్నులు/హెక్టారుకు రెట్టింపు చేస్తుంది. పంట సమయాన్ని సాధారణ 6–7 నుండి 4 నెలలకు పరిమితం చేస్తుంది. దేశీయ ఉత్పత్తిలో 1.5 మిలియన్ టన్నుల లోటును తగ్గించడం ద్వారా, సంవత్సరానికి 800 మిలియన్ డాలర్లు ఖర్చయ్యే భారతదేశ కంది దిగుమతులను ఇది గణనీయంగా తగ్గించగలదు. పప్పు ధాన్యాల గురించి: భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పప్పు ధాన్యాల ఉత్పత్తిదారు మాత్రమేగాక, వినియోగదారుకూడా. అందుకు కందిపప్పు దిగుమతులు కూడా ఎక్కువే. కాగా, దిగుమతులను 2028 నాటికి పూర్తిగా నిలిపివేసే రీతిలో ఈ కొత్త కంది వంగడాన్ని సృష్టించారు. ఇలావుంటే, పప్పు ధాన్యాలు ఉత్పత్తి చేసే మొదటి రాష్ట్రాలుగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ పేరు సంపాదించాయి. కందిపప్పు మన దేశంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఒక ముఖ్యమైన పప్పుదినుసు. ఇది ఉష్ణమండల, పాక్షిక శుష్క ప్రాంతాలలో బాగా పెరుగుతుంది. భవిష్యత్తులో ఈ రకం కందిపప్పు భారత మార్కెట్లను ముంచెత్తుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావంతో ఉన్నారు.

## ప్రత్యక్ష వ్యవసాయ మార్కెటింగ్..



ఇటీవల కాలంలో పెరుగుతున్న కొత్త ఒరవడిగా ప్రత్యక్ష వ్యవసాయ మార్కెటింగ్‌ను చెప్పుకోవచ్చు. మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు, ప్రాసెసింగ్ కంపెనీలకు లేదా రిటైలర్లకు విక్రయించే విధానం. ఇది సంప్రదాయ వ్యవసాయ మార్కెటింగ్ పద్ధతిలో ఉండే బహుళ మధ్యవర్తులను తొలగించి, రైతుకు నేరుగా ఆదాయాన్ని పెంచే మార్గంగా పనిచేస్తుంది. ఈ విధానంలో రైతు తన ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాడు. ఉదాహరణకు, రైతు బజార్లు, నేరుగా ఇంటి వద్ద సరఫరా, ఆన్‌లైన్ వేదికలు, కాంట్రాక్టు సాగు వంటి వాటిని ఉపయోగించి రైతు తాను పండించిన ఉత్పత్తిని తానే అమ్ముతాడు. ప్రత్యేక్ష వ్యవసాయ మార్కెటింగ్ ద్వారా రైతుకు నేరుగా ఎక్కువ ఆదాయం లభిస్తుంది. మధ్యవర్తులు లేకపోవడం వల్ల అమ్మకాల్లో ధోరణుల గురించి స్పష్టత పెరుగుతుంది. రైతులు మార్కెట్ అవసరాలను అర్థం చేసుకొని దానికి తగ్గట్టు పంటలు పండించేందుకు ప్రేరణ పొందుతారు. ఇలాంటి మార్కెటింగ్ వల్ల వినియోగదారుడికి కూడా లాభం కలుగుతుంది. వారు నేరుగా రైతు నుంచి తాజా ఉత్పత్తులు పొందవచ్చు. సాధారణంగా ధరలు తక్కువగా ఉంటాయి, మరియు నాణ్యతపై విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. అయితే, ప్రత్యేక్ష మార్కెటింగ్‌లో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. రైతులకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడం, నిల్వ వసతుల కొరత, మార్కెట్ పరిజ్ఞానం లోపించడం, డిజిటల్ సాంకేతికతపై అవగాహన లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ రకమైన మార్కెటింగ్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. రైతు బజార్లు స్థాపించడం, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలు ఏర్పరచడం, ఇఎన్ఎఎం (ఇనామ్) వంటి ఆన్‌లైన్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లను అందించడం తదితర చర్యలు అవసరం. మొత్తానికి, ప్రత్యేక్ష వ్యవసాయ మార్కెటింగ్ ఒక సమర్థవంతమైన విధానం. ఇది రైతుల ఆదాయాన్ని పెంచే మార్గంగా మాత్రమేగాక, కాకుండా వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కూడా దోహదపడుతుంది.

## రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ తక్షణమే అమలు చేయాలి

సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్ని తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్ని ఇతర సాకుల పేరుతో దాటి వేయకుండా వందశాతం అమలుచేయాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా పేరుతో రైతులకు పెద్ద ఎత్తున ఆదుకుంటున్నామని చెబుతుందని కాని మూడువిడుతలుగా రైతుభరోసా పూర్తిస్థాయిలో రైతులకు అందడంలేదని వివిధ కారణాల చేత ప్రభుత్వం రైతు భరోసా రైతులందరికి ఇవ్వడంలేదని ఆయన విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడంలో చిత్తశుద్ధి వహించడం లేదన్నారు. నేడు రాష్ట్రంలో రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతుంటే వారిని ఆదుకోవాల్సినటువంటి ఈపరిస్థితుల్లో రైతురుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగితే రైతు సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పెబ్బేటి విజయుడు, సిపిఐరాష్ట్రసమితి సభ్యులు హెచ్.ఆనంద్, సిపిఐరాష్ట్ర సమితిసభ్యులు ఎస్ఎండి ఫయాజ్, వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, టి.నర్సింహ్మా, ఆర్.ఇంద్ర, కొమ్ముభరత్, పరుషరాం, సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చే సంఘం ఎఐటియుసి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే సంఘం ఎప్పటికైనా ఎఐటియుసి మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మందమర్రిలోని కెకె 5 గనిపై జరిగిన సమావేశానికి గని ఇంచార్జ్ కంది శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ గాండ్ల సంపత్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ, గుర్తింపు సంఘం ఎన్నికలలో ఇచ్చిన హామీలైన కార్మికుల సొంతింటి కల, ఆదాయంపై ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు గురించి సి అండ్ ఎండితో చర్చించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. విధివిధానాలపై అధ్యయనం చేస్తామని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అలాగే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి విన్నవించగా, ఆయన స్పందించి ఈ హామీలు అమలయ్యేలా కృషి చేస్తామని చెప్పినట్లు సీతారామయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సెక్యూరిటీ అక్బర్ అలీ, బ్రాంచ్ సెక్రటరీలు శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్, అసిస్టెం ట్ సెక్రటరీ రాజేశం, ఏరియా నాయకులు పి. బాలయ్య, సివి. రమణ, ఇ. రాజేశ్వర్ రావు, శర్మ, కలవల శ్రీనివాస్, మైన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మతోన్మాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజం

ప్రకృతిసంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారు : బాగం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** బిజెపి దాని అనుబంధ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అవలంభిస్తున్న మతోన్మాదానికి కమ్యూనిజం మాత్రమే ప్రత్యామ్నాయం అవుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. కొణిజర్లలో గురువారం దొండపాటిభవన్‌లో తోటపల్లి సీతారాములు, చింతల ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామశాఖ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో పేద ధనిక తేడాలేకుండా ఎంతో బాధ్యతతో సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ మోదీ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆయన విమర్శించారు. భారత దేశ ప్రజలు కష్టంతో దేశంలో అనేక సంవత్సరాలుగా నిర్మించబడిన ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఎల్ఐసి, రైల్వే, విమాన విశాఖ ఉక్కు లాంటి లాభాల్లో నడిచే దిగ్గజ సంస్థలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టాలని చూస్తున్నారని అటువంటి చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా దేశంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు బిజెపి ప్రభుత్వం దోచిపెడుతుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతున్నారని నక్సలైట్లు కూడా భారతదేశ పౌరులేనని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలు జరుపుతామన్న బిజెపి ప్రభుత్వం నక్సలైట్లుతో చర్చలు జరపకుండా చంపేయడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో సిపిఐ ప్రజాప్రతినిధులు గెలిపించుకుని బలం పెంచుకుంటేనే పేదప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అందుకు తగిన విధంగా ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. 2004లో పార్లమెంట్‌లో కమ్యూనిస్టు ఎంపిల బలం ఉండటంవల్లనే ఉపాధి హామి, అటవీహక్కుల, సమాచార హక్కు చట్టాలు తీసుకురావడం సాధ్యపడిందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మర్చిందని అన్నారు. పేదవాడికి ఇండ్లు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంవల్లే నిరుపేద కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు బండారు పుల్లయ్య, బండారు వెంకన్న, కడప బాబు, కోయిన్న వెంకయ్య, గొడ్డుగొర్ల రాంబాబు, గొడ్డుగొర్ల శ్రీను, కాల్వకట్ల ప్రసాద్, తండు సోమయ్య, నరసింహారావు, బొమ్మకంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొణిజర్ల గ్రామశాఖ క్యాదర్శిగా స్వర్ణ రమేష్; సహాయ కార్యదర్శిగా తోటపల్లి సీతారాములు, చింతల ఆదినారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంతో ప్రపంచానికి పెనుముప్పు

యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల నిరసన, ధర్నా

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు మాట్లాడుతూ గత 20 నెలలుగా పాలస్తీనా గాజాపై, పది రోజులుగా ఇరాన్ పై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధ దౌర్జన్య ఖాండను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాలస్తీనా యుద్ధంలో 50వేల మంది మరణించారని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా మొత్తం సర్వనాశనం అయ్యిందని లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు, బందీలుగా చిక్కి కనీస అవసరాలు లేక బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. విద్యా వైద్య రంగాలు నాశనం అయ్యాయని వ్యవసాయ పారిశ్రామిక రంగాలు పూర్తిగా దెబ్బతినాయని అన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు ప్రధాన కారణం అమెరికా సామ్రాజ్యవాద అధిపత్యం కోసం ఆయుధాల వ్యాపార విస్తరణ కోసం సహజ వనరుల కోసం అమెరికా చేస్తున్న నియంతృత్వ విధానాలను ప్రపంచం మొత్తం ఖండించాలని అన్నారు. సామ్రాజ్యవాద దేశాలు చేసే ప్రపంచ యుద్ధాల వల్ల శాంతి కనుమరుగవుతుందని ఆకలి దారిద్రం పెరిగి సంపద మరింత కేంద్రీకృతం అవుతుందన్నారు. ప్రపంచ యుద్ధాల పెరుగుదల వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా పెట్రోల్ డీజిల్ ఆహార వస్తువుల ఎగుమతి దిగుమతులపై ప్రభావం చూపి భారతదేశము కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నర్సింహ తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ సంకర ప్రభాకర్ సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎల్కూర్, రంగన్న, ఆశన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు మాట్లాడారు ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కాశిం, ప్రజా ఫ్రంట్ నాగన్న, ఏఐటీయూసీ బైర్ రిక్షా కార్మికులు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

### హనుమకొండలో....

పాలస్తీనా, ఇరాన్ ప్రజలపై సామ్రాజ్యవాద అమెరికా మద్ధతుతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణ హోమాన్ని, దాడులను ఆపి శాంతిని నెలకొల్పాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు రాగుల రమేష్, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఆర్.ఎస్.పి జిల్లా నాయకులు కౌడగాని శివాజీలు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఆర్.ఎస్.పీ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా, ఇరాన్ దేశాలపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని నిరసన ధర్నా చేపట్టాయి. ఈ నిరసన ధర్నాకు సిపి ఐ నాయకులు తోట బిక్షపతి, సిపిఐ(ఎం) నాయకులు వెంకట్‌ల అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు రాగుల రమేష్, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు దయాకర్, ఆర్.ఎస్.పీ జిల్లా నాయకులు శివాజీలు పాల్గొని మాట్లాడారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండ సదాలక్ష్మి , ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, లక్ష్మ ణ్, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్‌లో...

ఇరాన్ పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురహంకార దాడులను ఖండించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఎంసిపిఐ(యు) జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సిపిఎం జిల్లా నాయకులు వల్లదాస్ దుర్గయ్యలు డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా ఇరాన్ దేశంపై అమెరికా సామ్రాజ్యవాద దత్తపుత్రుడు ఇజ్రాయిల్ చేస్తున్న దురహంకార దాడులకు నిరసిస్తూ రాష్ట్ర వామపక్ష పార్టీ పిలుపు మేరకు చేపట్టే నిరసన కార్యక్రమాలలో భాగంగా గురువారం వరంగల్ అండర్ బ్రిడ్జి బస్టాండ్ సెంటర్లో ఆ పార్టీల నాయకులు కార్యకర్తలు ధర్నా చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కార్యదర్శి అక్కినపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ అర్బన్

ప్రపంచంలో పేదరికం, దారిద్రం, నిరుద్యోగం పెరుగుతుంటే వాటిని తగ్గించటానికి ప్రయత్నం చేయకుండా అమెరికా తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ వాతావరణాన్ని పెంచి పోషిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం అమెరికా సామ్రాజ్యవాదం యొక్క అండతో ఇజ్రాయిల్ ఇరాన్‌పై చేస్తున్నదాడులను ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం దర్నా చౌక్‌లో అమెరికా ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేస్‌బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి సుధాకర్‌తో పాటు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, నాయకులు సుజాత, విఘ్నేష్, సిపిఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గద్వాల జిల్లా కేంద్రంలో...


హనుమకొండలో....


వరంగల్‌లో...


నిజామాబాద్‌లో..



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డ్రైన్ పనులను ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. గురువారం ఖమ్మం నగరంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు ఐటి హబ్ వద్ద , అల్లిపురం రోడ్డులో నిర్మాణంలో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైన్ నిర్మాణానికి ఉపయోగిస్తున్న మెటీరియల్, నాణ్యత, డిజైన్ తదితర వాటిని అధికారులు కమిషనర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్ నిర్మాణ పనులు క్రమబద్ధంగా సాగాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్మాణ ప్రాంతంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఆళ్లపల్లిలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పాయం పర్యటన



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**నేడు ఆళ్లపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పినపాక ఎంఎల్ఎ పాయం వెంకటేశ్వర్లు పర్యటించనున్నారని ఆళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ కో ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీ కాంత్ అన్నారు. శుక్రవారం ఉదయం 9గంటలకు మండల కేంద్రంలో గల కస్తూరిభా హాస్టల్ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని తె లిపారు. ఉదయం 9:30 గంటలకు ఇందిరమ్మ లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, కావున మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు,వివిధ సంఘాల నాయకులు అభిమానులు అందరూ స కాలంలోస్వచ్ఛందంగాహాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నా రు.

## దివ్యాంగుల ఉపకరణాల ఆన్‌లైన్ తేదీ పొడిగింపు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఆన్‌లైన్ ప్రక్రియ తేదీని ఈనెల 27వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమశాఖాధికారి స్వర్ణలత లెనినా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లు, మొబైల్ బిజినె బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో హైబ్రీడీ వీల్ చైర్ లాప్టాప్స్, 5జి స్మార్ట్ ఫోన్, ట్రై సైకిల్ వీల్ చైర్లు, వినికిడియంత్రాలు అందిస్తారని చెప్పారు. హెచ్‌టిటిపిఎస్ః//టిజిఓబిఎంఎంఎస్.సిజిజి.జిఓవి.ఇన్ లో ఆన్లైన్ దరఖాస్తులు చేసుకుని ఆ దరఖాస్తు ప్రతులను 27వ తేది లోగా ఐడిఓసి జి1 లో గల జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 6301981960,8331006010 నెంబర్లను సంప్రదించ వచ్చన్నారు.

## 'సికిల్ సెల్' అనీమియాపై అవగాహన




**ప్రజాపక్షం/మధిర రూరల్ :**జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మండల పరిధిలోని దెందుకూరు పిహెచ్‌సి పరిధిలో వైద్యులు డాక్టర్ సాయి పృధ్వీరాజ్ ఆధ్వర్యంలో గురువారం సికిల్ సెల్ అనిమియాపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ పృధ్వీరాజ్, సిహెచ్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్ 19 నుండి జూలై 3 వరకు సికిల్ సెల్ అనిమియాపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ట్రైబల్ జనాభా నివసించే ప్రాంతంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, దీర్ఘకాలిక రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్న వారు వెంటనే ప్రభుత్వ వైద్యుల వద్దకు వెళ్లాలని, పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది లంకా కొండయ్య, ఎఎన్ఎం రత్నమాల, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## గ్రామీణ ప్రాంతంలో పెట్రోల్ బంక్ నెలకొల్పటం అభినందనీయం

ఎమ్మెల్యే జారెఆదినారాయణ



**ప్రజాపక్షం/ములకలపల్లి:**గ్రామీణ ప్రాంతంలో పెట్రోల్ బంక్ నెలకొల్పటం అభినందనీయమని ఎంఎల్ఎ జారే ఆదినారాయణ అన్నారు. గురువారం జగన్నాధపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పి పెట్రోల్ బంక్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పెట్రోల్ బంక్ ద్వారా జగన్నాధపురం, పరిసర గ్రామాల ప్రజలకు సులభంగా పెట్రోల్ డీజిల్ అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు వాహనదారులకు నాణ్యమైన ఇంధనాన్ని సరఫరా చేసి వారి మన్ననలు పొందాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలి: ఎంఇఓ




**ప్రజాపక్షం/ బోనకల్:** ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఓ దామాల పుల్లయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బోనకల్ జెడ్పిఎస్ఎస్ హైస్కూల్ నందు ప్రైవేట్ పాఠశాలలు వద్దు, ప్రభుత్వ పాఠశాలలు మద్దు అనే నినాదంపై కళాకారులు చాపలమడుగు కోటేశ్వరరావు, బంక భద్రయ్య బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా విద్య, మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్స్, పాఠ్య, నోట్ పుస్తకాలు తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పించటం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయబృదం తదితరరులు పాల్గొన్నారు.

## వాగు మల్లారంలో రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/మణుగూరు:**పట్టణ పరిధిలోని వాగు మల్లారంలో ఒక ఇంటిలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లై డిటి తెలిపిన వివరాల ప్రకారం.. వాగు మల్లారం చెందిన వెంకట్ చౌదరి ఇంట్లో పిడిఎఫ్ నిల్వ చేశారని సమాచారంతో అతని ఇంట్లో తనిఖీ చేయగా 30 బస్తాల పిడిఎఫ్ దొరికిందని ఈ బియ్యాన్ని కేసు నమోదు చేసినట్టుగా ఆయన తెలిపారు.

# శృతిమించిన విద్యా దోపిడీ


చోద్యం చూస్తున్న అధికారులు
నిబంధనలకు తూట్లు - డొనేషన్ల వసూళ్లు
నైట్ డ్రెస్‌లు అక్కడే కొనాలట!
హార్వెస్ట్‌పై చర్యలు : ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం :** మారిన, మారుతున్న ఆలోచనలు కొందరికి వరంగా మారుతున్నాయి. ప్రభుత్వ బడి వద్దు ప్రైవేటు ముద్దు అన్న ఆలోచన ప్రైవేటు విద్యా సంస్థల శృతిలేని దోపిడీకి తెరలేపింది. తమ దగ్గర కాకపోతే ఇంకెక్కడ చేర్పిస్తారు అన్న భావన అహంభావాన్ని తెర లేపడంతో పాటు ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందిలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.నిబంధనలకు పాతరేసి రక రకాలుగా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నా, అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నా విద్యాశాఖ కళ్లు ఉండి చూడలేని కబోదిలా మారింది. జిల్లా యంత్రాంగం ప్రైవేటు విద్యాలయాలకు ముఖ్యంగా కొన్నింటికి దాసోహం అంటున్నారు. గోడౌన్స్ ఏర్పాటు చేసి పుస్తకాల పేరుతో బట్టలు, బూట్లు వ్యాపారం చేస్తున్నాయి. నైట్ డ్రెస్‌లు మా వద్ద కొనుగోలు చేస్తేనే అన్నట్లుగా వ్యవహరిస్తున్నా ఆ వైపు చూసినా అధికారి లేడు. శృతిమించిన విద్యా దోపిడీని నిలువరించేదెవరు...? సమాజంలోని మార్పులను వ్యవస్థీకృతం చేసి రాజ్యాంగ పరిధిలోకి తీసుకు రావాల్సి ఉంది. విద్యకు సంబంధించి 20 శాతానికి లోబడి మాత్రమే ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్నప్పుడు 80 శాతం మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల ఏర్పాటు, నిర్వహణ, ఫీజులు, బోధన సిబ్బంది, మౌలిక వసతులు తదితర విషయాలకు నిబంధనలు రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. నేడు విద్యా సంస్థ ఏర్పాటు అది అండ పిండ బ్రహ్మాండమంటూ ప్రచారం చేస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. రెండు, మూడు తరగతులకే లక్షల రూపాయల ఫీజు, రూ. 10వేల డొనేషన్ అని ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇక యూనిఫాం, పుస్తకాలు, షూ ధరలు దేశంలోనే ఆ ధరలు ఎక్కడ ఉండవు. ఈ విషయం అధికార యంత్రాంగానికి తెలియంది కాదు. గోడౌన్స్ ఏర్పాటు చేసి కౌంటర్లు పెట్టి ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారం నిర్వహిస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలు బేఖాతర్ చేస్తూ విద్యా సంస్థల్లో ఎటువంటి సౌకర్యాలు ఉండవు. బహుళ అంతస్తుల భవనాల్లో రక్షణ లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తున్నా మీ ఇష్టం మాకు ఫిర్యాదు రాకుండా చూసుకోండి అంటున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఏ ప్రాంతంలో పాఠశాల నిర్వహణకు అనుమతి తీసుకున్నారు, ఎక్కడ నిర్వహిస్తున్నారు, ఎన్ని బ్రాంచీలు ఉన్నాయి అన్న దానిపై పట్టింపు లేదు. విద్యాశాఖ ప్రైవేటు విద్యా సంస్థలకు దాసోహం అంటే జిల్లా ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నట్లు...? రక్షణ లేని బహుళ అంతస్తుల భవనాల్లో ప్రమాదం జరిగితే చిన్నారుల పరిస్థితి ఏమిటి...? ఇప్పుడు కాకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకుంటారా అన్న ప్రశ్నకు సమాధానమే లేదు. విద్యాశాఖ నుండి అనుమతి తీసుకునేటప్పుడు విద్యాశాఖకు సమర్పించిన ధృవపత్రాలకు, విద్యా సంస్థల్లో ఉన్న పరిస్థితులకు పొందిక ఉందా అంటే అనుమానమే. అయినా ఎవరు మాట్లాడారు.

### ఫీజులపై నియంత్రణ ఉండదా...?

ప్రైవేటు విద్యా సంస్థలు కొన్ని సేవాభిలాషతో ఏర్పాటు చేసి ఉండవచ్చు. అందుకు అనుగుణంగానే పాఠశాల సేవాభావంతోనే నిర్వహిస్తుండవచ్చు. కానీ ధనార్జనే ధ్యేయంగా విద్యా సంస్థలను లాభసాటి కేంద్రాలుగా మార్చే విద్యా సంస్థలపై తప్పక చర్యలు తీసుకోవాలి. ఫీజుకు హద్దు లేకపోతే ఎలా అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. పిల్లలను చదివించాలంటే ఆస్తులు అమ్మక తప్పనిసరి పరిస్థితులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటులో చదివించాలన్న అభిలాషను సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లాది రూపాయల వ్యాపారం సాగుతున్న పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం చేష్టలూడిగి చూస్తుండడం విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది.




### హార్వెస్ట్‌పై చర్యలు తీసుకోండి :

అడ్డు అదుపు లేకుండా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న హార్వెస్ట్ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. హార్వెస్ట్ విద్యా సంస్థలపై చ ర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం అదనపు క లెక్టర్ పి. శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. గోడౌన్లు ఏర్పాటు చేసి పుస్తకాలు, దుస్తులు, బూ ట్లు, ఇతరత్రా సామాగ్రి అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అదనపు కలెక్టర్ దృష్టికి తీసు కు వచ్చారు. హార్వెస్ట్‌లో ఇష్టానుసారంగా ఫీజులతో పాటు డోనేషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరణకు వినతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధికారి సామినేని సత్యనారాయణకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణ, మండల కేంద్రంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ ప్రధాన అధికారి సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగాఎఐటియుసి నాయకులు జిల్లా అధికారిని కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర, కొరగా మెనూ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్నం భోజన కార్మికులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం 2023 అక్టోబర్ 2 నుండి సిఎం పోషకాహార పథకాన్ని అమలు చేసిందని దానికి ఇప్పటివరకు దానికి సంబంధించిన బడ్జెట్ విడుదల కాలేదని, దీంతో చాలా మంది వంట కార్మికులు వేలాది రూపాయలు నష్టపోయారని, తక్షణమే వారికి పెండింగ్‌లో ఉన్నటువంటిసిఎం పోషకాహార పథకాన్ని, రావాల్సిన నిధులను విడుదల చేయాలని నిమ్మటూరి కోరారు. అలాగే గత సంవత్సరం రావాల్సిన కోడిగుడ్ల బిల్లులు, 9, 10 తరగతుల మెనూ చార్జీలు తక్షణమే ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 1 నుంచి 8 తరగతి వరకు మెనూ చార్జీలను తక్షణమే ఇవ్వాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వంట పాత్రలు మంజూరయ్యాయని చెప్పారని, ఇప్పటి వరకు ఈ జిల్లాలో వంట పాత్రలు అందజేయలేదని, తక్షణమే వంట పాత్రలు, గ్యాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెరగారపు రామారావు, మధ్యాహ్నం భోజనం కార్మికులు కర్లపూడి లక్ష్మి , తెలగారపు కనకదుర్గ, నిమ్మటూరి కృష్ణవేణి, వల్లెపు కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యను అందించాలి

ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి/కొత్తగూడెం:** ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు విలువతో కూడిన విద్యను అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలోని న్యూగొల్లగూడెం కిడ్స్ పాఠశాలలో గురువారం 8వ తరగతిని కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపార దృక్పదంతో కాకుండా తమ విద్యా చక్కటి విద్యను చెప్పే దేవాలయాలుగా ఉండాలన్నారు. పట్టణంలోని కిడ్స్ పార్క్ పాఠశాల మెరుగైన విద్యను అందించి విద్యార్థుల భావి తరానికి బాటలు వేయాలన్నారు. ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణంలో స్థాపించిన ఈ పాఠశాల పేద విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం విద్యార్థులు పలు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, దుర్గ, నేరేళ్ల రమేష్, ముత్యాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె




**ప్రజాపక్షం/సుజాతనగర్:**జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనిఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అమరజీవి కుమారి రామయ్య మెమోరీ హాల్లో ఏర్పాటు చేసిన ఎఐటియుసి సమావేశం కుమారి హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా 12 గంటల పని దినాలను ఎనిమిది గంటలు సవరించుకున్న చరిత్ర ఎఐటియుసిపోరాట ఫలితమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం జులై 9న జరిగే సమ్మెకు మేల్కొని లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగాజరిగే సమ్మెకు అన్ని రంగాల కార్మికులు కర్షకులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రాములు, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీర్ల దుర్గాప్రసాద్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు
ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న కట్టడాలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. గురువారం ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు నేతృత్వంలో సిఐలు, ఎస్ఐలు బృందాలుగా ఏర్పాడి తొలగింపులు చేపట్టారు. కమన్‌బజార్, కస్బాబజార్, పాతబస్టాండ్ ప్రాతాల్లోని ఫుట్‌పాత్‌లను చిరు, బడావ్యాపారులు ఆక్రమణలకు పాల్పడి వారివారి వ్యాపారాలకు సంబంధించిన వస్తువులను, స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రహదారులకు ఇరువైపులా వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్‌లు చేయడంతో ఆయా మార్గాల్లో సంచరించే వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటుండంతో వారి ఫిర్యాదు మేరకు అక్రమ కట్టడాలను తొలగిస్తున్నట్లు ఎసిపి తెలిపారు. ఇందులో భాగంగా పాతబస్టాండ్ నుంచి కస్బాబజార్, కమాన్ బజారు వరకూ సుమారు కిలోమీటరు మేర ఫుట్‌పాత్‌లపై అక్రమించి ఏర్పాటు చేసిన చిరువ్యాపారులకు ముందస్తు సమాచారం ఇచ్చి తొలగించినట్లు తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే నోటీసులు ఇచ్చి కేసునమోదు చేస్తామని సంబంధిత యజమానులు, సముదాయాల నిర్వహకులను సూచించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు విధించడం జరుగుందని హెచ్చరించారు. పాదాచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసువారికి సహకరించాలని అయన కోరారు.

## వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతు భరోసా

కూసుమంచి మండల పర్యటనలో
మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కూసుమంచి:**గత మూడు నాలుగు రోజుల నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతూ వస్తున్నాయని, రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతు భరోసా ఇస్తామని మరో రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా నర్సింహుల గూడెం, పూరియా తండా, చింతల తండాలో బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పోచారంలో అంతర్గత సీసీ రోడ్లకు, కూసుమంచిలో అంతర్గత సీసీ రోడ్లకు, బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా కూసుమంచి మండల కేంద్రంలో మంజూరైన జూనియర్ ప్రభుత్వ కళాశాల స్థలాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో గతపాలకుల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని అన్నారు. 200 యూనిట్ల వరకు పేదలకు ఉచిత గృహ విద్యుత్ సరఫరా, రూ. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ పథకం పరిమితి రూ.10 లక్షలకు పెంపు, గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంపు, సన్న వడ్లకు క్వింటాల్ రూ. 500 రూపాయల బోనస్, గడిచిన ఉగాది నుండి రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతులకు పెట్టుబడి క్రింద రూ.10 వేల రూపాయలు అందిస్తే, ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 12 వేల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన భారీ అప్పులను చెల్లిస్తూ పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని, అర్హులందరికీ దశల వారీగా తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు అందుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ పాఠశాల ప్రవేశాలకు పకడ్బందీగా పోటీలు :సిఎంఓ




**ప్రజాపక్షం/నేలకొండ-పల్లి:**ప్రభుత్వ ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సిఎంఓ, ఫిట్ ఇండియా జిల్లా నోడల్ అధికారి రాజశేఖర్ తెలిపారు నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డి పాలెం, నేలకొండపల్లి లోని పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సింగారెడ్డి పాలెం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు విద్యార్థులను కంప్యూటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వికలాంగుల పునరావాస కేంద్రంలో సందర్శించారు. అనంతరం విలేకరులతో మా ట్లాడుతూ జిల్లాలోని రాజేశ్వర పుర ం గ్రామంలో ఉన్న భవిత కేంద్రం ను, నేలకొండపల్లిలోని వికలాంగుల పునరావాస కేంద్రంలో విలీ నం చేసినట్లు ప్రకటించారు.జిల్లాలోవికాసం కేంద్రంగా పైలెట్ ప్రా జెక్టుగా నెలకొండపల్లిని ఎంపిక చే సినట్లు తెలిపారు. వారికి అవసరమైన ఫిజియోతెరపి, వివిధ పరీక్షలు నిర్వహించి వారిలో చైతన్యం కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో నెల 21 వరకు మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ పాఠశాల ప్రవేశాలకు సంబంధించిన పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 22వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎం పిక చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన పుస్తకాలు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. నేలకొండపల్లి ప్రకాశం కేంద్రంలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర అధికారులకు నివేదికను అందించినట్లు తెలిపారు. నేలకొండపల్లి మండల విద్యాశాఖ అధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కూనూరు పాఠశాలలో 'స్పోర్ట్స్ డే'



ప్రజాపక్షం/జఫర్‌గడ్:ఆచార్య జయశంకర్ బడిబాటలో గురువారం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూనూరు నందు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ డేను నిర్వహించారు. హెచ్‌ఎం మహ్మద్ పర్వాజ్ మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వల్లనే విద్యార్థులు ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ సాధిస్తారని, చదువుతోపాటు క్రీడలలో రాణించాలన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉపాధ్యాయులు రామమూర్తి, స్టాఫ్ సెక్రటరీ కాసర్ల రమేష్ బాబు, ఫిజికల్ డైరక్టర్ సాయికుమార్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలి : కడియం శ్రీహరి



ప్రజాపక్షం/వేలేరు : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లబ్ధిదారులకు వెంట వెంటనే బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు.వేలేరు మండలం శాలపల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. కొన్ని ఇళ్లకు సాంకేతిక సమస్యల కారణంగా బిల్లులు రావడం లేదని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హౌజింగ్ డి ఇ సిద్దార్థ నాయక్,ఎం ఆర్ ఒ హెచ్ కోమి,ఎంపిడిఒ లక్ష్మి ప్రసన్న,ఎ ఇ సుష్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తి సంపత్, మల్లికార్జున్, బిల్లా యాదగిరి, రాజిరెడ్డి, రామ్ గోపాల్ రెడ్డి,రవీందర్ యాదవ్, అశోక్, సంపత్,సద్దాం హుస్సేన్, విద్యుత్ శాఖ అధికారులు డి ఇ సంపత్ రావ్, ఎ డి ఇ రాజేశ్వర్ రావ్,ఎ ఇ కుమార స్వామి, శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై వినతి



ప్రజాపక్షం/ఖానాపూర్‌:ఖానాపురం మండలంలోని వేపచెట్టు తండా గ్రామ పంచాయతీ గ్రామ అభివృద్ధిపై, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విషయాల గురించి గ్రామానికి కాంగ్రెస్ నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఎంఎల్‌ను కలిసిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు గుగులోతు రాజు నాయక్, మూడు దేవేందర్, బానోత్ వెంకన్న, గుగులోతు శ్రీను, దేవు యాకూబ్, రవి తదితరులు కలిసారు.

## నేడు డయల్ యువర్ 'ఆర్‌టిసి డిఎం'

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః ములుగు జిల్లా పరిధిలో శుక్రవారం జరిగే డయల్ యువర్ డిఎం టిజిఆర్‌టిసి డయల్ యువర్ ఆర్‌టిసి కార్యక్రమం నేడే దిగ్విజయం చేయాలని వరంగల్ 2 డిపో ఆర్‌టిసి డిఎం వి జ్యోత్స్న కోరారు. మధ్యాహ్నం 12 నుండి 1 గంటల వరకు టిజిఆర్‌టిసి వరంగల్ 2 డిపో నందు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిధిలోని ప్రయాణికులు 995 9226048ఫోన్ చేసి తమ సమస్యలను టిజిఆర్‌టిసి, వరంగల్ 2 డిపో డిఎంకు సలహాలు సూచనలు సమస్యలు తెలియజేయాలని డిపో మేనేజర్ వి జ్యోత్స్న తెలిపారు.

## విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేత




ప్రజాపక్షం / నల్లబెల్లి : ప్రభుత్వ విద్యపై ప్రజలకు నమ్మకం కల్పించేందుకు ఉపాధ్యాయుల తోడ్పాటు అందించేందుకు ముందుకు రావాడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు . వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని గిరిజన గ్రామమైన కొండాపూర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కందగట్ల నాగరాజ్ ,బానోతు కృష్ణ సొంత ఖర్చులతో 5వేల విలువ చేసే నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి గ్రామంలోని హన్‌మాన్ భక్త స్వాములు రెండుసిలింగ్‌ఫ్యాన్‌లను అందించారు.ఉపాధ్యాయులను పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షుడు నకిరెడ్డి మహేంధర్ అభినందించారు. మేడేపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు కృష్ణ మూర్తి,ప్రదానోపాధ్యాయులు కైలాసం ,ఉపాధ్యాయులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు .

## మైనారిటీల సంక్షేమానికి కృషి



ప్రజాపక్షం/పాలకుర్తి : కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తుందనిఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. వక్ఫ్‌బోర్డు పథకం ద్వారా మంజూరైన నిధులతో మండలంలోని గూడూరులోని మసీదు ప్రహరీ గోడకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, దేవేందర్, ఆది నారాయణ, మహేందర్ రెడ్డి, పుల్లయ్య, సలీం, అబ్బాస్, అలీ, శంషుద్దీన్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.


## డిపిఒ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/తరిగొప్పుల: డిపిఒ స్వరూపరాణి గ్రామ పంచాయితిలో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పల్లె ప్రగతి యాప్ ఇన్స్‌ఫెక్షన్‌లో భాగంగా గ్రామ పంచాయితి రికార్డు వెరిఫికేషన్ చేసేవి అన్ని రిజిస్టర్స్ సక్రమంగా నిర్వహించాలని, బిల్డింగ్ పర్మిషన్స్ ఏ విధంగా ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. లే ఔట్ వెంచర్లలో ఏమన్నా లే ఔట్ పర్మిషన్ ఎవరైనా దరఖాస్తు చేసుకున్నారా లే ఔట్ వెంచర్ చేస్తే వాళ్లు పర్మిషన్ తీసుకోకపోతే నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని పంచాయితి కార్యదర్శిని మందలించారు.


## రైతులందరికీ 'రైతుబంధు' ఇవ్వాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ బిక్షపతి




ప్రజాపక్షం/తొర్రూరు : రైతులందరి కి రైతుబంధు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ బిక్షపతి అన్నారు. సిపిఐ తొర్రూరు పట్టణ మహాసభ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బంధు మహేందర్ నూతన కమిటీని ప్రకటించారు.వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులను గెలిపించి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 22న జరగనున్న మండల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తొర్రూరు పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, సహాయ కార్యదర్శులుగా పసుల యాకయ్య ప్రకటించారు. మండల సహాయ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఎం.చంద్రయ్య, సైరెడ్డి నర్సింహారెడ్డి, బిక్షపతి, వెంకన్న, దేవేందర్, కుమార్, కృష్ణ, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 'రైతు భరోసా'తో రైతుల్లో ఆనందం



### వరంగల్ జిల్లాలో 1,41,727 మంది రైతుల ఖాతాల్లో రూ.119 కోట్ల 42లక్షలు జమ

### –జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ..

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసానిధుల విడుదలతో వెల్లడైంది. 2025 వానాకాలం లో సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో, చాలామంది రైతులు ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు.సాగుకు ముందు పెట్టుబడి సాయంగా నిధులు అందడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సాగులో జాప్యం కాకుండా సకాలంలోసహాయంఅందించడంఅభినందనీయమని రైతులుపేర్కొన్నారు. రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభు త్వంకొనసాగిస్తున్నచర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో 2025 సంవత్సరం వానాకాలం సీజన్‌కు గానూ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడం సోమవారం నుంచి ప్రారంభించింది. ఎకరానికి సంవత్సరంకు రూ.12 వేల చొప్పున వానాకాలం 2025 సీజన్‌కు రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటివరకు జూన్19వ తేదీ ఉదయం 10 గంటలవరకు 1,41,727 మంది రైతుల ఖాతాల్లో రూ.119 కోట్ల 42 లక్షల నిధులు జమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. వానాకాలం 2025 రైతు భరోసా నిధుల పంపిణీపై మండలాల వారీగా వివరాలు జూన్ 19 ఉదయం 10గంటలవరకు జిల్లాలో వానాకాలం 2025 కు సంబంధించిన రైతు భరోసా నిధుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోంది. మొత్తం 13 మండలాల నుంచి 1,65,184మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్దిపొందేందుకు అర్హులుగా గుర్తించబడ్డారు. ఇందు కోసం 166 కోట్ల 45లక్ష రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోగా, అందులో 148 కోట్ల 65 లక్షల 11వేల 141 రూపాయలు ఖజానాద్వారాపంపిణీకి సంబంధించి నమోదయ్యారు. కాగా ఇప్పటి వరకు 1,41,727 మంది రైతులకు 119 కోట్ల 42 లక్షల రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయి. రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని, వ్యవసాయ అధికారులు, బ్యాంకర్ల సమన్వయంతో ఈ పంపిణీ సమర్థవంతంగా కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. చెన్నారావుపేట మండలంలో 10,286 మంది రైతులకు రూ. 8 కోట్ల 81 లక్షలు, దుగ్గొండి మండలంలో 13,491 మంది రైతులకు రూ.10 కోట్ల 81 లక్షల, ఖానాపూర్ మండలంలో 8072 మంది రైతులకు రూ.7 కోట్ల 2 లక్షలు, నల్లబెల్లి మండలంలో 12,213 మంది రైతులకు రూ. 10 కోట్ల 68 లక్షలు, నర్సంపేట మండలంలో 11,275 మంది రైతులకు రూ.8 కోట్ల 16 లక్షలు, నెక్కొండ మండలంలో 13,538 మంది రైతులకు రూ.11 కోట్ల 85 లక్షలు, గీసుగొండ మండలంలో 11,850 మంది రైతులకు రూ. 9 కోట్ల 58 లక్షలు, ఖిలా వరంగల్ మండలంలో 4355 మంది రైతులకు రూ. 2 కోట్ల 81 లక్షలు, పర్వతగిరి మండలంలో 12,487 మంది రైతులకు రూ.11 కోట్ల 6 లక్షలు, రాయపర్తి మండలంలో 16,644 మంది రైతులకు రూ.15 కోట్ల61 లక్షలు, సంగెం మండలంలో 13,562 మంది రైతులకు రూ.11 కోట్ల 49 లక్షలు, వరంగల్ మండలంలో 1565 మంది రైతులకు 1 కోట్ల 41 10 లక్షలు, వర్ధన్నపేట మండలంలో 12,049 మంది రైతులకు రూ.10 కోట్ల 43 లక్షలు, రైతు భరోసా నిధులు వారి ఖాతాలలో జమ కావడం జరిగిందన్నారు. ప్రారంభంలోనే పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేసిన ఈ నగదును విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు వాడుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేంద్రంతో పోరాడి బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధిద్దాం

### బయ్యారం ఉక్కు పరిశ్రమ ఉద్యమం కేసులో కోర్టుకు..

### ఎమ్మెల్యేతో సహా వామపక్ష, కాంగ్రెస్ నాయకులు




ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి: విభజన చట్టం హామీ అమలుపర్చడంలో బిజెపి, టిఆర్ఎస్ విఫలమయ్యాయని, మరోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మెడలు వంచైనా బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. నాడు బిఆర్ఎస్, బిజెపి వైఫల్యంతో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకై చేసిన ఉద్యమ పోరాటంలో భాగంగా గురువారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్‌మురళీనాయక్‌తో సహా వామపక్షల నేతలు బి.విజయసారథి,గౌనిఐలయ్యతదితరులు కోర్టుకు హాజరయ్యారు. మురళీనాయక్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కోసం బయ్యారం ఉక్కుపరిశ్రమ స్థాపించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత10ఏళ్ళు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ అడగలే, బిజెపి ఇవ్వలే అనే చందంగా రెండుపార్టీలుసహకరించుకుంటూ నిర్లక్ష్యం చేశాయన్నారు. సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ బిజెపి, టిఆర్ఎస్ విభజన హామీ బయ్యారం ఉక్కుపరిశ్రమ స్థాపించకపోగా ఈ ప్రాంత ప్రజల పక్షాన ఉపాధి కోసం బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మించాలని ఆందోళన చేస్తే పరిశ్రమ స్థాపించకుండా అక్రమంగా కేసులు పెట్టి నిర్బంధాలకు గురి చేశారన్నారు. ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసి ప్రజాప్రభుత్వం ఏర్పాటైందని ఆ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. కోర్టుకు హాజరైన వారిలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, సాధుల శ్రీనివాస్, ఆకుల రాజు, దస్రునాయక్, పెరుగు కుమార్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, శంతన్‌రామరాజు, గునిగంటిరాజన్న, సమ్మెట రాజమౌళి, మాధవి,బానోత్‌ప్రసాద్, లక్ష్మి నారాయణ, పోతరాజు వీరన్న,సిరిపురం వీర్న, గుంజె హన్మంతు, హేమానాయక్, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ



ప్రజాపక్షం/హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని పలు ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం పరిశీలించారు. ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్ జిల్లా కలెక్టరేట్ లోని పరిపాలన విభాగం, డీ, ఇ సెక్షన్లతోపాటు ఎలక్షన్ సెల్, మినీ కాన్ఫరెన్స్ హాల్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, చైల్డ్ కేర్ సెంటర్, రికార్డు రూమ్, ఎన్ఐసి, వీడియో కాన్ఫరెన్స్ హాల్ ను జిల్లా కలెక్టర్ సందర్శించి అధికారులను కలెక్టర్ పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, కలెక్టరేట్ ఏవో గౌరీ శంకర్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నైపుణ్యం సాధిస్తేనే.. వృత్తిలో రాణింపు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : పోలీస్ అధికారులు అప్పగించిన పనుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యం సాధించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. యూనిట్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ప్రారంభించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రేట్ పరిధిలో వరంగల్ కమిషనరేట్ చెందిన సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్లతో పాటు ఇతర పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొంటున్న డ్యూటీ మీట్ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో రెండు రోజుల పాటు నిర్వహించబడుతాయి. ఈ డ్యూటీ మీట్ లో పోలీస్ అధికారులు నిరంతరం నిర్వహించే విధులకు సంబంధించి అధికారులు, సిబ్బందికి డ్యూటీ మీట్ ద్వారా తమ ప్రతిభ కనబర్చడం జరుగుతుంది. ఇందులో భాగంగా కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్,హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటో, వీడియో గ్రఫీ విభాగాల్లో పోటీలను నిర్విహించబడుతాయి. ఈ పోటీల్లో విభాగాల వారిగా రాణించిన వారిని జోనల్ స్థాయిలో నిర్వహించబడే పోలీస్ డ్యూటీ మీట్ ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో నిర్వహింబడుతుంది.ఈ పోటీలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాట్లాతుడుతూ పోలీస్ అధికారులు వృత్తినైపుణ్యం సాధించడం ద్వారా, నేరస్థులను త్వరితగతిన గుర్తించడంతో పాటు, ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్ అదనపు డిసిపి రవి, సురేష్ కుమార్, ప్రభాకర్ రావు, బోనాల కిషన్ తో పాటు, జోనల్‌కు చెందిన ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ ఇచ్చారు... నిధులు మరిచారు!

### గత ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే మురళీనాయక్ ఫైర్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతి–నిధి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఇచ్చి దానికి నిధులు ఇవ్వడం మరిచారని గత ప్రభుత్వ బిఆర్ఎస్‌పై మండిపడుతూ మెడికల్ విద్యార్థుల సమస్యలకు త్వరలోనే పరిష్కరిస్తాననని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ హామీ ఇచ్చారు. గురువారం మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం మెడికల్ కాలేజీలు ప్రకటించారని నిధులు ఇవ్వలేదన్నారు. దీంతో కాలేజీ విద్యార్థులు అరకొర వసతుల నడుమ సరిగా చదవలేకపోతున్నారని పలువురు విద్యార్థులు తన దృష్టికి తీసుకువచ్చినట్లుఎమ్మెల్యే తెలిపారు. మెడికల్ కాలేజీ అభివృద్ధికి సిఎంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు.

### 23న మహబూబాబాద్‌కు మంత్రి పొంగులేటి రాక

ఈనెల 23న రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహబూబాబాద్‌కు రానున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ తెలిపారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు

ప్రజాపక్షం/హనుమకొండటౌన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.60వ డివిజన్ వడ్డేపల్లి, 58వ డివిజన్ ఎస్సీ కాలనీ, 57వ డివిజన్ సమ్మయ్యనగర్ కాలనీలో లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి, పనులను ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, రాష్ట్రంలో చాలా చోట్ల ఇందిర్మ కాలనీలు ఉంటాయని గుర్తు చేశారు.పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 3500 ఇళ్లకు గాను ప్రతి ఒక్క ఇల్లు నిజమైన అర్హులకు కేటాయించామని తెలిపారు. ఇల్లు అనేది ఒక వ్యక్తికి ఆశ్రయం మాత్రమే కాదు అని, అది గౌరవం, భద్రత, స్వాతంత్ర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ప్రతి పేద కుటుంబానికి ఇంటి కలను సాకారం చేయడమే తమ ధ్యేయం అని తెలిపారు.మొత్తం మూడు డివిజన్లలో ప్రారంభించిన ఇండ్ల నిర్మాణ పనులు వందలాది కుటుంబాలకు ఆశ కలిగించాయని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ కళ్లలో ఆనందంతో ఎమ్మెల్యేను ప్రత్యేకంగా సన్మానించారు.అంతకు ముందు 60 వ డివిజన్ వడ్డేపల్లి కాలనీలో రూ.5 లక్షలతో కల్వర్ట్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాపక్షం/మహాదేవపూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ చూపాలని కాటారం డిఎస్పీ సూర్యనారాయణ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని పోలీస్టేషన్‌లో పాత్రికేయులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద గోదావరి నదిలో యువకులు చనిపోవడం దురదృష్టకరమని ఈ సందర్భంగా వారికి సంతాపం తెలియజేసారు.ఇకపై ఆ ప్రాంతంలో సూచన,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని అన్నారు.రాబోవు వర్షాకాలంలో నదీ ప్రవాహం తీవ్రంగా ఉంటుందని గోదావరిలోకి వెళ్లవద్దని అన్నారు.జాలర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మండల పరిధిలో ఆవులు,గేదెలను రోడ్లపై వదిలిపెట్టరాదని పశువులు రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు.


## ప్రజల భాగస్వామ్యంతో క్షయరహిత 'వరంగల్'గా మారుద్దాం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు




ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి: ప్రజల భాగస్వామ్యంతో క్షయరహిత జిల్లాగా మార్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివ రావు అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో పిల్లల్లో క్షయ వ్యాధి నివారణ గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ డివిజన్,మండల స్థాయిల్లో పిల్లల్లో క్షయను గుర్తించడంపై అవగాహన మరియు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తో క్షయ రహిత జిల్లాగా మార్చుదామన్నారు. క్షయ వ్యాధి ఒక అంటు వ్యాధి, దీని ప్రివలెన్స్ రేట్ రోజురోజుకు అధికమవుతున్నది, ప్రజలంతా క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహాయంతో పరీక్షలు నిర్వహించుకోని తగిన చికిత్సలు తీసుకోవాలని కోరారు. పెద్దలకు వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే త్వరగా గుర్తిస్తామని, కానీ చిన్నపిల్లలలో వ్యాధి లక్షణాలను గుర్తించడంలో కొంత ఆలస్యం జరగడం వలన చాలామంది పిల్లలు క్షయ వ్యాధితో మరణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య, క్షయ వ్యాధి నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆచార్య , జిల్లా విద్యాశాఖదికారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అర్చన, డాక్టర్ విజయ్ కుమార్, మెడికల్ ఆఫీసర్లు, సీడీపీవోలు, క్షయ నియంత్రణ సిబ్బంది, డిప్యూటీ డెమో,ఆర్ బిఎస్‌కే సిబ్బంది, ఆశా నోడల్ పర్సన్స్, టీబీ అలర్ట్ ఇండియా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, స్టేట్ టెక్నికల్ మేనేజర్ హెప్సిభా, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గుండె సురేందర్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వేగంగా భూ భారతి దరఖాస్తులు పరిష్కారం : కలెక్టర్ రిజ్వాన్‌బాషా




ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: భూ భారతిలో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో భూ భారతి జాతీయ కుటుంబ లబ్దిపథకం, సన్న బియ్యం బీఎల్‌వోలకు శిక్షణ తదితర అంశాపై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తుకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ అవసరమని, రికార్డ్‌లో ఆధారాలు లేకుంటే నోటీసు ఇచ్చి సంజాయిషీ ఇస్తూ పరిష్కరించాలన్నారు. సాదాబైనామా, అసైన్డ్ లాండ్‌లను దశల వారీగా పరిష్కరించాలన్నారు. సన్నబియ్యం పంపిణి వేగవంతంగా చేసేందుకు డీలర్లతో సమావేశం ఏర్పాటుచేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంతు నాయక్, జిల్లా సివిల్ సప్లై డీఎం హతిరామ్ ఉన్నారు.

# రీల్



## 'రాజా సాబ్'తో మాళవిక మోహనన్ ఎంట్రీ

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవిక మోహనన్ రెబెల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్'తో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. రీసెంట్ గా రిలీజైన ఈ సినిమా టీజర్ లో మాళవిక స్టన్నింగ్ లుక్స్, బ్యూటిఫుల్ అప్పీయరెన్స్ ఆడియెన్స్ ను ఆకట్టుకుంది. 'రాజా సాబ్' టీజర్ కు మాళవిక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటున్న నేపథ్యంలో మాళవిక మోహనన్ సోషల్ మీడియా ద్వారా స్పందించింది. 'రాజా సాబ్' టీజర్ కు వస్తున్న రెస్పాన్స్ తో హ్యాపీగా ఫీలవుతున్నట్లు ఆమె తెలిపింది. ప్రభాస్ ను ఫస్ట్ టైమ్ సెట్స్ లో కలిసిన సందర్భాన్ని స్పెషల్ మూమెంట్ గా తాను ఫీలైనట్లు మాళవిక తెలిపింది. ప్రభాస్ ఎంతో గౌరవంగా, స్నేహంగా ఉంటారని, బాగా మాట్లాడతారని ఆమె పేర్కొంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'రాజా సాబ్' డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.



## ఆగస్టు 14న 'వార్ 2'

బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ ప్రస్తుతం 'వార్ 2'తో బిజీగా ఉన్నారు. యాక్షన్, డ్యాన్స్ లతో ప్రేక్షకులకు కనువిందు చేసే హృతిక్ సూపర్ గూఢచారి అయిన కబీర్ పాత్రను మళ్లీ కనిపించనున్నారు.'వార్' చిత్రంలో కబీర్ పాత్రలో హృతిక్ కనిపించిన తీరు, ఆయన స్టైలింగ్, లుక్స్, క్యాస్టూమ్స్‌కు ఇండియన్ బాక్సాఫీస్ షేక్ అయిన సంగతి తెలిసిందే. ఇక 'వార్ 2'లోనూ హృతిక్ మళ్లీ కబీర్ పాత్రలో అలరించనున్నాడు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'వార్ 2' టీజర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.హృతిక్ క్యాస్ట్యూమ్స్, స్టైలింగ్ గురించి వచ్చిన ప్రశంసలతో కాస్ట్యూమ్ డిజైనర్ అనైతా ష్రాఫ్ అడజానియా ఉబ్బితబ్బిబ్బైపోయారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ 'ఈ చిత్రం హృతిక్ పాత్రను, ఆయన స్టైలింగ్‌ను మరింత స్పెషల్‌గా డిజైన్ చేశాం. ధూమ్ 2, బ్యాంగ్ బ్యాంగ్, వాణిజ్య ప్రకటనల్లో హృతిక్‌తో కలిసి పనిచేయడం నా అదృష్టం. పైగా కబీర్ పాత్రలోని ఒంటరితనం, ఆ పాత్రలోని దేశ భక్తి ఇలా అన్నీ వ్యక్తం అవ్వాలనే ఉద్దేశంతో క్యాస్ట్యూమ్స్ డిజైన్ చేశాను. సాదారణ దుస్తుల్లోనూ ఓ సూపర్ హీరోలా కనిపించాలని నేను అనుకున్నాను. ఈ సారి వార్ కంటే భిన్నంగా, మరింత అద్భుతంగా ఉండాలని కబీర్ పాత్ర కోసం శ్రమించాము. హెయిర్‌కట్ దగ్గర్నుంచి ప్రతీ విషయంపై ఎంతో శ్రద్ధ పెట్టాము. హృతిక్‌లో ఉండే ఆ అట్రాక్టివ్ పవర్‌ను మరింతగా మెరుగుపర్చేలా స్టైలింగ్ చేశాను' అని ఆమె అన్నారు.ఆదిత్య చోప్రా నిర్మాణంలో అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ 'వార్ 2'లో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ మధ్య ఢీ అంటే ఢీ అనే రీతిలో పోటీ పడనున్నారు. కియారా అద్వానీ మరో ప్రధాన పాత్రను పోషించారు. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది.



## భూమిక 'యుఫోరియా'నుండి రామ రామ సాంగ్

తెలుగు తెరపై స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన భూమిక చాలా రోజుల తరువాత మళ్లీ తెరపై కనిపిస్తోంది. గుణ శేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యుఫోరియా సినిమాలో భూమిక నటించింది. గతంలో గుణ శేఖర్, మహేష్ బాబు కాంబినేషన్ లో వచ్చిన ఒక్కడు సినిమాలో భూమిక నటించింది. యుఫోరియా సినిమాలో భూమిక పై తీసిన రామ రామ అంటూ సాగే పాటను ఈనెల 21న విడుదల చేయనున్నారు. తల్లి,కొడుకు మధ్య సాగే సెంటిమెంట్ కథతో ఈ చిత్రాన్ని గుణ శేఖర్ తెరకెక్కించారు. గుణ టీమ్ వర్క్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి నీలిమ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా పాటలు ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేస్తున్నారు.






## బిలీనియర్ వర్సెస్ బెగ్గర్ కథ

### శేఖర్ కమ్ములతో చిట్ చాట్

**ధనుష్, నాగార్జున, రష్మిక మందాన హీరో హీరోయిన్లుగా నటించిన కుబేర సినిమా విడుదల అవుతున్న సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల మీడియాతో 'చిట్ చాట్' చేశారు.**

**★ కుబేర తీయడానికి మోటివేషన్ ఏమిటి?**

మోటివేషన్ అంటూ ఏం లేదు కానీ ఇది ఒక ఇంట్రెస్టింగ్ లైన్ అనిపించింది. ఒక సూపర్ రిచ్ ప్రపంచం, ఇంకొకటి అట్టడుగున ఉండే ప్రపంచం. బిలినియర్ వర్సెస్ బెగ్గర్. అది ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. నిజానికి ఇది కథగా చెప్పడం చాలా కష్టం. చాలా పెద్ద పాయింట్. ఒక ఎమోషనల్ థ్రిల్లర్ గా తయారయింది. అక్కడ నుంచి డెవలప్ చేయడం జరిగింది. తనకి ఏమీ వద్దు అనుకునే ఒక బెగ్గర్.. తనకి ప్రపంచంలో అన్ని కావాలనుకునే ఒక బిలినియర్.. వారి మధ్య కాన్ ఫ్లిక్ట్ ఉంటే ఎలా ఉంటుందనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఈమధ్యకాలంలో చాలా సినిమాలు కథలు వస్తున్నాయి కానీ ఇలాంటి ఒక కథ నేను చెప్పినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి కథ డెఫినెట్ గా చెప్పబడాలి. ఈ కథ అవేర్నెస్ ని తీసుకొస్తుంది. సినిమాని తెలుగు తమిళ్ రెండు భాషల్లో షూట్ చేశాం. కథపరంగా ఎలాంటి మార్పు ఉండదు కానీ లెంత్ లో ఒక నిమిషం తేడా వుంటుంది. లిప్ సింక్ పరంగా ప్రతిది విడివిడిగా తీశాం. టెక్నికల్ గా రెండు సినిమాలు తీసినట్లే. అందుకే కొంచెం టైం పట్టింది.

**★ ఈ కథకు నాగర్జున మాత్రమే కావాలని పట్టుపట్టారని తెలిసింది?**

కొన్ని షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ నాగార్జున చేస్తే బాగుంటుంది. ఈ క్యారెక్టర్ కి ఆయన పర్ఫెక్ట్ యాప్ట్. ఆయనని స్క్రీన్ మీద చూసినప్పుడు ఒక వావ్ ఫ్యాక్టర్ ఉంటుంది. అయితే ఇందులో ఆయన్ని ఒక వేరే విధమైన యాక్టింగ్, మేనేజర్స్ తో క్యారెక్టర్ కి తగ్గట్టుగా చూపించడం జరిగింది. నాగార్జున గారు మనం, ఊపిరి ఇలా చాలా చిత్రాల్లో డిఫరెంట్ వేరియేషన్ ఉన్న క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఈ సినిమాలో కూడా ఆయన చాలా కొత్తగా కనిపిస్తారు. ఈ క్యారెక్టర్ లోకి ఆయన అద్భుతంగా ఇమిడిపోయారు.రష్మిక కూడా అందర్నీ సర్ ప్రైజ్ చేస్తుంది. ఈ క్యారెక్టర్ లో అద్భుతంగా నటించింది.

**★ కుబేర పాత్ర కోసం ధనుష్ ను ఎంపిక చేయడానికి కారణం?**

ఈ క్యారెక్టర్ ని ఆయన తప్పితే ఎవరూ చేయలేరు. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ కూడా ఇదే మాట చెబుతారు. అంతా అద్భుతంగా చేశారు. అవుట్ స్టాండింగ్ పర్ఫామెన్స్ అనేది చిన్న మాట. ఆ క్యారెక్టర్ లో ఇంకా ఎవరిని ఊహించలేరు. ఆయన సినిమా పూర్తి అయ్యేవరకూ ఆ క్యారెక్టర్ లోనే ఉంటారు. ఏదైనా సింగిల్ లో చేసేస్తారు.

**★ కుబేర కూడా మీ మార్క్ లోనే ఉంటుందా?**

నిజానికి నా మీద ఒక మార్క్ పడింది కానీ నేను ఒక మార్కు కోసం ఎప్పుడూ సినిమాలు చేయలేదు. కథకు ఏం కావాలో అదే చేశాను. అయితే ఎక్కువగా బ్లాక్ బస్టర్ ఆయన సినిమాలు మ్యూజికల్ హిట్స్, లవ్ స్టోరీలు ఉంటాయి కాబట్టి అలా ఒక ముద్ర వచ్చింది. లీడర్ సినిమా చాలా హానెస్ట్ గా చెప్పిన కథ. అందులో లవ్ స్టోరీ పెట్టాలి మంచి పాటలు పెట్టాలని అనుకోలేదు. హ్యాపీ డేస్ లో కూడా అంతే. కాలేజ్ స్టోరీ అంటే కాలేజ్ స్టోరీ లాగే ట్రీట్ చేయడం జరిగింది. అందుకే మీకు నచ్చింది. కుబేర కూడా అంతే. ఈ కథకు కావలసింది చేశాను. మార్క్ అనేది కథ ప్రకారం ఉంటుంది. అయితే ఇలాంటి కథని ఇలా చేశారా అనే ప్రేక్షకులు ఆశ్చర్యానికి గురవుతారు. అందుకే ఈ కంటెంట్ ఏంటనేది ట్రైలర్ టీజర్ లో క్లియర్ గా చెప్పాము. రిచ్, పూర్ మధ్య జరిగే కథని ముందుగానే ఎస్టాబ్లిష్ చేశాం.

**★ ఈ కథ ఐడియాలజీ ఎవరినైనా నొప్పించేలా ఉంటుందా?**

లేదండి. ఇది ఐడియాలాజికల్ బాటిల్ ఉండే సినిమా కాదు. అయితే సినిమా చూస్తున్నప్పుడు ఇలాంటి ఒక రెండు ప్రపంచాలు ఉన్నాయనే అవేర్నెస్ వస్తుంది. ఇది నా కెరీర్ లో భారీ బడ్జెట్ సినిమా. .నిర్మాతలు పుష్కర్ రామ్మోహన్ రావు, సునీల్ నారంగ్ సపోర్టు మర్చిపోలేనిది. ఇంత పెద్ద స్టార్ కాస్ట్, పెద్ద బడ్జెట్ నిర్మాతల వల్లే సాధ్యమైంది.

**★ సినిమాలో నాగార్జున ధనుష్ గారి క్యారెక్టర్స్ ఎలా ట్రావెల్ చేస్తాయి?**

అది మీరు సినిమాలోనే చూడాలి.చాలా బ్యూటిఫుల్ గా వుంటుంది.

ఈ సినిమా ప్రాసెస్ లో ఛాలెంజింగ్ అనిపించింది ఏమిటి ?

ముంబై షూట్ చాలా డిఫికల్ట్., అక్కడ పర్మిషన్స్ రావు. చాలా కండిషన్స్ ఉంటాయి. ముంబై వాళ్లే వేరే చోట షూట్ చేసుకుంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ షూట్ చేయడం అనేది చాలా చాలెంజింగ్ గా అనిపించింది.

**★ ముంబై బ్యాక్ డ్రాప్ తీసుకోవడానికి కారణం ఏమిటి?**

ఈ కథే ముంబై బ్యాక్ డ్రాప్ కోరుకున్నది. కథపరంగా ముంబై తప్పనిసరి.

**★ 25 ఇయర్స్ మీ జర్నీ చూసుకున్నప్పుడు ఎలా అనిపిస్తుంది?**

ఎక్కడో ఒక చిన్న ఇంట్లో ఫస్ట్ సినిమా తీశాను. ఇప్పుడు ఇంత పెద్ద సినిమా చేశాను. ఈ జర్నీ అంత చూసుకున్నప్పుడు ఎమోషనల్ గా అనిపిస్తుంది. ప్రేక్షకులు చాలా ప్రేమని ఇచ్చారు. ఎప్పుడు నాపై ఒక నమ్మకాన్ని ఉంచారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను. అది చాలా ఆనందాన్ని ఇచ్చే విషయం. నా సినిమాల్ని అప్రిషియేట్ చేసి ఆడియన్స్ నాకు ఒక స్థాయిని ఇచ్చారు. అంతకంటే నేను ఏం కోరుకోను.

**కుబేర కి పార్ట్ 2 ఉంటుందా?**

లేదండి. ఇక్కడితో అయిపోతుంది. నేను ఒక్కటి తీసినప్పటికే సరిపోతుంది.

**లీడర్ కి సీక్వల్ ఉంటుందా?**

అది నేను ఆలోచిస్తూ ఉంటాను. కథ నాకు క్లారిటీ ఉంది. కానీ లీడర్ తీసినప్పటికీ ఇప్పటికీ పరిస్థితులన్నీ చాలా మారిపోయాయి. దేశంలో, ప్రజల్లో చాలా మార్పులు వచ్చేసాయి. థింకింగ్ మారిపోయింది. దాన్ని సరిగ్గా పట్టుకోవాలి.

**నానితో ఒక సినిమా అనుకున్నారని విన్నాం ?**

షాలిడ్ గా అనుకోలేదు. దానికి కొంచెం టైం పడుతుంది. ఇంకా వర్క్ చేయాలి.



## స్మశానంలో స్థలం కోసం సాగే కథ ఉప్పు కప్పురంబు

మరణించినవారి సంఖ్య పెరిగిపోయిన కారణంగా స్మశానంలో చోటు తక్కువ అయిన ఒక పల్లెటూరి హాస్యభరిత చిత్రము ఉప్పు కప్పురంబు. సుహాస్ , కీర్తి సురేష్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ట్రెయిలర్ ను విడుదల చేశారు. ఎల్లనార్ ఫిలమ్స్ ప్రై లి. బ్యానర్ పై రాధిక లావూ నిర్మించగా, ఐ.వి. శశి దర్శకత్వం వహించారు. వసంత్ మరింగంటి రచించిన ఈ చిత్రం లోని ఇతర పాత్రల్లో బాబు మోహన్, తాళ్ళూరి రామేశ్వరి కీలక పాత్రలలో నటించారు. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా 240 దేశాలలో జులై 4న ప్రైమ్ వీడియో పై ప్రీమియర్ లో ప్రసారం కానుంది. తెలుగు తోపాటు హిందీ, తమిళం, మళయాళం మరియు కన్నడ భాషలలో డబ్బింగ్ మరియు ఇంగ్లీష్ తో కలిపి 12 భాషలలో సబ్‌టైటిల్స్ తో ప్రసారం అవుతుంది. చిన్నా పాత్ర ఇదివరకు నేను చేసిన పాత్రల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుంది, అని సుహాస్ ఈ సందర్భంగా అన్నారు.




## 'సోలో బాయ్' ట్రైలర్ విడుదల

సెవెన్ హిల్స్ బ్యానర్ పై వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా నటిస్తుండగా పసుపులేటి రమ్య, శ్వేత అవస్తి హీరోయిన్ లుగా నటించారు. పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, షఫీ, ఆర్కే మామ, భద్రం ఆనంద్ చక్రపాణి, సూర్య, ల్యాబ్ శరత్, అరుణ్ కుమార్, రజిని వర్మ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి త్రిలోక్ సిద్దు సినిమాటోగ్రాఫర్ గా పని చేయగా జుడా సంధ్య చిత్రానికి సంగీతం అందించారు. జులై 4వ తేదీన వెండిపై ప్రేక్షకులను అలరించబోతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ లో జరిగింది. ఆపరేషన్ సింధూర్ లో అమరుడైన తెలుగు జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరించారు.

## 'తెలంగాణ రైజింగ్-2047 విజన్' అద్భుతం

**ఇంగ్లాండ్ (యూకె) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంస, ఢిల్లీలో టోనీ బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం**



ప్రజాపక్షం / హైదరాబాద్: తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్2047 విజన్' అద్భుతంగా ఉందని ఇంగ్లాండ్ (యూకె) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997–2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా, సుదీర్ఘకా లం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్ రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన, వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టిబిఐజిసి) ను స్థాపించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు గంటకుపైగా సమావేశమైన అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టిబిఐజిసి ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని (లెటర్ ఆఫ్ ఇంటెంట్) పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో రైతులు, యువత, మహిళలు తదితర విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి టోనీబ్లెయిర్‌కు తెలియజేశారు. తెలంగాణ రైజింగ్–2047 ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు సిఎం తెలిపారు. మానవ అభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయనున్న సూక్ష్మ ప్రణాళికను యూకె మాజీ ప్రధానమంత్రికి సిఎం తెలియజేశారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ వంటి ప్రాజెక్టులపై టోనీబ్లెయిర్ ఆసక్తి చూపారు. సమావేశంలో తెలంగాణ నీటి పారుదల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎ.పి.జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల విభాగం సిఈఓ జయేశ్ రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, టిబిఐజిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## నా ప్రమేయం లేదు (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. విందు తర్వాత మునీర్‌తో కలిసి మాట్లాడుతూ, యుద్ధాన్ని విరమింపజేయడంలో తన ప్రమేయం లేదని ఒప్పుకున్నారు. కెనడాలోని కననిస్కిన్‌లో జరిగిన జి–7 సదస్సులో మోదీ–ట్రంప్ ముఖాముఖీ కలుసుకోలేకపోయారు. దీంతో మోదీ ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. భారత్–పాకిస్థాన్ వ్యవహారాలలో మూడో పక్షం జోక్యాన్ని ఎన్నటికీ తాము అంగీకరించబోదని చెప్పారు. పాకిస్థాన్ స్వయంగా చొరవచేసి భారత్‌కు విజ్ఞప్తి చేయడంవల్లనే మే 10వ తేదీన కాల్పుల విరమణ అవగాహన కుదిరిందని చెప్పారు. ఈ ఫోన్ కాల్ తర్వాత కూడా ట్రంప్ పాతపాటే అందుకున్నప్పటికీ, మునీర్‌తో కలిసి పత్రికాగోష్ఠిలో మాత్రం, చాలా తెలివైన రెండు దేశాల నాయకులు యుద్ధం కొనసాగించకూడదని గ్రహించి కాల్పుల విరమణ అవగాహనకు వచ్చారని అన్నారు. సైనికచర్య అణుయుద్ధానికి దారితియ్యకుండా విజ్ఞతతో వ్యవహరించారన్నారు. యుద్ధాన్ని ఆపడంలో పాకిస్థాన్ వైపు నుండీ ఈ వ్యక్తి ప్రధాన పాత్ర పోషించారని ట్రంప్ తన పక్కనే ఉన్న మునీర్‌ను ప్రశంసించారు. ''యుద్ధాన్ని కొనసాగించకుండా ముగించినందుకు ఆయనకు నా కృతజ్ఞతలు, మీకు తెలుసు కదా, ప్రధానమంత్రి మోదీకి కూడా నా కృతజ్ఞతలు, భారతదేశంతో ఒక వాణిజ్యం ఒప్పందం చేసుకుంటున్నాం, అలాగే పాకిస్థాన్‌తో కూడా వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాం'' అని ట్రంప్ చెప్పారు. ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌ను సందర్శించిన మోదీతో జరిపిన సమావేశాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. మునీర్‌ను కలుసుకోవడం తనకు ఎంతో గర్వంగా ఉందని ట్రంప్ అన్నారు. మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితుల గురించి తామిద్దరం చర్చించామని చెప్పారు. ట్రంప్‌తోపాటు మధ్యప్రాచ్య అమెరికా ప్రత్యేక ప్రతినిధి విట్ కాఫ్ విందులో పాల్గొన్నారు. మునీర్ వెంట పాకిస్థాన్ జాతీయ భద్రతాసలహాదారు, పాకిస్థాన్ గూఢచారిసంస్థ ఐఎస్ఐ ప్రధానాధిపతి, లెఫ్టినెంట్ జనరల్ ఆసిమ్ మాలిక్ ఉన్నారు. ట్రంప్‌తో విందు తర్వాత పాకిస్థాన్‌లో మునీ ర్ సెలబ్రిటీగా మారారు. దౌత్యరంగంలో ఇ దెంతో ఘనవిజయంగా పాకిస్థాన్ భావిస్తున్నది. పాకిస్థాన్ ఆర్మీ ఇస్లామాబాద్‌లో ఒక ప్రకటన చేస్తూ, పాకిస్థాన్‌తో పరస్పర ప్రయోజనాలతో కూడిన వాణిజ్య సంబంధాలు కొనసాగించేందుకు ట్రంప్ ఎంతో ఆసక్తి చూపించారని, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజన నిబంధనలే పునాదిగా ఈ సంబంధాలుంటాయని పేర్కొంది.

## ఆర్థిక స్వావలంబన (మొదటి పేజీ తరువాయి)

ఆశ్రమ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కుట్టు మిషన్ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్, ధృవపత్రాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చాలా మంది నైపుణ్యం లేని కారణంగా ఉపాధికి దూరంగా ఉంటున్నారని, దూర ప్రాంతాలకు పనికోసం వెళ్ళి మరల ఇంటికి వెనుదిరిగి వస్తున్నారని, ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకొని మహిళలు ఉన్న దగ్గరనే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో వారికి ఈ కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కొరకు కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. వివిధ పాఠశాలల్లో అవసరమైన మేరకు ఏకరూప దుస్తులను మహిళా సంఘాలకు ఆర్డర్ ఇచ్చి వారి ద్వారా విద్యార్థులకు బట్టలు కుట్టించడం ద్వారా మహిళా సంఘాలకు దాదాపు 30 కోట్ల రూపాయల లాభం వారికి చేకూర్చడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో రాబోయే విద్యా సంస్థలలోని పిల్లలకు కూడా మహిళా సంఘాల ద్వారానే బట్టలు కుట్టేలా వారికి ఆర్డర్‌లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 15 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలలోపు వయస్సున్న మహిళలు అందరూ తప్పకుండా మహిళా సంఘాలలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అందులో భాగంగానే సంఘాలకు పెట్రోల్ బంక్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, బస్సులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను అందించడం జరుగుతుందని అన్నారు. మహిళలు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని, తద్వారా తెలంగాణ ప్రగతి పథంలో నడిచేలా మనమంతా ముందడుగు వేద్దామని అభిలషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా సంక్షేమాధికారి తుల రవి, డేటాప్రో సంస్థ నిర్వాహకులు రవీందర్, డిఎస్‌పి రవీందర్, ట్రైబల్ వెల్ఫేర్ డి పోచం, ఎంపిడి రామకృష్ణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డిహెచ్ఈడబ్ల్యూ) డిఎంసి రమాదేవి, డిసిపిఓ జె ఓంకార్, ఐసిడిఎస్ ములుగు ప్రాజెక్టు పరిధిలోని వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, డిసిపియూ, సిహెచ్ఎల్, సఖి, డేటాప్రో సంస్థల సిబ్బంది, శిక్షణలో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## క్షిపణులు చూశాం... (మొదటి పేజీ తరువాయి)

మోతను విన్నాం. మేం భయపడ్డాం' అని గురువారం తెల్లవారుజామున మొదటి తరలింపు విమానంలో ఇరాన్ నుంచి భయంతో వణుకుతోన్న గొంతుకతో ఢిల్లీకి చేరుకున్న ఎంబిబిఎస్ విద్యార్థి మీర్ ఖలీఫ్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడారు. భారతదేశం పంపించిన విమానంలో ఊర్మియా యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన 90మంది విద్యార్థులు సహా 110మంది ఢిల్లీ చేరుకున్నారు. అందులో మీర్ ఖలీఫ్ ఒకరు. తొలుత టెహ్రాన్ నుంచి పొరుగుదేశమైనర ఆర్మేనియాకు వెళ్లి, అక్కడ నుంచి స్వదేశానికి చేరుకున్నారు. వారందరినీ 'ఆపరేషన్ సింధు'లో భాగంగా ఇండియన్ ఎంబసీ సురక్షితంగా ఢిల్లీకి చేర్చింది. కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ ఇరాన్ నుంచి భారత్ చేరుకున్న బాధిత వైద్యవిద్యార్థులకు ఢిల్లీ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఎంబిబిఎస్ విద్యార్థి మీర్ ఖలీఫ్ మాట్లాడుతూ ఇరాన్‌లో తమ అనుభవాన్ని ఒక పీడకలగా వర్ణించారు. 'టెహ్రాన్ నుంచి ఆర్మేనియాకు తీసుకెళ్లి అక్కడ నుంచి మమ్మిలను స్వదేశానికి తీసుకొచ్చిన భారత ప్రభుత్వానికి మేం కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని ఆయన జీరబోయిన స్వరంతో పేర్కొన్నారు. మేం క్షిపణులను చూశాం. బాంబుల మోతలు విన్నాం. ఇరాన్ ఒక వార్ జోన్‌గా మారింది. దాడుల సమయంలో మా భవనం ప్రకంపించింది. 'మేం ఎదుర్కొన్న భయానక పరిస్థితిని ఏ విద్యార్థి కూడా ఎదుర్కోకూడదు' అని నేను ఆశిస్తున్నానన్నారు. 'ఇరాన్‌లో ఇంకా కొందరు విద్యార్థులు చిక్కుకుని ఉన్నారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు చేర్చాలి. వారిని కూడా భారత ప్రభుత్వం విమానాల ద్వారా త్వరలోనే భారతదేశానికి చేరుస్తుందని నేను ఆశిస్తున్నాను' అని ఖలీఫ్ అన్నారు. కశ్మీర్‌కు చెందిన మరొక విద్యార్థి హుజైఫ్ మాలిక్ మాట్లాడుతూ 'కశ్మీర్ నుంచి 90 మంది విద్యార్థులం ఇరాన్‌లో ఉంటున్నాం. ఈరోజు ఉదయం మేం భారతదేశానికి చేరుకున్నాం. మేం ఇప్పుడు కశ్మీర్‌కు స్లీపర్ బస్సులలో వెళుతున్నాం. కొంతమంది విద్యార్థులు విమానాలలో వారి స్వస్థలాలకు పయనమయ్యారు' అని వివరించారు.

## యుద్ధోన్మాదం నశించాలి (మొదటి పేజీ తరువాయి)

నిరసన చేపట్టేందుకు వెళ్ళిన వామపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడిక్కడ అరెస్టు చేశారు. నార్సింగి, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లకు తరలించారు. సిపిఐ, సిపిఐ (ఎం), సిపిఐ(ఎంఎల్ )న్యూ డెమొక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, ఎంసిపిఐ(సి) ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో అమెరికా కాన్సులెట్ కార్యక్రమం వద్ద నిరసనకు పిలుపునిచ్చాయి. పాలస్తీనా గాజానగరం పై ఇజ్రాయిల్ అమానుష దాడి సరైనది కాదని, తక్షణమే ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ డిమాండ్ చేశారు.గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి ఏరియాలోని అమెరికన్ కౌన్సిలేట్ కార్యాలయం ముందు పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడి నిరసిస్తూ గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ,సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నరసింహ,సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు కె రామస్వామి,జిల్లా కార్యవర్గ సభ్యులు టి రామకృష్ణ,ఎం ప్రభు లింగం,జిల్లా సమితి సభ్యులు కె చందు యాదవ్,ఆనంద్ గౌడ్, విజయనంద్ గౌడ్,న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటరామయ్య, గోవర్ధన్, సిపిఐ ఎమ్మెల్యే లిబరేషన్ నాయకులు రమేష్ రాజు,ఎస్ యుఐ(సి) నాయకులు మురహరి,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్, సీనియర్ నాయకులు శంకరయ్య, తదితరులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.గండిపేట మండలం నార్సింగి పోలీస్ స్టేషన్ కు పద్మ తో పాటు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, తదితరులను తరలించారు.ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ మాట్లాడుతూ పాలస్తీనాలోని గాజానగరంపై ఇజ్రాయిల్ పలు దఫాలుగా బాంబులను ప్రయోగించి అమాయక ప్రజలను అమానుషంగా చంపడం దుర్మార్గమని, యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దేశానికి వివిధ దేశాల నుండి వెళ్లే ఆహార ఇతర వస్తువులను దిగుమతి చేయకుండా కఠినమైన చర్యలు తీసుకుని, తక్షణమే యుద్ధాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం తమ వైఖరి స్పష్టం చేయాలని,ఇలాంటి యుద్ధాలకు అనుకూలమా, వ్యతిరేకమా చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం వల్ల ప్రపంచ శాంతి ఉండదని, ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతాయని, ఇజ్రాయిల్ దేశానికి ఆయుధా,ఆర్థిక సరఫరా చేస్తూ అండగా నిలిచిన అమెరికా ఆధిపత్యం ప్రపంచానికి కనబడుతున్న.. భారత ప్రధాని నరేంద్ర మోదీ నిస్సిగ్గుగా అమెరికా దేశానికి ట్రంప్ కు సపోర్టుగా ఉండడం బాధాకరమని వారు తీవ్రంగా మండిపడ్డారు. వామపక్ష పార్టీల నాయకులు పశ్య పద్మ, ఈ టి నరసింహ, పాలమాకుల జంగయ్య,జాన్ వెస్లీ,హన్మేష్, వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్, సంధ్య, అనురాధ,మురహరి, ప్రసాద్, సుహాస్, ఎస్ వెంకటేశ్వరరావు, కె ఎస్ ప్రదీప్, నేదునూరి జ్యోతి, కే కాంతయ్య, ఛాయాదేవి, స్టాలిన్ , ప్రభు లింగం, డీజే నరేంద్ర ప్రసాద్ , వజ్రాల అరుణ,బాస్ పల్లి, భార్గవి తదితరులు నిరసన కార్యక్రమం లో పాల్గొన్నారు. పశ్యపద్మ, పాలమాకుల జంగయ్య, జాన్ వెస్లీ, హన్మే ష్, వేములపల్లి వెంకట్రామయ్య గోవర్ధన్ సంధ్య దాదా పు వంద మంది అరెస్ట్ అయ్యారు.






**అమెరికా సామ్రాజ్య వాద కక్షలో భాగమే పాలస్తీనా యుద్ధం : కూనంనేని సాంబశివరావు**

భద్రాద్రి కొత్తగూడెం : ఆయుధ వ్యాపారాన్ని విస్తరింపజేసుకునేందుకు దేశాల మధ్య చిచ్చు పెడుతూ అమెరికా ఆయుధాలను ప్రేరేపిస్తోందని, ఇది ట్రప్ సామ్రాజ్యవాద కక్షకు ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం పరాకాష్టని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కొత్తగూడెంలో సిపిఐ,సిపిఎం, న్యూడెమోక్రసీ కార్యాలయాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ దేశాలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని క్రరపెత్తనం చేస్తోందని మండిపడ్డారు. రెండు దశాబ్ధాలుగా పాలస్తీన ప్రజలపై ఇజ్రాయేల్ నిరంతరం బాంబు, వైమానికి దాడులకు పాల్పడుతూ లక్షలాది మందిని పొట్టనపెట్టుకుంటూ మారణహోమాన్ని సృష్టిస్తుంటే అంతర్జాతీయ చట్టాలు, మానవహక్కులు హరించుకుపోతున్న పరిస్థితుల్లో పాలస్తీన ప్రజలకు యూవత్ ప్రపంచం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయేల్ జరుపుతున్న భీబత్సవాన్ని నిలిపిచేయాలని, శాంతి ఖాముఖులు రోడ్డెక్కి ఇతర దేశాలకు స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం ఎన్‌డి నాయకులు కె సురేందర్ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com